Prajalakshyam Telugu Daily
# ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 17 | సంచిక: 142 | కరీంనగర్ | మంగళవారం 13 అక్టోబర్ 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## హైదరాబాద్ చిన్నారి హత్య

**-ఛేదించిన పోలీసులు... డబ్బు కోసం కిడ్నాప్...**
**-తల్లిదండ్రులు డబ్బు ఇచ్చేంతవరకు దాచడం కష్టమని**
**-హత్య చేసిన సెక్యూరిటీ గార్డు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, అక్టోబర్ 12: హైదరాబాద్‌లోని బొల్లారం పరిధిలో ఐదేళ్ల చిన్నారి కిడ్నాప్, హత్య కేసును మల్కాజ్‌గిరి పోలీసులు ఛేదించారు. డబ్బు కోసం చిన్నారిని కిడ్నాప్ చేసిన గేటెడ్ కమ్యూనిటీలోని సెక్యూరిటీ గార్డు విక్రమ్ కుమార్.. అనంతరం ఆమెను హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసు వివరాలను 11లో

## ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు.. రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ

(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూఢిల్లీ, అక్టోబర్ 12 : దేశంలోని ఆరు రాష్ట్రాలకు గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ ఈ నియామకాలను ప్రకటించింది. వీరిలో నలుగురిని కొత్తగా నియ మించగా, మరో ఇద్దరు గవర్నర్లను బదిలీ చేశారు. రాష్ట్రపతి కార్యాలయం ప్రకటించిన వివరాల ప్రకారం.. సిక్కిం గవర్నర్‌గా దుష్యంత్ గౌతమ్, కేరళ గవర్నర్‌గా ఓం ప్రకాశ్ మాథూర్, తమిళనాడు గవర్నర్‌గా రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, కర్ణాటక గవర్నర్‌గా డాక్టర్ సుధాయాదవ్, ఒడిశా 11లో

# కుప్పానికి కృష్ణా జలాలు తీసుకెళ్తుంటే..



**- తెలంగాణలో ఎందుకు ఎత్తడం లేదు?**
**- మాజీ మంత్రి హరీశ్‌రావు**
**- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతోనే రాష్ట్రంలో కరువు పరిస్థితులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, అక్టోబర్ 12 : ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా నది జలాలను 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు తీసుకెళ్లి వినియోగిస్తుంటే, తెలంగాణలో మాత్రం అదే కృష్ణా నది నుంచి నీటిని ఎందుకు ఎత్తడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం కారణంగానే రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ నుంచి కృష్ణా, గోదావరి నదులు ప్రవహిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నీటిని సద్వినియోగం చేసుకోవడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణలో నీటిని 11లో

ఓట్ల చోరీలో సీఈసీ ప్రధాన

# సూత్రధారి కాదు



**- కాంగ్రెస్ పక్ష నేత రాహుల్‌గాంధీ**
**- రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలి**
**- మోదీ, అమిత్ షా, అజిత్ దోవల్, అదానీల**
**- ఒత్తిడితోనే వ్యవహరించారని ఆరోపణ**

(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూఢిల్లీ, అక్టోబర్ 12 : ఓట్ల చోరీ వ్యవహారంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ప్రధాన నేరస్థుడు కాదని, ఆయన వెనుక ఉండి ఈ వ్యవహారాన్ని నడిపించిన అసలు సూత్రధారులను బయటపెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత, ఎంపీ రాహుల్‌గాంధీ అన్నారు. సీఈసీ తన పదవికి రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలని సూచించారు. అలా చేస్తే ప్రతిపక్షాలు ఆయనను క్షమించే అవకాశం కూడా ఉందని వ్యాఖ్యానించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు కొనసాగిస్తామని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. భారీగా భద్రతా బలగాలను మోహరించడం, నిరసనకారులపై అణచివేత చర్యలకు పాల్పడటం ద్వారా సీఈసీని కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సీఈసీకి మీరు ఇచ్చే సలహా ఏమిటని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలని సూచించారు. సీఈసీని ఉద్దేశించి రాహుల్‌గాంధీ మాట్లాడుతూ.. ఓట్ల చోరీ వ్యవహారంలో ఆయన తప్పు చేశారని, అయితే దాని వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఆయన కాదని అన్నారు. ఈ వ్యవహారానికి కారణమైన వ్యక్తులను బయటపెట్టేందుకే తాము ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. రాజీనామా చేసి నిజాలు వెల్లడిస్తే, అది దేశానికి, రాజ్యాంగానికి సేవ చేసినట్లవుతుందని వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, అదానీల ఒత్తిడి కారణంగానే సీఈసీ అలా వ్యవహరించారని తమకు 11లో



# సైనికుల రేషన్‌లో ‘భారత్ రైస్’...

**- ఎఫ్‌సీఐతో ఆర్మీ ఒప్పందం - నాణ్యమైన బియ్యం సరఫరాకు చర్యలు - లడఖ్, ఈశాన్య ప్రాంతాలకూ నేరుగా పంపిణీ**

(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూఢిల్లీ, అక్టోబర్ 12 : రక్షణ దళాల సైనికులకు నాణ్యమైన బియ్యాన్ని అందించేందుకు భారత సైన్యం ‘భారత్ రైస్’ సరఫరా విధానాన్ని అధికారికంగా ప్రారంభించింది. సైనికులకు అందించే రేషన్ నాణ్యతను మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. భారత్ రైస్ సేకరణ, పంపిణీకి సంబంధించి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ)తో భారత సైన్యం సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం, నాణ్యమైన బియ్యాన్ని స్థానిక ఎఫ్‌సీఐ 11లో

# బాధ్యతాయుతంగా పోరాడటం

**- ఇండియా కూటమి నేర్చుకోవాలి**
**- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్.**
**- ఆందోళనలతో ఢిల్లీ ప్రజలకు ఇబ్బందులు...**
**- ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలి...**



(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూఢిల్లీ, అక్టోబర్ 12 : ఇండియా కూటమి ఎంపీలు సుప్రీంకోర్టు మార్చ్, ఆందోళన చేపట్టడంపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ప్రతిపక్షాల నిరసనల వల్ల ఢిల్లీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సోమవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, ఇండియా కూటమి నేతలు ఈ విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఎన్నికల సంఘం నుంచి ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకుని, ఓట్ల చోరీకి సంబంధించిన ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలని ప్రతిపక్షాలకు ఈటల 11లో

# ఢిల్లీని విడిచి వెళ్లొద్దు..

**తెలంగాణ కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ కీలక ఆదేశాలు**



(ప్రజాలక్ష్యం బ్యూరో)

న్యూఢిల్లీ, అక్టోబర్ 12 : దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికల సంఘం పనితీరును నిరసిస్తూ ఇండియా కూటమి చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. తదుపరి సమాచారం ఇచ్చేవరకు ఢిల్లీని విడిచి హైదరాబాద్, తమ సొంత ప్రాంతాలకు వెళ్లవద్దని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం నిర్ణయాలు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు నిరసన వ్యక్తం చేస్తున్న వేళ.. తెలంగాణ రాష్ట్ర నేతలంతా అందుబాటులో ఉండాలని నాయకత్వం సూచించినట్లు సమాచారం. ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఇండియా కూటమి నేతలు ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి చేరుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో నిర్వహించిన ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఓటర్ల హక్కులకు భంగం కలగకూడదని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై విమర్శలు 11లో

# ఆజామ్‌నగర్‌లో అశోక్ మృతదేహం లభ్యం..

**- నాలుగు రోజుల ఉత్కంఠకు తెర!**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, అక్టోబర్ 12 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆజామ్‌నగర్‌లో నాలుగు రోజులుగా మిస్టరీగా మారిన జడల అశోక్ మృతి ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. గ్రామ శివారులో అశోక్ మృతదేహం సోమవారం లభ్యమైనట్లు సమాచారం అందుతోంది. దీంతో ఇన్నాళ్లుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడినట్లయింది. ఆజామ్‌నగర్‌కు చెందిన అశోక్ నాలుగు రోజుల క్రితం అడవికి వెళ్లిన సమయంలో వన్యప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందినట్లు ప్రచారం జరిగింది. అయితే, ఆయన మృతదేహం ఆచూకీ లభించకపోవడంతో ఈ ఘటన మిస్టరీగా మారింది. అశోక్ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే గ్రామ శివారులో ఆయన మృతదేహం లభ్యమైనట్లు సమాచారం వెలువడింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఉక్రెయిన్ యుద్ధంలో మృతిచెందిన తెలంగాణ వాసి కుటుంబానికి సాయం

**- సుదర్శన్ గౌడ్ కుటుంబానికి అండగా నిలిచిన సీఎం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, అక్టోబర్ 12 : రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పందించారు. బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.6 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లిన సుదర్శన్ గౌడ్ క్షిపణులు, డ్రోన్ దాడుల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల ముఖ్యమంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో 11లో

# రైతు వేదికల వద్దకు రావాలంటూ రైతులతో ఆటలా?

**- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు**
**- సీఎం వీడియో కాన్ఫరెన్స్‌పై పదేపదే మారిన సమాచారం.. ప్రభుత్వంపై విమర్శలు.**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, అక్టోబర్ 12: రాష్ట్రంలో రైతులు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వ్యవసాయ శాఖ అధికారులు చిన్నపిల్లల ఆటలాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితులపై ఆందోళనలు వ్యక్తమవుతుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు గోవా, ఢిల్లీ పర్యటనల్లో ఉన్నారని విమర్శిం చారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎల్‌నినో నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు రైతు వేదికల వద్ద సమావేశం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఉదయం 11 గంటలకల్లా రైతులంతా రైతు వేదికలకు 11లో

# నకిలీ పత్తి విత్తనాల అక్రమ వ్యాపారం..
# మాజీ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ అరెస్ట్

**- రూ.20 లక్షల విలువైన 40 క్వింటాళ్ల విత్తనాల సరఫరాలో సహకరించినట్లు ఆరోపణలు**
**-వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ నితికా పంత్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, అక్టోబర్ 12 : నకిలీ పత్తి విత్తనాల అక్రమ కొనుగోలు, విక్రయాలు, రవాణా కేసులో గతంలో కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐగా పనిచేసిన సేగ్యం వెంకటేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇతర నిందితుల వాంగ్మూలాలు, కాల్ డీటెయిల్స్ రికార్డులు (సీడీఆర్), సాంకేతిక ఆధారాలు, ఇతర వివరాలను పరిశీలించిన అనంతరం అతడిని మూడో నిందితుడిగా (ఏ-3) గుర్తించినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. 2026 ఆగస్టు 11న ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు సమీపంలో నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఆసిఫాబాద్ పోలీసులు, మండల వ్యవసాయ అధికారి సహకారంతో టీజీ 19 బీ 1120 నంబరు గల నలుపు రంగు కియా కారును తనిఖీ చేశారు. అందులో ఉన్న షేక్ సల్మాన్ (ఏ-1), ఆరె వేణుగోపాల్ రెడ్డి (ఏ-2) వద్ద నాలుగు పాలిథిన్ సంచుల్లో సుమారు రెండు క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 292/2026గా భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 318(4), సీడ్స్ యాక్ట్ సెక్షన్ 19, పర్యావరణ పరిరక్షణ చట్టం సెక్షన్ 15(1) కింద కేసు నమోదు చేశారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి న్యాయ స్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తులో షేక్ సల్మాన్ 2025 నుంచి నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు వెల్లడైందని ఎస్పీ తెలిపారు. గతంలో నకిలీ విత్తనాల కేసులో అప్పటి టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ వెంకటేష్ తనను అదుపులోకి తీసుకున్న సమయంలో పరిచయం ఏర్పడిందని సల్మాన్ వాంగ్మూలంలో పేర్కొన్నట్లు 11లో

చిన్నారి హత్య నిందితుడిని అప్పగించాలని

# బంధువుల ఆందోళన

**- డీసీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత**
**- నిందితుడిని ఉరితీయాలని అపార్ట్‌మెంట్ వాసుల డిమాండ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, అక్టోబర్ 12 : సికింద్రాబాద్ డీసీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదేళ్ల బాలిక మోసెస్ అరులియాను హత్య చేసిన నిందితుడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ చిన్నారి బంధువులు ఆందోళనకు దిగారు. నిందితుడిని వెంటనే ఉరితీయాలని కౌకూర్‌లోని విల్లా ఆర్చిడ్స్ అపార్ట్‌మెంట్ వాసులు డిమాండ్ చేశారు. కౌకూర్‌లోని విల్లా ఆర్చిడ్స్ అపార్ట్‌మెంట్‌లో మిల్టన్ తన కుటుంబంతో నివసిస్తున్నాడు. అతడి కుమార్తె మోసెస్ అరులియా శనివారం రాత్రి అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఆడుకుంటూ అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు అపార్ట్ మెంట్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో చిన్నారి కోసం 11లో

# నిరుద్యోగులకు ‘పొంగులేటి శీనన్న యువనేస్తం’..

**- ఏడాది పాటు రూ.40 వేల విలువైన ఫ్రీ కోచింగ్!**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, అక్టోబర్ 12: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ యువతకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుభవార్త అందించారు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఏడాది పాటు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించేందుకు ‘ పొంగులేటి శీనన్న యువనేస్తం ’ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తన సొంత నిధులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఒక్కో అభ్యర్థికి సుమారు రూ.40 వేల విలువైన శిక్షణను ఉచితంగా అందించడం ఈ పథకం ప్రత్యేకత. అర్హులైన యువత కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు నిర్వాహకులు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఎంతోమంది యువత రోజూ కష్టపడి చదువుతున్నారు. అయితే.. కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకోవడం ఖరీదైన వ్యవహారం కావడంతో అది అందరికీ సాధ్యం కావడం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన అభ్యర్థులు నాణ్యమైన శిక్షణ కోసం తీవ్ర ఇబ్బందులు 11లో

# రేపు ఖనిలో కేటీఆర్ పర్యటన

## 'సింగరేణి కార్మిక గర్జన' సభకు ఏర్పాట్లు షురూ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, అక్టోబర్ 12 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, తెలంగాణకు గుండెకాయలాంటి సింగరేణి సంస్థను నిర్వీర్యం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు ఈనెల 14న స్థానిక జవహర్లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా 'సింగరేణి కార్మిక గర్జన' పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు పార్టీ నేతలు ప్రకటించారు. అందులో భాగంగా సోమవారం జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, బాల్క సుమన్, పార్టీ ముఖ్య నేతలు కొబ్బరికాయ కొట్టి సభ ఏర్పాట్లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా టిబిజికెఎస్ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డితో కలిసి వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో మండిపడ్డారు. గత ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను దారుణంగా మోసం చేసిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో సింగరేణి కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తే, నేడు కొత్త మైనింగ్ తేకపోగా వేల కోట్ల రూపాయల అవినీతితో సంస్థను కుదేలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ సింగరేణి గడ్డపై సింహగర్జన చేసి కార్మికులకు అండగా నిలిచారని గుర్తుచేశారు. నేడు కాంగ్రెస్ పాలనలో కార్మికుల పొట్టకొడుతున్న పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేందుకే కేటీఆర్ ఈ సభకు వస్తున్నారని స్పష్టం చేశారు. రావాల్సిన బకాయిలు రాక, ఉత్పత్తి పడిపోయి, వైద్యం, సొంత ఇంటి పథకం వంటి సౌకర్యాలు అందక కార్మికులు అగమ్యగోచర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను, సంస్థను కాపాడుకోవడం కోసం ఈనెల 14న సాయంత్రం 5 గంటలకు జరిగే కేటీఆర్ బహిరంగ సభకు కార్మికులు, వారి కుటుంబాలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ ఆసిఫాబాద్

## - అదరగొట్టిన గిరిజన క్రీడా పాఠశాల ఆసిఫాబాద్ విద్యార్థినులు
## - ఫలించిన అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్ కృషి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, అక్టోబర్ 12:ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన 12వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో కొమురం భీం జిల్లాలో 4 గోల్డ్, 2 సిల్వర్, 6 బ్రాంజ్ మొత్తం 12 పతకాలుసాధించి ఓవరాల్ ఛాంపియన్ గా నిలువగా ద్వితీయ స్థానంలో ములుగు జిల్లా నిలిచింది. ఈ విజయం వెనుక అథ్లెటిక్ కోచ్ విద్యాసాగర్ నిరంతర కృషిదాగి ఉంది. ఒకవైపు క్రీడాకారులకు ఓవరాల్ ఛాంపియన్ కోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, మరొకవైపు 12వ రాష్ట్రస్థాయి పోటీల కోసం ఎలాంటి సాంకేతిక లోపాలు రాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం, మరొకవైపు కొత్తగా వేస్తున్న గిరిజన క్రీడా పాఠశాల గ్రౌండ్ ప్రిపరేషన్, ట్రాక్ మార్కింగ్, జావెలిన్ ఒ లాంగ్ జంప్ పిట్స్ తయారీ-ఈ మూడింటినీ ఏకకాలంలో సమర్థవంతంగా నిర్వహించి విజయాన్ని సాధించారు. ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించిన విద్యార్థినీలను జిల్లా కలెక్టర్ కె. హరిత, ఐటీడీఏ పీఓ మంద మకరంద్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ, ఏసీఎంఓ ఉద్ధవ్, డీఎస్ఓ షేకు, జీసీడీఓ శకుంతల, ప్రధాన ఉపాధ్యాయుడు లింబారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు మీనా రెడ్డి, ఎస్సీఆర్టీ రవీందర్, హెచ్‌డబ్ల్యూఓ విజయలక్ష్మి, హ్యాండ్ బాల్ కోచ్ అరవింద్, ఖో-ఖో కోచ్ తిరుమల్, పాఠశాల అధ్యాపక బృందం అభినందించారు. ముందు ముందు ఇలాంటి ఛాంపియన్ షిప్ లు మరెన్నో తీసుకోవాలని, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు కొట్నాక విజయ్ ,ప్రధాన కార్యదర్శి గుండం లక్ష్మణ్ తెలిపారు. అసోసియేషన్ సపోర్టు క్రీడా పాఠశాలకు ఎప్పుడూ ఉంటుందని తెలిపారు.





# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు

## - తాగునీటికి ప్రాధాన్యం.. సాగులో నష్టాలు తగ్గించాలి
## - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, అక్టోబర్ 12 : ఎల్‌నినో వంటి విపత్కర పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు, రైతులను కాపాడేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, రానున్న పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించేందుకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ఢిల్లీ నుంచి రైతులతో మాట్లాడారు. ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం ఎల్‌నినో ప్రభావం డిసెంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని, 2027 వరకు ఇలాంటి పరిస్థితులు కొనసాగవచ్చని భట్టి విక్రమార్క తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం కారణంగా ప్రజలు, రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాలు, తాగునీటి అవసరాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో గత నాలుగు నెలలుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, జిల్లా యంత్రాంగం ద్వారా ప్రభుత్వం అప్రమత్తం చేస్తోందని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు రైతులను కాపాడేందుకు సహకరించాలని కోరారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు, నీటి వనరులను పరిరక్షిస్తూ నష్టాలను తగ్గించుకోవాలని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం, శాస్త్రవేత్తల సలహాల మేరకు తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలను సాగు చేయాలని, నీరు అందుబాటులో లేని ప్రాంతాల్లో కొత్తగా పంటలు వేయవద్దని స్పష్టం చేశారు. కొత్తగా నాటిన ఉద్యాన పంటలను కాపాడుకోవడంతోపాటు విత్తనాల లభ్యత, పంటల ఎంపికపై వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. ఎల్‌నినోపై వదంతులను నమ్మవద్దని, రానున్న జూన్, జూలై వరకు వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, చెరువుల్లోని నీటిని సాగుకు కాకుండా తాగునీటి అవసరాలకే వినియోగించాలని, మనుషులు, పశువులకు నీటి కొరత రాకుండా అవసరమైతే రెండేళ్ల వరకు నీటిని నిల్వ చేసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సుమారు 15 లక్షల ఎకరాల వరి సాగు విస్తీర్ణం తగ్గిందని తెలిపారు. పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్రానికి 10 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేశామని, అందుబాటులో ఉన్న వనరులతో పంటలను పండించేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లోని నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించాలని, సాగునీటికి కేటాయించే అవకాశం లేదని స్పష్టం చేశారు. విద్యుత్ ఉత్పత్తిలోనూ సమస్యలు ఉన్నందున రైతులు నూనెగింజలు, పప్పుధాన్యాలు సాగు చేయాలని, ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడుకోవాలని, రబీలో తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలనే ఎంచుకోవాలని మంత్రి సూచించారు. రైతులకు విద్యుత్ సరఫరా సమయాన్ని తెలియజేయాలని, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయిలో కొనసాగించాలని, సోలార్ విద్యుత్ అవకాశాలను వినియోగించుకోవాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

భూగర్భ జలాలు, విద్యుత్ సరఫరాపై వాస్తవ పరిస్థితులను రైతులకు వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు వివిధ శాఖలు చేపడుతున్న చర్యలను వివరించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, విద్యుత్ శాఖ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఈఎన్‌సీ క్రుపాకర్ రెడ్డి, వాతావరణ శాఖ డైరెక్టర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జానయ్య, ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజిరెడ్డి, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ తదితరులు తమ శాఖల కార్యాచరణను వివరించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా కొత్తపల్లి (హెచ్) రైతు వేదిక నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌డీఓ గీత, విద్యుత్ శాఖ డీఈ రాజం, జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు హాజరయ్యారు.

# చలో ఢిల్లీ లో పాల్గొన్న డిసిసి సుగుణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, అక్టోబర్ 12: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతూ రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కుమురం భీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ విమర్శించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 'ఓట్ల చోరీ'కి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో ఢిల్లీ -- ప్రజాస్వామ్యం కోసం' నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఢిల్లీలో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులతో కలిసి ఆసిఫాబాద్ డిసిసి సుగుణ పాల్గొన్నారు.ఈ నిరసన ర్యాలీ తెలంగాణ భవన్ నుంచి బారాఖంబా రోడ్‌లోని మండి హౌస్ మీదుగా సుప్రీంకోర్టు సమీపం వరకు కొనసాగింది.ఓటు చోరీని అరికట్టాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలను పరిరక్షించాలని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా నినదించారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆత్రం సుగుణ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీరుపై విమర్శలు చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యా నికి పునాది అని, ఆ హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరిం చాలని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసి, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

# బ్యాంకులు, ఏటీఎంల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

## - సెక్యూరిటీ గార్డులు, నాణ్యమైన సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్ తప్పనిసరి
## - సీపీ అంబర్ కిషోర్ ఝా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, అక్టోబర్ 12 : బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నేరాల నియంత్రణకు బ్యాంకు అధికారులు పోలీసులతో సమన్వయంతో పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు. సోమవారం పోలీస్ కమిషనరేట్ లో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, వివిధ బ్యాంకుల అధికారులతో నిర్వహించిన సమీక్షలో భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు. కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి జోన్‌లో 109 బ్యాంకులు, 79 ఏటీఎంలు, మంచిర్యాల జోన్‌లో 109 బ్యాంకులు, 89 ఏటీఎంలు ఉన్నాయని సీపీ తెలిపారు. ప్రతి ఏటీఎం వద్ద 24 గంటలూ సెక్యూరిటీ గార్డు, నాణ్యమైన సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. భద్రతా ఆడిట్‌లో కొన్ని చోట్ల నాణ్యత లేని కెమెరాలు, సెక్యూరిటీ గార్డుల కొరత గుర్తించినట్లు పేర్కొన్నారు. బ్యాంకుల ప్రవేశ ద్వారాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ (డీఎఫ్ఎండీ), సెక్యూరిటీ గార్డులకు హ్యాండ్‌హెల్డ్ మెటల్ డిటెక్టర్ (హెచ్‌హెచ్ఎండీ) అందుబాటులో ఉంచాలని సూచించారు. గార్డుల వ్యక్తిగత వివరాలు, ఫోటోలతో కూడిన రికార్డులను నిర్వహించాలని, బ్యాంకు సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో స్పందించేలా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. సీసీ కెమెరాల డీవీఆర్‌లను దుండగులు ధ్వంసం చేయకుండా సురక్షితమైన రహస్య ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని, బ్యాంకుల లోపల, బయట అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను గమనించాలని సూచించారు. ఏటీఎంలలో నగదు నింపే సమయంలో స్థానిక పోలీసులకు ముందస్తు సమాచారం అందించాలని, పోలీస్ స్టేషన్, హెల్ప్‌లైన్ నంబర్లను బ్యాంకుల్లో స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. సెలవు రోజులు, తెల్లవారుజామున, బ్యాంకులు తెరిచే, మూసే సమయాల్లో, భోజన విరామ సమయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే డయల్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బ్యాంకు నుంచి నగదు, బంగారం తీసుకెళ్లే ఖాతాదారులను దుండగులు వెంబడించే అవకాశమున్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పార్కింగ్ ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాత్రివేళల్లో సెక్యూరిటీ గార్డుల పనితీరును ఆకస్మికంగా తనిఖీ చేయాలని, బ్యాంకు పని వేళల్లో గార్డులు ప్రధాన ద్వారం వద్ద విధులు నిర్వహించాలని ఆదేశించారు. భద్రతా చర్యల్లో నిర్లక్ష్యానికి తావివ్వరాదని సీపీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, రామగుండం సీఐ కృష్ణకుమార్, మంచిర్యాల టౌన్ సీఐ ప్రమోద్ రావు, గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీసీఎస్ ఎస్ఐలు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సేతు యాప్ ద్వారా ఇంటి నుండే దరఖాస్తు

## జిల్లా కలెక్టర్ కె.హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, అక్టోబర్ 12: జిల్లాలోని ప్రజలు ప్రజాసేతు యాప్ వాట్సాప్ నం.7569986036 కు తమ సమస్యలపై ఇంటి నుండే సందేశాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్ లతో కలిసి ప్రజాసేతు యాప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ మంత్రి ఆదేశాల ప్రకారం ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, ప్రజా సమస్యల పరిష్కార ప్రక్రియను సులభతరం చేయడం, ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా చేయడం లక్ష్యంగా ప్రజాసేతు యాప్‌ను ప్రారంభించడం జరిగిందని, ప్రజలు ఇంటి వద్ద నుండి తమ సమస్యలపై ప్రజాసేతు యాప్, వాట్సాప్ నం.7569986036 ద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా ప్రభుత్వ సేవలను మరింత సులభంగా పొందేందుకు ఈ విధానం దోహదపడుతుందని తెలిపారు. దూర ప్రాంతాలలో నివసించే ప్రజలకు, ప్రయాణం చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొనే వారికి ప్రజాసేతు సేవలు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. తమ దరఖాస్తు స్థితిగతులు, పరిష్కారాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం,వారి సమస్యలను సులభంగా పరిష్కరించే దృష్టితో తీసుకువచ్చే అవకాశాన్ని కల్పించడం లక్ష్యంగా ప్రజాసేతు సేవలు ఉపయోగపడతాయని తెలిపారు. ఆన్‌లైన్ లో నమోదు చేసుకునేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక వెబ్‌సైట్‌ను https://kbasifabad.in అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సమర్థవంతంగా స్వీకరించి, సంబంధిత సమస్యలను గుర్తించి, పరిష్కార ప్రక్రియను మరింత సులభతరం చేయడమే కాకుండా ప్రభుత్వ సేవలలో పారదర్శకతను పెంపొందించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జిల్లా ప్రజలు ప్రజా సేతు యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, అక్టోబర్ 12: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి గ్రామానికి చెందిన షేక్ జావిద్ తనకు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చింతల మానేపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన బొజ్జారెడ్డి మధిరెడ్డి తాను బూరుగూడ గ్రామంలో గల బీఈడీ కళాశాలలో బీఈడీ పూర్తి చేశానని, టీ.సి. ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కెరమెరి మండలం చౌపన్ గూడ గ్రామానికి చెందిన ఆత్రం రాము తాను కె ఫారం కొరకు దరఖాస్తు చేసుకున్నానని, జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. వాంకిడి మండలం తేజాపూర్ గ్రామానికి చెందిన వైరగడే వెంకటేష్ తాను ప్రధానమంత్రి స్వయం ఉపాధి పథకం క్రింద డైరీ ఫారం నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నానని, గ్రామపంచాయతీ నుండి ఎన్ ఓ సి ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కౌటాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన అల్లూరి చైతన్య తనకు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్- టి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన సాన తిరుపతి తన భూమిని ఇతరులు అక్రమంగా పట్టా మార్పిడి చేసుకున్నారని, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, పెండింగ్ లో ఉంచకూడదని తెలిపారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమానికి గైర్హాజరు అయిన 30 మంది జిల్లా అధికారులకు షో కాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ప్రతి ప్రభుత్వ శాఖ జిల్లా అధికారి తప్పనిసరిగా హాజరు కావాలని, సరైన సమాచారం లేకుండా గైర్హాజరు అయినట్లయితే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# బార్ కోసం.. బారులు తీరిన జనం

## - రాత్రి వరకు కొనసాగిన దరఖాస్తుల ప్రక్రియ
## - తొలిసారి ఎవరిని వరించేనో అదృష్టం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, అక్టోబర్ 12: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో తొలిసారి బార్ ఏర్పాటు కోసం నోటిఫికేషన్ వెలువడడంతో మద్యం వ్యాపారుల్లో సందడి నెలకొంది. గత నెల 26 న ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ నుండి ప్రకటన విడుదల అవ్వటంతో ముందు వ్యాపారులు ఎలాగైనా బారును సొంతం చేసుకోవాలని ప్రణాళికలు వేస్తూ దర ఖాస్తులను సమర్పిస్తున్నారు. జిల్లా ఏర్పాటు తర్వాత ఏర్పడిన నూతన మున్సిపాలిటీలో బార్ ఏర్పాటు కోసం చర్యలు చేపట్టడంతో ఆశావాహుల్లో ఆలజడి మొదలైంది. కొన్ని ఏళ్లపాటు మందు వ్యాపారంలో అనుభవం ఉన్న వ్యాపారులు, గతంలో వైన్ షాపులు దక్కని వారు ఎలాగైనా బార్ నైనా దక్కించుకోవాలని ఉత్సాహంతో దరఖాస్తులు చేస్తున్నారు. ఇతర జిల్లాల నుండి సైతం బార్ను దక్కించుకోవడానికి దరఖాస్తులను సమర్పిస్తున్నారు. దరఖాస్తుల ప్రక్రియకు సోమవారంతో చివరి రోజు కావడంతో ఆశావాహులతో జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న జిల్లా మద్యపాన నిషేధ కార్యాలయం వద్ద సందడి గా మారింది. పలువురు దరఖాస్తుదారులు క్యూ లైన్ లో నిలుచుని ఎక్సైజ్ అధికారులకు దరఖాస్తుల పత్రాలను అందజేశారు.

# కమిటీల ఏర్పాటుకు కాంగ్రెస్ కసరత్తు

## కార్పొరేషన్, డివిజన్ కమిటీలకు ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, అక్టోబర్ 12 : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతోపాటు, పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు సంస్థాగత పదవుల్లో సముచిత ప్రాధాన్యం కల్పించే లక్ష్యంతో నూతన కార్పొరేషన్, డివిజన్ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు సోమవారం ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గంగానగర్‌లోని జీఎం గార్డెన్‌లో 4, 5, 6, 7, 35వ డివిజన్ల కమిటీలతోపాటు కార్పొరేషన్ కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరించగా, గోదావరిఖని ప్రెస్ క్లబ్ పక్కన 8, 9, 36, 37, 38వ డివిజన్ల కమిటీల కోసం దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ముస్తఫా పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, డివిజన్ స్థాయిలో సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేయడం కమిటీల ఏర్పాటు లక్ష్యమని తెలిపారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ కార్పొరేటర్లు గట్ల రమేష్, ధూళికట్ట సతీష్, జంగంపల్లి రమాదేవి శ్రీనివాస్, కంకణాల మౌనిక రాజు, వేగోలపు రమాదేవి శ్రీనివాస్, మాటూరి సత్యప్రసాద్, తాళ్లపల్లి యుగేందర్, నెలకంటి రాము, ఫజల్ బేగ్, పర్లపల్లి పుష్పలత బాబు, కల్వల పద్మావతి రంజిత్‌తోపాటు ఆయా డివిజన్ల మాజీ అధ్యక్షులు, గతంలో కార్పొరేటర్లుగా పోటీ చేసిన అభ్యర్థులు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పదవుల ఆశావహులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఆధ్యాత్మిక వైభవానికి మరో మణిహారం

**- చిన్నజీయర్ స్వామి సమక్షంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన**

**- హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, అక్టోబర్ 12 : ఖమ్మం నగర ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంచేలా అల్లిపురం వద్ద శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు చిన్నజీయర్ స్వామి హాజరై ఆశీస్సులు అందించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఖమ్మం నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ ఆలయ నిర్మాణానికి సహకరించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు



నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు. మధ్యప్రదేశ్‌లో ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నప్పటికీ, తన విజ్ఞప్తిని మన్నించి ఖమ్మం వచ్చిన చిన్నజీయర్ స్వామికి మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు కూడా చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తుచేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఆలయ నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తికావాలని మంత్రి ఆకాంక్షించారు. భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా నిర్మించనున్న శ్రీవారి ఆలయం ఖమ్మం ఆధ్యాత్మిక ప్రాభవాన్ని ఇనుమడింపజేస్తూ, నగర కీర్తి ప్రతిష్ఠలకు ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు.

# భూపాలపల్లి జిల్లా అభివృద్ధికి పునాది వేసిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు

## జిల్లా దశాబ్ది ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, అక్టోబర్ 12 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయి 11వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూడో రోజు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను సందర్శించి అధికారులు, సిబ్బంది, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఏర్పాటుకు కృషి చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టులో న్యాయవాదులను, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని, కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులను, ప్రభుత్వ వైద్య కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందించి, మిఠాయిలు తినిపించి జిల్లా దశాబ్ది శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు ప్రకటించారు. జిల్లా కేంద్రంగా భూపాలపల్లి అభివృద్ధి చెందడం ఈ ప్రాంత చరిత్రలో కీలక మైలురాయి అని గండ్ర వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న భూపాలపల్లి జిల్లా ఏర్పాటుతో పరిపాలనా పరంగా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని అన్నారు. కలెక్టర్, ఎస్పీ, జిల్లా జడ్జితో పాటు వివిధ శాఖల అధికారులు స్థానికంగా అందుబాటులోకి రావడంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయని తెలిపారు. సమీకృత కలెక్టరేట్ సముదాయం



ద్వారా ఒకే ప్రాంగణంలో వివిధ శాఖల సేవలు అందుతున్నాయని, గతంలో చిన్నచిన్న పనుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగిపోయాయని వివరించారు. జిల్లాలో వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు, ఆసుపత్రి నిర్మాణం, విద్యా సదుపాయాల అభివృద్ధి ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చాయని పేర్కొన్నారు. కోర్టుల ఏర్పాటుతో న్యాయవాదులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజలకు న్యాయ సేవలు సులభతరమయ్యాయని గుర్తుచేశారు. జిల్లాకు అభివృద్ధి పునాదులు వేసిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: ప్రస్తుత ప్రభుత్వం గత మూడేళ్లలో భూపాలపల్లి జిల్లా అభివృద్ధిపై ఆశించిన స్థాయిలో దృష్టి సారించలేదని గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వడం కంటే ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే అభివృద్ధి కార్యక్రమాల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు. మిగిలిన పాలనా కాలంలోనైనా జిల్లాలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలకులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల పనులను వేగవంతం చేయాలి

## - పెండింగ్ పనులు గడువులోగా పూర్తి చేయాలి
## - ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, అక్టోబర్ 12 : గోదావరి పుష్కరాల కోసం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. సోమవారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి హైదరాబాద్ నుంచి గోదావరి తీర జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ ఐడీఓసీ సమావేశ మందిరం నుంచి పాల్గొన్నారు. పనుల పురోగతి, టెండర్లు, భూసేకరణ, నిధుల విడుదల, పుష్కర ఘాట్ల అభివృద్ధిపై సమీక్షించిన శైలజ రామయ్యర్.. రోడ్లు, భవనాల శాఖ టెండర్ల మినహాయింపు ప్రక్రియను త్వరగా పరిష్కరించాలని, భూసేకరణ నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. టెండర్లు పూర్తయిన నీటిపారుదల పనులను ప్రారంభించాలని, దేవాదాయ శాఖ పరిధిలో ఇంకా మొదలుకాని పనులను క్షేత్రస్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో నీటిమట్టాలు తగ్గిన తర్వాత పనులు ప్రారంభించి, నవంబర్‌లో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పుష్కర ఘాట్ల పొడవు, విస్తరణపై జిల్లా కలెక్టర్లతో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని, జిల్లాల అవసరాలు, పనుల ప్రాధాన్యతలను పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలు రూపొందించాలని ఆమె సూచించారు. ఈ అంశంపై



కలెక్టర్లు చర్చించి శనివారం నాటికి నిర్ణయానికి రావాలన్నారు. అదనపు నిధుల ప్రతిపాదనపై త్వరగా నిర్ణయం తీసుకునేందుకు ముందుగా క్యాబినెట్ సబ్‌కమిటీకి నోట్ పంపాలని శైలజ రామయ్యర్ తెలిపారు. జిల్లాల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులను గుర్తించి కలెక్టర్లు ప్రతిపాదనలు సమర్పించాలని, వాటి ప్రాధాన్యతలపై పరస్పరం చర్చించాలని సూచించారు. కలెక్టర్ల ప్రతిపాదనలపై క్యాబినెట్ సబ్‌కమిటీతో చర్చించిన అనంతరం తుది ప్రతిపాదనలు సమర్పించాలని స్పష్టం చేశారు. భద్రాచలంలో పుష్కర ఘాట్లకు, వైకుంఠధామానికి ప్రస్తుతం ఒకే మార్గం ఉండటంతో రద్దీ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా వైకుంఠధామానికి ప్రత్యేక మార్గం ఏర్పాటు చేసే అవకాశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులను తరలించేందుకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అంకిత్ ప్రత్యేక మార్గం ఏర్పాటును పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివిధ శాఖల పరిధిలోని పెండింగ్ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ గడువులోగా పూర్తి చేయాలని, కలెక్టర్లు, ఇంజినీరింగ్ శాఖల అధికారులు సమన్వయంతో కీలకమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ సునీత, ఇరిగేషన్ ఈఈ సయ్యద్ అహ్మద్ జానీ, పంచాయతీరాజ్ ఈఈ సత్యనారాయణ

# సింగరేణి లాభాల్లో 35 శాతం వాటా చెల్లించాలి

**- 2025-26 వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలని సీఐటీయూ ధర్నా.**

**- కాంట్రాక్టు కార్మికులకు 20 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, అక్టోబర్ 12 : సింగరేణి సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించారు. కాంట్రాక్టు కార్మికులకు సైతం లాభాల్లో 20 శాతం వాటా చెల్లించాలని కోరారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద నరసింహారావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, దసరా, దీపావళి పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్మికకుటుంబాలు లాభాల వాటా కోసం ఎదురు చూస్తున్నాయని తెలిపారు. అయితే సింగరేణి యాజమాన్యం, తెలంగాణ ప్రభుత్వం వాటా ప్రకటించడంలో తీవ్రజాప్యం చేస్తున్నాయని,దీంతో కార్మికుల్లో అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపునిస్తూ లాభాల్లో వాటాను వెంటనే ప్రకటించి చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణికి బొగ్గు, విద్యుత్ సరఫరాలకు సంబంధించి ట్రాన్స్‌కో,



జెన్‌కో నుంచి సుమారు రూ. 56 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ బకాయిల వసూళ్లలో జాప్యం సంస్థ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపుతోందని, కంపెనీ ఆర్థిక లావాదేవీలు, కార్మికుల సమస్యల పరిష్కారంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. బకాయిల వసూలుకు ప్రభుత్వం, యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. 2025--26 సంవత్సరానికి సింగరేణి సాధించిన వాస్తవ లాభాల వివరాలను వెల్లడించి, వాటిలో కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని, సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు 20 శాతం వాటా అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జీఎం పర్సనల్, ఐఆర్ అండ్ పీఎం కిరణ్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా రమేష్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు కొత్తపల్లి రమేష్ బాబు, గడల నరసింహారావు, శ్రీరామ్ మూర్తి, పీవీ లక్ష్మీనారాయణ,కాంట్రాక్టు కార్మికసంఘంనాయకులు మాతంగి రాజేష్, జి. సక్రులు పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లాలో పోలీసు నిఘా మరింత పటిష్ఠం : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**- 467 సీసీటీవీ కెమెరాలతో జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, అక్టోబర్ 12 : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, గుర్తింపు, దర్యాప్తును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలీసు నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఇందులో భాగంగా చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలతో పాటు పోలీస్ స్టేషన్లలోని కెమెరాలను ఈ కేంద్రానికి అనుసంధానించారు. ప్రస్తుతం మొత్తం 467 సీసీటీవీ కెమెరాల ద్వారా జిల్లాలోని పలు ప్రాంతాలపై నిరంతర నిఘా కొనసాగించేలా వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడం, నేరాల నియంత్రణ, అత్యవసర సమయాల్లో తక్షణమే స్పందించడం సులభతరమవుతుందని తెలిపారు. సీసీటీవీ నిఘా వ్యవస్థ నేరాల ఛేదనలో కీలక పాత్ర పోషించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి,



వాటిని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని స్పష్టం చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణికి 138 దరఖాస్తులు

**- పెండింగ్ అర్జీల పరిష్కారంపై శాఖల వారీగా కలెక్టర్ చిత్రా మిశ్రా సమీక్ష.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కరీంనగర్, అక్టోబర్ 12 : ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులతో పాటు వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 138 దరఖాస్తులు అందగా, వాటిని పరిశీలించి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు బదిలీ చేశారు. అనంతరం వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై కలెక్టర్ శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా పోలీసు, పంచాయతీ, భూ సర్వే, రిజిస్ట్రేషన్, విద్యుత్, మున్సిపల్ కార్పొరేషన్ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లాలోని వివిధ కార్యాలయాలకు అందిన దరఖాస్తుల వివరాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వాటిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించి, ప్రజలకు సత్వర సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, ఆర్డీవో షర్మిలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సామాజిక మాధ్యమాల వినియోగంలో యువతులు అప్రమత్తంగా ఉండాలి

**చైల్డ్ హెల్ప్‌లైన్--1098 జిల్లా సమన్వయకర్త ఆవుల సంపత్ యాదవ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, అక్టోబర్ 12 : యువతులు సామాజిక మాధ్యమాలు, అంతర్జాలాన్ని వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యతనిస్తూ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని చైల్డ్ హెల్ప్‌లైన్--1098 జిల్లా సమన్వయకర్త ఆవుల సంపత్ యాదవ్ సూచించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని బ్యాంక్ కాలనీలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూ--జీకేవై) పథకం కింద ఎస్.వి.ఎన్.ఎస్. సంస్థ నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న యువతులు, మహిళలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ యాదవ్ మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాలు, అంతర్జాలాన్ని బాధ్యతాయుతంగా వినియోగించాలని, అనవసరమైన అలవాట్లకు దూరంగా ఉంటూ అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో వ్యవహరించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. యువతులు ఆత్మవిశ్వాసంతో తమ లక్ష్యాలను నిర్దేశించుకొని, నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. శిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత భద్రతపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకునేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత సమన్వయకర్త శ్రీలత, శిక్షణ కేంద్రం నిర్వాహకురాలు మమత, జ్యోతి, శిక్షకులు శ్రావ్య, అనిల్, రాములు, శ్రీనివాస్, రమేష్, మనోజ్‌తో పాటు శిక్షణార్థినులు పాల్గొన్నారు.

# బిట్స్ పాఠశాల చైర్మన్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

## ఆర్టీఐ కార్యకర్త కుసుమ రామకృష్ణ డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, అక్టోబర్ 12 : భూపాలపల్లి పట్టణంలోని మహేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్, బిట్స్ పాఠశాల అధినేత డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సమాచార హక్కు చట్టం కార్యకర్త కుసుమ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, భూపాలపల్లి పట్టణంలో గతంలో మూతపడిన శాంతినికేతన్ విద్యాలయానికి సంబంధించిన రెన్యువల్, షిఫ్టింగ్ ప్రక్రియలో తప్పుడు పత్రాలు సమర్పించి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. శాంతినికేతన్ పాఠశాలకు సంబంధించిన పూర్తి ఫైల్ వివరాలను సమాచార హక్కు చట్టం కింద కోరినట్లు తెలిపారు. అయితే, ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేసుకొని, బిట్స్ పాఠశాల పేరుతో కొత్త ఫైల్ సమర్పించి ప్రారంభ అనుమతి పొందినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా, శాంతినికేతన్ పాఠశాల యూ-డైస్‌లో నమోదైన విద్యార్థుల ప్రవేశాలను భూపాలపల్లిలోని బిట్స్ పాఠశాలలో అక్రమంగా నమోదు చేసినట్లు రామకృష్ణ ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, తప్పుడు పత్రాల సమర్పణ ద్వారా ప్రభుత్వాన్ని, విద్యాశాఖను మోసగించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మహేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ పరిధిలోని బిట్స్ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయడంతో పాటు, పాఠశాల చైర్మన్ డాక్టర్ ఎ. రాజేంద్రప్రసాద్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

# రైతులను గాలికొదిలి.. ఢిల్లీకి యాత్రలా?

**- క్యాబినెట్ భేటీ వాయిదాపై నిరంజన్‌రెడ్డి ఆగ్రహం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, అక్టోబర్ : 12 : రైతుల సమస్యలను గాలికొదిలి సీఎం, మంత్రులు ఢిల్లీకి వెళ్లడమేమిటని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావంపై చర్చించేందుకు కీలక క్యాబినెట్ సమావేశం నిర్వహించడంతోపాటు రైతువేదికల్లో రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించి, వాటిని వాయిదా వేసి ఢిల్లీ పర్యటనకు వెళ్లడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అబద్ధాలతోనే పాలన సాగిస్తోందని ఆరోపించారు. మొన్నటివరకు ఆరుతడి పంటలు సాగు చేయాలని ప్రచారం చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు రెండో పంట వేయొద్దని రైతులను హెచ్చరించడం దుర్మార్గమన్నారు. సాగునీరు, తాగునీరు అందించలేమని, విద్యుత్ సరఫరా కూడా సాధ్యం కాదనే సంకేతాలివ్వడం రాష్ట్రంలో వ్యవసాయ రంగంపై ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోందన్నారు. సాగునీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఎత్తిపోతల మోటార్లను నిలిపివేసి రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

# నోబెల్‌పై ట్రంప్ ఆశలు

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నోబెల్ బహుమతి ఈ సారి ఎవరిని వరించనుంది? ఈ శాంతి బహుమతి కోసం పలువురి మధ్య కీలక పోటీ నెలకొంది. ముఖ్యంగా ప్రపంచ శాంతి, మానవతా సంక్షోభాలపై నిరంతరం దౌత్యపరమైన పిలుపునిస్తున్న పోప్ లియోతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్‌స్కీ, కెనడా ప్రధాని మార్క్ కార్నే, నార్డిక్ ప్రజాప్రతినిధులు లీసా మౌర్యోస్కీ, అజా చెమినిట్జ్‌లు నామినేట్ అయినవారిలో ఉన్నారు. రష్యా దండయాత్రకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని, శాంతిని కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నాలకు గానూ ఉక్రెయిన్ అధ్యక్షుడు పేరు గత కొన్నా ళ్లుగా నామినేట్ అవుతోంది. అయితే ఈ ఏడాది నోబెల్ బహుమతుల ప్రకటన కొనసాగుతోంది. ఇప్పటికే మెడిసిన్, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో పాటు సాహిత్యంలో విజేతలను ప్రకటించారు. అయితే, శాంతి బహుమతిపై యావత్తు ప్రపంచం ఎంతో ఆస క్తిగా ఎదురుచూస్తోంది. శుక్రవారం (అక్టోబరు 8న) విజేతను ప్రకటించనున్నారు. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి కోసం 208 మంది, 79 సంస్థలు సహా 287 నామినేషన్లు నమోదయ్యాయి. నోబెల్ కమిటీ నియమాల ప్రకారం అధికారిక నామినేషన్ల జాబితా 50 ఏళ్ల వరకు అత్యంత గోప్యంగా ఉంచుతారు. అయితే, నామినేట్ చేసిన వ్యక్తులు లేదా సంస్థల బహిరంగ ప్రకటనలు, అంతర్జాతీయ మీడియా కథనాలు, నిపుణుల విశ్లేషణల ఆధారంగా ఈ రేసులో ప్రముఖంగా పలు పేర్లు వినిపిస్తున్నాయి. వీటిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు కూడా ఉన్నట్టు వెల్లడయ్యింది. నోబెల్ బహుమతి కోసం కొన్నేళ్లుగా విశ్వప్రయత్నాలు చేస్తున్న ట్రంప్.. బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్న విషయం తెలిసిందే. ట్రంప్ తన మొదటి పదవీకాలం నుంచే నోబెల్ కల కంటున్నారు. అనేక యుద్ధాలను ఆపిన తానే అసలైన శాంతిదూతను అంటూ గొప్పలు చెప్పుకుం టున్నారు. ఇజ్రాయెల్, అరబ్ దేశాల మధ్య అబ్రహమ్ అకార్డ్‌తో చారిత్రక దౌత్య సంబంధాలు కుదిర్చినందుకు శాంతి బహుమతి పలుమార్లు నామినేట్ చేశారు. నార్వే పార్లమెంట్ సభ్యులు, అమెరికా కాంగ్రెస్‌లోని రిపబ్లికన్ ప్రతినిధులు, పాకిస్థాన్ వంటి దేశాలకు చెందిన నాయకులు అనేక సందర్భాల్లో ట్రంప్ పేరును అధికారికంగా ప్రతిపాదించారు. ఈ ఏడాది కూడా శాంతి బహుమతిపై అమెరికా అధ్యక్షుడు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇదే సమయంలో 'అయినా నాకు ఇవ్వరు లే' అంటూ నోబెల్ కమిటీపై బాహటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'ఎన్నో యుద్ధాలను ఆపానని, ఈ పురస్కారం నాకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న ట్రంప్.. నా కృషికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదు' అంటూ రుసరుసలాడుతున్నారు. ఇటీవల నోబెల్ బహుమతుల ప్రకటనకు ముందు కూడా " నేను ఎనిమిది యుద్ధాలను ఆపాను.. నోబెల్ కమిటీ నాకు ఇవ్వకపోతే వారికే అవమానం" అని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడైన కొద్ది నెలలకే బరాక్ ఒబామాకు నోబెల్ రావడంపై కూడా పలుసార్లు తన అక్కసు వెళ్లగక్కారు. భారత్‌కు చెందిన ప్యాడ్‌మాన్‌గా గుర్తింపు పొందిన అరుణాచలం మురుగనాథన్ కూడా నామినేట్ అయ్యారు. మహి ళల రుతుక్రమ పరిశుభ్రతపై అద్భుతమైన సామాజిక విప్లవాన్ని తెచ్చినందుకు, ఆయన చేసిన కృషికి గానూ బహిరంగంగా నామినేట్ అయినట్టు నివేదికలు పేర్కొన్నాయి. ప్రపంచ వివాదాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, యుద్ధ నేరాలపై చట్టపరమైన జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి కృషిచేసిన అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ నేరాల కోర్టు, భౌగో ళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, అనేక దేశాలు శాంతి యుతంగా అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నందుకు ప్రతీకగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం పేరు కూడా నామినేట్ అయ్యిం ది. మరోవైపు నోబెల్ శాంతి బహుమతికి తానే పూర్తిగా అర్హుడినని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించుకున్నారు. ఇప్పటివరకు ఏ అమెరికా అధ్యక్షుడూ చేయని విధంగా ప్రపంచ శాంతి కోసం తాను విశేష కృషి చేశానని, ఏకంగా ఎనిమిది యుద్ధాలను ఆపానని ఆయన పాతపాటే పాడారు. నార్వేజియన్ పీస్ కమిటీ శుక్రవారం ఈ అవార్డులను ప్రకటించనున్న నేపథ్యం లో శ్వేతసౌధంలో మీడియాతో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు నోబెల్ పురస్కారం ఇవ్వకపోతే, అది ఆ కమిటీకే పెద్ద అవమానమని ఆయన అన్నారు. 2009లో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు నోబెల్ బహుమతి ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ ఆయనకే తెలియదంటూ ట్రంప్ ఎద్దేవా చేశారు. గత ఏడాది నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, మారియా కొరినా మచాడో ఆ అవార్డుకు తనకంటే ట్రంపే ఎక్కువ అర్హుడని చెబుతూ ఆమె బహుమతిని తనకు అందించారని గుర్తుచేశారు. వివిధ దేశాలపై వాణిజ్య సుంకాలను అస్త్రంగా ఉపయోగించి, అనేక యుద్ధాలు జరగకుండా అడ్డుకోగలిగానని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికా– ఇరాన్ ఉద్రిక్తతలను కూడా త్వరలోనే పరిష్కరిస్తానని ధీమా వ్యక్తం చేశారు. తానెన్నో యుద్ధాలను ఆపానని, నోబెల్ శాంతి బహుమ తికి తన కంటే అర్హులెవరూ లేరంటూ గతంలో కూడా చాలాసార్లు ట్రంప్? పేర్కొన్నారు. నోబెల్ కమిటీని ఉద్దేశిస్తూ, వారి నిర్ణయం ఏంటో తమకు తెలియదని, తనలాంటి వారికి ఈ పురస్కారం ఇవ్వకపోవడమే వారికి అలవాటుగా కనిపిస్తోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇంతకుముందు ఎవరూ చేయలేని పనులు నేను చేశా. నేను గొప్పలు చెప్పుకోవడం లేదు. కేవలం వాస్తవాలు మాత్రమే చెబుతున్నా. బహుశా ఏ అధ్యక్షుడు కూడా ఇన్ని యుద్ధాలను పరిష్కరించి ఉండకపోవచ్చు. కానీ నేను మాత్రం ఒకటి రెండు కాదు, ఏకంగా 8 యుద్ధాలు ఆపాను. కాబట్టి నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు నేను అర్హుడిని. కానీ అది నాకు వస్తుందనే నమ్మకం మాత్రం తక్కువే. ఒకవేళ నాకు నోబెల్? ఇవ్వకపోతే అది కమిటీకి పెద్ద అవమానం అవుతుందని అన్నారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది నామినేషన్లలో ట్రంప్ పేరు ఉండొచ్చని గతంలోనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ ప్రతిష్మాత్మక పురస్కారం ఎవరిని వరిస్తుందన్న విషయంపై ఉత్కంఠ నెలకొంది. ఏది ఏమైనా అన్నివిధాల అర్హుడికే ఈ నోబెల్ శాంతి బహుమతి దక్కాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## సింగరేణి కార్మికులకు శుభవార్త.. హామీల అమలుకు ప్రభుత్వం సానుకూలం



**- లాభాల వాటా ప్రకటన, సొంతింటి పథకం, మెడికల్ బోర్డుల ఏర్పాటుపై ముందడుగు**

**- ఐఎన్‌టీయూసీ నాయకులు బేతల్లి మధుకర్‌రెడ్డి, పసునూటి రాజేందర్, జోగు బుచ్చయ్య**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, అక్టోబర్ 12: సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంతోపాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించాయని ఐఎన్‌టీయూసీ భూపాలపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ బేతల్లి మధుకర్‌రెడ్డి, కేంద్ర నాయకులు పసునూటి రాజేందర్, జోగు బుచ్చయ్య తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు కార్మికుల లాభాల వాటాను ప్రకటించి, వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి. సంజీవరెడ్డి నాయకత్వంలో, సెక్రటరీ జనరల్ డాక్టర్ జనక్ ప్రసాద్ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంతో జరిపిన చర్చల ఫలితంగా కార్మికుల సమస్యల పరిష్కారానికి పలు అంశాల్లో ముందడుగు పడిందని పేర్కొన్నారు.

ప్రతి నెలా ఏరియా ఆసుపత్రుల్లో మెడికల్ బోర్డులు ఏర్పాటు చేసి, అర్హులైన కార్మికులకు వైద్యపరమైన అనర్హత ప్రక్రియను వేగంగా పూర్తి చేసేలా ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల హామీల్లో భాగంగా కార్మికులకు సొంతింటి పథకాన్ని త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని వెల్లడించారు. కోల్ ఇండియా తరహాలో సింగరేణి కార్మికులకు చెల్లించే పర్క్స్‌పై కూడా ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించే అంశంపై ఈ ఏడాదిలోనే నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తున్నారని చెప్పారు. కార్మికుల పేర్లలో వ్యత్యాసాలకు సంబంధించిన సమస్య పరిష్కారానికి ఇప్పటికే కమిటీ సమావేశం పూర్తయిందని, నవంబర్ నాటికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానంలో మానవీయ కోణంతో పరిష్కరించే అవకాశం ఉందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు, విజిలెన్స్ కేసులను సమీక్షించి, అర్హతలు, నిబంధనల మేరకు మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. కోవిడ్ సమయంలో విధుల నుంచి తొలగించబడిన కార్మికులకు మరో అవకాశం కల్పించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొత్త బొగ్గు గనులను కేటాయించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలను త్వరితగతిన చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా సంస్థ ఆదాయాన్ని పెంచడంతోపాటు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించాలని సూచించారు. గనుల్లో డ్రిల్ బిట్స్, భద్రతా పరికరాల కొరతను తక్షణమే అధిగమించి కార్మికుల భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. అధికారులకు సంబంధించిన పనితీరు ఆధారిత వేతనాన్ని (పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే) త్వరగా విడుదల చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంస్థ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం, యాజమాన్యం ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకురావాలని వారు కోరారు. ఇంకా ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచి నాయకులు బొడ్డు అశోక్, నాయకులు శంకర్, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి ఏరియాలో ఎస్సీఎంకేఎస్-బీఎంఎస్‌లోకి భారీగా కార్మికుల చేరిక

**- సింగరేణిలో రాజకీయ జోక్యం, అవినీతికి ముగింపు పలకాలి**

**- సంస్థ పరిరక్షణకు కార్మికులంతా ఐక్యంగా నిలవాలి: అప్పాని శ్రీనివాస్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్–భూపాలపల్లి, అక్టోబర్ 12: సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన, ఉద్యోగ భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్న సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఎస్సీఎంకేఎస్–బీఎంఎస్)లో భూపాలపల్లి ఏరియాకు చెందిన పలువురు కార్మికులు చేరారు. ఆదివారం రాత్రి స్థానిక బీఎంఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేటీకే–1 ఇంక్లైన్, వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న 11 మంది కార్మికులు యూనియన్‌లో చేరగా, సంఘం అధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్, ఏరియా ఉపాధ్యక్షుడు వెలబోయిన సుజెందర్ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కేటీకే–1 ఇంక్లైన్ బ్రాంచి కార్యదర్శి రాసకట్ల నర్సింగరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ భవిష్యత్తును, కార్మికుల ప్రయోజనాలను కాపాడాలంటే కార్మికులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. యూనియన్‌ను బలోపేతం చేయడం ద్వారా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మరింత సమర్థవంతంగా పోరాడవచ్చని పేర్కొన్నారు. కార్మికుల ఓట్లతో గుర్తింపు, ప్రాతినిధ్య హోదాలు పొందిన సంఘాలు వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీనివాస్ అన్నారు. కార్మికుల ఇబ్బందులను పరిష్కరించాల్సిన సంఘాలు అందుకు బదులుగా పైరవీలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యానికి, అవినీతి ఆరోపణలకు తావులేకుండా పారదర్శక పాలన సాగాలని, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమానికి పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి అభివృద్ధికి నూతన బొగ్గు ప్రాజెక్టులను సాధించడంతోపాటు సంస్థ ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించే చర్యలు చేపట్టాలని కోరారు. సంస్థను కాపాడుకోవడం,కార్మికుల ఉద్యోగ భవిష్యత్తుకు భరోసా కల్పించడం అందరి బాధ్యతని స్పష్టం చేశారు. కార్మికుల హక్కుల సాధన, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం ఎస్సీఎంకేఎస్––బీఎంఎస్ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని నూతనంగా చేరిన కార్మికులకు హామీ ఇచ్చారు. యూనియన్ బలోపేతానికి ప్రతి కార్మికుడు సహకరించాలని పిలుపునిచ్చారు. యూనియన్‌లో చేరిన వారిలో బోయిన మల్లికార్జున్, బోలో వెంకటేశ్వర్లు, దీపు (ఎస్‌డీఎల్ ఆపరేటర్లు), టి. సత్తయ్య, సీహెచ్. శ్రీకాంత్, పి. దిలీప్, మోసం ప్రశాంత్, ఎండీ. తాజోద్దీన్, దేవులాల్, మంద మల్లేష్ (జనరల్ అసిస్టెంట్లు), సునీల్ (వర్క్‌షాప్ టర్నర్) ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాసకట్ల నర్సింగరావు, పంద్రాల మల్లేష్, సట్కూరి శ్రీనివాస్, ఒరం లక్ష్మణ్, ఆడప రాజు, రఘుపతి రెడ్డి, శ్రీరాములు, భాస్కర్, రాజునాయక్, తాంద్ర మొగిలి, దాసరి ఓదెలు, సాగర్ తదితర కార్మికులు, యూనియన్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## అమ్మవారిని పూజిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయి

**డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, అక్టోబర్ 12 :అమ్మవారు కరుణా స్వరూపిణి అని, భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తే సకల కష్టాలు తొలగి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం పాల్వంచ పట్టణం, పరిసర ప్రాంతాల్లోని పలు ఆలయాలు, మండ పాలను ఆయన సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పాల్వంచ మండలం జగన్నాథపురంలోని పెద్దమ్మ గుడి, పాతపాల్వంచలోని మైసమ్మతల్లి ఆలయం, సంజయ్‌నగర్‌లోని మహాలక్ష్మమ్మతల్లి ఆలయం, బొల్లోరిగూడెంలోని శ్రీ లలిత కామేశ్వరస్వామి ఆలయం తో పాటు శివనగర్‌లో ఏర్పాటు చేసిన మండపం, బొల్లోరి గూడెంలోని ఇతర మండపాలను సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడు తూ, అమ్మవారి అనుగ్రహంతో భక్తులకు సుఖసంతోషాలు, శాంతి సమృద్ధులు కలుగుతాయని అన్నారు. జీవితంలో అన్ని రంగాల్లో విజయాలు సాధించేందుకు అమ్మవారి ఆశీస్సులు తోడ్పడతాయని పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్వాల విమలాదేవి, సీరపు సుగుణ, నూకల సరిత, సింధు తపస్వి, కొత్వాల సత్యనారాయణ, కొండం వెంకన్న, నూకల రంగారావు, శనగ రామచందర్, అశ్విని కుమార్, వై. వెంకటేశ్వర రావు, చింతా నాగరాజు, వనమా సంపత్ కుమార్, బూసి శ్రీను, వంగా రమేష్, మసనం శరత్, కోసూరి కిరణ్, రౌతు మల్లేష్, కరుకుల సతీష్, చిన్న పండు, సంతోష్ రెడ్డి (బబ్లూ), కంచర్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టి.ఎస్.యు.ఎస్. కార్యాలయ కూల్చివేత ప్రజాస్వామ్య హక్కులపై దాడి

**- కక్షపూరిత చర్యలను సహించేది లేదు.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

**- తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, అక్టోబర్ 12: భూపాలపల్లిలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం (టిఎస్ యుఎస్) కార్యాలయాన్ని కూల్చివేయడాన్ని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణరావు తీవ్రంగా ఖండించారు. కార్మిక సంఘాల పట్ల భిన్నాభిప్రాయాలు ఉన్నాయనే కారణంతో వాటి కార్యాలయాలను కూల్చివేయడం ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగించడమేనని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూపాలపల్లిలోని టి.ఎస్.యు.ఎస్. కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పనిచేసే సంఘాల కార్యాలయాలను తొలగించడం ద్వారా వారి గొంతును నొక్కాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్మిక సంఘాలకు తమ కార్యకలాపాలను స్వేచ్ఛగా నిర్వహించుకునే హక్కు ఉందని, ఆ హక్కులకు భంగం కలిగించే చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ కొమురయ్య గౌడ్ తమ బాధ్యతను స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాల్సింది పోయి, కార్మిక సంఘాల కార్యకలాపాలకు ఆటంకం కలిగించే చర్యలకు మద్దతు ఇస్తే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు వారి సంఘాల కార్యాలయాల విషయంలో వివాదాలకు తావివ్వడం సమంజసం కాదన్నారు. చట్టబద్ధమైన అనుమతులు, విధివిధానాలను పాటించకుండా కార్యాలయాన్ని కూల్చివేసి ఉంటే, ఆ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. రాజకీయ కక్షతో లేదా ఇతర కారణాలతో కార్మిక సంఘాల కార్యాలయాలపై చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి హక్కులను కాపాడటం ప్రభుత్వంతోపాటు ప్రజాప్రతినిధుల బాధ్యత అని గుర్తుచేశారు. కార్మిక సంఘాల స్వేచ్ఛను హరించే ప్రయత్నాలను పౌర హక్కుల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయానికి సంబంధించిన ప్రహరీగోడ కూల్చివేతపై సమగ్ర విచారణ జరిపించాలని, ఆ చర్యకు అవసరమైన చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా లేదా అన్నది తేల్చాలని వారు డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవడంతోపాటు, కార్యాలయానికి జరిగిన నష్టంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో కార్మిక సంఘాల హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల గొంతును నొక్కే ప్రయత్నాలను ప్రజాస్వామ్య శక్తులు చూస్తూ ఊరుకోవని, వారి హక్కుల పరిరక్షణ కోసం పౌర హక్కుల సంఘం నిరంతరం పోరాడుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాని, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకుడు రాదండి దేవేందర్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీరేటి రాజన్న, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్, అసంఘటిత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఐత బాబు, పార్వతక్క, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు దాసరి జనార్ధన్, జైపాల్ సింగ్, గోడిసెల శ్రీహరి, నామల శ్రీనివాస్ తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



## తరతరాలుగా బొమ్మల కొలువు.. భక్తి, సంస్కృతికి ప్రతీక

**- శ్రీ వైష్ణవ సంప్రదాయాలను కొనసాగిస్తున్న వేణుమాధవ్ కుటుంబం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఘట్‌కేసర్, అక్టోబర్ 12: తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకుంటూ భక్తి, కుటుంబ అనుబంధాలు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోంది ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని చౌదరిగూడ వెంకటాద్రి టౌన్‌షిప్‌లో నివసిస్తున్న ఆళవందార్ వేణు మాధవ్ కుటుంబం. తమిళనాడు నుంచి వలస వచ్చి తెలంగాణలో స్థిరపడిన ఈ కుటుంబం, తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన శ్రీ వైష్ణవ ఆచారాలను భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తోంది. సింగరేణి సంస్థలో ఉద్యోగ విరమణ చేసిన వేణు మాధవ్ కుటుంబం ప్రతి ఏటా శరన్నవరాత్రుల సందర్భంగా సంప్రదాయబద్ధంగా బొమ్మల కొలువును ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తోంది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి రోజున ఇంట్లో చెక్కతో రూపొందించిన దేవతా మూర్తులు, సంప్రదాయ బొమ్మలతో కొలువును అలంకరించి తొమ్మిది రోజులపాటు పూజలు చేయడం ఈ కుటుంబ ఆచారంలో ప్రత్యేకత. ప్రతిరోజూ దేవతామూర్తులకు హారతులు సమర్పిస్తూ, కుటుంబ సంప్రదాయం ప్రకారం వివిధ రకాల పిండి వంటలు, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పిస్తారు. మూలా నక్షత్రం రోజున సరస్వతీ పూజ, మహర్నవమి సందర్భంగా మహాలక్ష్మీ పూజ నిర్వ హిస్తారు. ముత్తైదువులను పేరంటాలకు ఆహ్వానించి తాంబూలాలు అందజేయడంతోపాటు భక్తిగీతాలు, భజనలు, కీర్తనలతో ఇంట్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పుతారు. విజయదశమి అనంతరం సంప్రదాయరీతిలో బొమ్మల కొలువుకు ముగింపు పలుకుతారు. ఈ ఆచారంలో మరో విశేషం కుమార్తెలకు పూర్వీ కుల సంప్రదాయాలను వారసత్వంగా అందించడం. వివాహం చేసుకొని అత్తవారింటికి వెళ్లే కుమార్తెకు తల్లిదండ్రులు చెక్కతో చేసిన దేవతా బొమ్మలను అందజేస్తూ, తమ కుటుంబ ఆచారాలను తదుపరి తరాల్లోనూ కొనసాగించాలని సూచిస్తారు. ఈ విధంగా బొమ్మల కొలువు కేవలం పూజా కార్యక్రమానికే పరిమితం కాకుండా కుటుంబ అనుబంధాలను బలోపేతం చేసే సంప్రదాయంగా కొన సాగుతోంది. శ్రీ వైష్ణవ ఆచారాలు భక్తితోపాటు కుటుంబ ఐక్యత, పెద్దల పట్ల గౌరవం,అతిథి సత్కారం, సాంస్కృతిక పరిరక్షణ వంటి విలువలను ప్రతిబింబిస్తున్నాయి. తమిళ సంప్రదాయాలను కాపాడు కుంటూనే తెలంగాణ సమాజంతో మమేకమై జీవిస్తున్న ఈ కుటుంబం భిన్న సంస్కృతుల సమన్వయానికి నిదర్శనంగా నిలుస్తోం ది. స్థానిక ప్రజల ఆదరణ, ఆప్యాయతల మధ్య పూర్వీకుల ఆచారా లను నేటి తరానికి అందిస్తూ, భారతీయ సంస్కృతిలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతోంది.

## మేఘాలయలో బొగ్గు తవ్వకాల పునఃప్రారంభానికి సన్నాహాలు

**- చిన్న తరహా గనుల నిర్వహణపై కేంద్ర సాంకేతిక బృందం క్షేత్రస్థాయి పరిశీలన**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, అక్టోబర్ 12 : మేఘాలయ రాష్ట్రంలో చిన్న తరహా బొగ్గు తవ్వకాలను తిరిగి ప్రారంభించే అవకాశాలను పరిశీలించేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు చెందిన సాంకేతిక బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. పర్యావరణ పరిరక్షణ, గని కార్మికుల భద్రత, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా బొగ్గు తవ్వకాలను నిర్వహించే సాధ్యాసాధ్యాలను అంచనా వేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. 2014లో జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) నిషేధం విధించిన నేపథ్యంలో రాష్ట్రంలో సంప్రదాయ రాట్–హోల్ మైనింగ్ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా సురక్షితమైన, శాస్త్రీయ పద్ధతుల్లో చిన్న తరహా బొగ్గు తవ్వకాలను చేపట్టే అవకాశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలు జరుపుతున్నాయి. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ లిమిటెడ్ (సీఎంపీడీఐఎల్), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీజీఎంఎస్) అధికారులతో కూడిన సాంకేతిక బృందం గత వారం తూర్పు జైంతియా హిల్స్, ఖాసీ హిల్స్ ప్రాంతాల్లోని బొగ్గు గనులను సందర్శించింది. ఈ పర్యటనలో మేఘాలయ ఖనిజ వనరుల డైరెక్టరేట్ అధికారులు కూడా పాల్గొన్నారు. చిన్న తరహా బొగ్గు తవ్వకాలను పునఃప్రారంభించే అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరుగుతున్న సంప్రదింపుల్లో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టినట్లు మేఘాలయ ఖనిజ వనరుల శాఖ డైరెక్టర్ ఎం.పీ. టోంగ్‌పర్ తెలిపారు. పర్యావరణ, భద్రతా ప్రమాణాలతోపాటు చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా తగిన విధానాలను రూపొందించడంపై దృష్టి సారించినట్లు వివరించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా ఆయా ప్రాంతాల్లో ప్రస్తుతం అనుసరిస్తున్న గనుల తవ్వకం పద్ధతులను బృందం అధ్యయనం చేసింది. రాష్ట్రంలోని భౌగోళిక పరిస్థితులు, ప్రత్యేకమైన భూ యాజమాన్య వ్యవస్థను పరిగణనలోకి తీసుకొని శాస్త్రీయంగా, సురక్షితంగా, పర్యావరణానికి హాని కలగకుండా తవ్వకాలు నిర్వహించేందుకు ఉన్న అవకాశాలను అంచనా వేసింది. గనుల ప్రాంతాల పరిశీలన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సాంకేతిక బృందం సమావేశమైంది.

## ఆర్టీసీ ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయంపై ఆర్జీ-3లో సంబురాలు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగిరి, అక్టోబర్ 12 : ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో ఏఐటీయూసీ ఎంప్లాయిస్ యూనియన్ ఘనవిజయం సాధించిన సందర్భంగా సోమవారం సాయంత్రం ఆర్జీ-3 ఏరియాలోని సెంటినరీ కాలనీలో విజయోత్సవ ర్యాలీ, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు స్వీట్లు పంపిణీ చేసి విజయాన్ని సంబరంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బండారి క్రాంతి, బ్రాంచ్ సెక్రటరీ ఎం.ఆర్.సి.రెడ్డి, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ డి.టి.రావు మాట్లాడుతూ ఈ నెల 9న జరిగిన ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో 11 రీజియన్లలో ఏఐటీయూసీ ఎంప్లాయిస్ యూనియన్ ఘనవిజయం సాధించిందని పేర్కొన్నారు. గతంలో అధికారంలో ఉన్న పాలకులు ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా, యూనియన్లను రద్దు చేసి కార్మికుల హక్కులను కాలరాశారని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఎన్నికలకు ముందు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పాలన కొనసాగిస్తోందని అన్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు సంస్థను కాపాడేందుకు నిరంతరం పోరాటాలు చేస్తోందని తెలిపారు. సిపిఐ శాసనసభాపక్ష నాయకుడు, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వంతో చర్చించి ఆర్టీసీలో ఎన్నికలు నిర్వహించేలా కృషి చేశారని, ఫలితంగా 11 రీజియన్లలో ఏఐటీయూసీ ఎంప్లాయిస్ యూనియన్ ఘనవిజయం సాధించిందని వెల్లడించారు. ఆర్టీసీ ఎన్నికల్లో సాధించిన ఐక్యతను సింగరేణిలోనూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న పాలక ప్రభుత్వాలపై కార్మిక క్షేత్రంలో పోరాటాలను మరింత ఉధృతం చేయాలని, భవిష్యత్తులో జరిగే ఉద్యమాల్లో సింగరేణి కార్మికులు ముందుండి తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-3 ఏఎల్పీ పిట్ సెక్రటరీ గంగాధర్, ఓసీపీ-1 అసిస్టెంట్ పిట్ సెక్రటరీ కె.మల్లేష్, నక్క రమేష్, సీఎచ్పీ పిట్ సెక్రటరీ గంధం శ్రీనివాస్, ఓసీపీ-2 పిట్ సెక్రటరీ ఎం.సురేష్, వివిధ గనులు, విభాగాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోరుట్ల, అక్టోబర్ 12 : కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి తదితర అధికారులు ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను డివిజన్ స్థాయి అధికారులతో కలిసి స్వీకరించారు. మొత్తం 04 ఫిర్యాదులు ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి యల్.జివాకర్ రెడ్డి మాట్లాడుతూ.. పలు సమస్యల పరిష్కారం కోరుతూ డివిజన్ కేంద్రంతో పాటు డివిజన్ లోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోవడానికి ప్రజావాణికి వచ్చారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 8 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రజావాణిలో డివిజన్ స్థాయి అధికారులు డీఎల్పీవో, డిప్యూటీ డీఎం హెచ్వో, ఏడిఏ, డిఇ (ఎలక్ట్రిసిటీ) సిడిపివో, డిఈ (ఆర్ అండ్ బి), డిఈ (ఆర్ డబ్ల్యూ ఎస్), ఏఈ (హౌసింగ్), డిఈఈ), ఏఈ, ఏడీఈ, డిటి డివో, హెచ్ డబ్ల్యు ఏఈఈ (ఇరిగేషన్), హెచ్ఈవో, ఐసీడీఎస్ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ ఎ.భూమేశ్వర్, డీపీవో (పిఆర్) కే.ధనలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఎంపిడివో కార్యాలయంలో ప్రజావాణికి నాలుగు దరఖాస్తులు కోరుట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆరు దరఖాస్తులు వచ్చాయని ఎంపీవో రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకుని, తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. దరఖాస్తులపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

## డ్రైనేజీ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలి

### అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్పల్లి, అక్టోబర్ 12 : కూకట్పల్లి నియోజకవర్గం కేపీహెచ్బీ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ 22--23 ప్రాంతంలో డ్రైనేజీ పొంగిపొర్లుతూ స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, సమస్యను తక్షణమే పరిష్కరించాలని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ఆయన సమస్యాత్మక ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించి, వాటర్వర్క్స్ అధికారులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. డ్రైనేజీ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సమస్య పరిష్కారానికి సకాలంలో చర్యలు ఎందుకు తీసుకోలేదని అధికారులను ప్రశ్నించారు. సమస్య పరిష్కారంలో సాంకేతికపరమైన ఇబ్బందులు లేదా ఇతర అవరోధాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని స్పష్టం చేశారు. అనంతరం ప్రాంతంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, పనుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ రాజేశ్ రాయ్, భవాని, వాటర్వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

### - గొంగిడి సునిత మహేందర్ రెడ్డి

### - గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బీఆర్ఎస్ అవగాహన సదస్సు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 12 : ఆలేరు నియోజకవర్గం, యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలోని ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్లో సోమవారం మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం-నల్గొండ-వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు, అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గొంగిడి సునిత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతుభరోసా కింద రూ.15 వేల సాయం, రూ.2 లక్షల రుణమాఫీ, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2,500 వంటి హామీలతో గ్రామీణ ప్రాంత ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. హామీలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రతి వంద మంది ఓటర్లకు ఒకరు బాధ్యత తీసుకొని కేటీఆర్ తరహాలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేసే కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం-వరంగల్-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆమె కోరారు. ఓటరు నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం చేయకుండా అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా అవగాహన కల్పించాలని సూచించారు.

## ఓటర్ల శుద్ధీకరణ నిరంతర ప్రక్రియ

### - అసలైన ఓటు చోరీ కాంగ్రెస్ పార్టీయే

### - బిజెపి జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, అక్టోబర్ 12 : ఓటర్ల శుద్ధీకరణ అనేది నిరంతర ప్రక్రియ అని, అది భారత ఎన్నికల సంఘం యొక్క ప్రధాన విధి అని బిజెపి జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు తెలిపారు. ఓటర్ల శుద్ధీకరణ అనేది నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక కొత్తగా జరుగుతున్న కార్యక్రమం కాదని, కాంగ్రెస్ హయంలో ఎనిమిది సార్లు జరిగిందని, దానిని ప్రధానమంత్రికి ఆపాదించి, ఇండియా కూటమి పార్టీలు నిరసనలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..1982 లో ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ ఉన్న సమయంలో కేరళలోని పర్వూర్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో 50 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను ప్రయోగాత్మకంగా వినియోగించారని, 1983లో చట్టపరమైన అనుమతి కావాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో ఆపేశారని, 1988 లో రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ప్రజా ప్రాతినిధ్య చట్టం 61 ఏలో చేర్చి, చట్టబద్ధత కల్పించి 2004 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఈవీఎంలను అమలు చేశారని అన్నారు .2004 నుండి 2014 వరకు కేంద్రంలో కాంగ్రెస్ కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉందని అప్పుడు జరగని ఈవీఎంల ట్యాంపరింగ్ 2014 నుండి మాత్రమే జరిగిందా మల్లికార్జున ఖర్గే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈవీఎంలను అనుమానించడం కాంగ్రెస్ పార్టీ స్వయంకృతాపరాధం లాంటిదేనని అన్నారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటింగ్ విధానం మొదలైనప్పటి నుండి 2004 వరకు బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు జరిగాయని, అలాంటప్పుడు 1967 నుండి నేటి వరకు తమిళనాడులో, 1977 నుండి పశ్చిమబెంగాల్లో, 1984 నుండి సిక్కింలో, 1989 నుండి ఉత్తరప్రదేశ్లో, 1990 నుండి బీహార్ లో, 1995 నుండి గుజరాత్లో, 2000 సంవత్సరం నుండి ఒడిశాలో కాంగ్రెస్ పార్టీ ఎందుకు గెలవలేకపోయిందో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, నాలుగు చోట్ల ఓటర్ గా నమోదైన ప్రకాష్ రాజ్ లాంటి కుహనా మేధావులు సమాధానం చెప్పాలని అన్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రధాన కమిషనర్ గా కొనసాగుతున్న జ్ఞానేష్ కుమార్ 2024 లో జరిగిన పార్లమెంటు ఎన్నికల తర్వాత ఏడాదికి 2025 లో ముఖ్య ఎన్నికల అధికారిగా నియమితులయ్యారని, అలాంటప్పుడు జ్ఞానేష్ కుమార్ ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఎదుర్కొంటున్న వరుస ఎన్నికల వైఫల్యాలను జీర్ణించుకోలేక నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎస్ఐఆర్ లో జరుగుతున్న ప్రక్షాళనలో ఏ ఒక్క ఓటరు తన ఓటును కోల్పోయానని, దేశవ్యాప్తంగా ఎక్కడ కూడా ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్న విషయం కాంగ్రెస్ నాయకులు గుర్తెరగాలని అన్నారు. అసలైన ఓటు చోరీ, నామ్ చోరీ, కుర్చీచోరీకి పాల్పడింది కాంగ్రెస్ పార్టీయేనని, 1947లో నెహ్రూ తొలి ప్రధాని కాకముందు రాజ్యాంగ పరిషత్ ద్వారా మాత్రమే ఎన్నుకోబడ్డారని, భారత రాజ్యాంగ పరిషత్ లోని 15 ఓట్లకు రెండు ఓట్లు గైర్హాజరు కాగా 12 ఓట్లు సర్దార్ పటేల్ కు వస్తే ఒక్క ఓటు మాత్రమే నెహ్రూ వచ్చిందని, అయినా దొడ్డిదారిన ప్రధానమంత్రి అయి ఓటు చోరీకి కుర్చీ చోరీకి పాల్పడ్డారని గుర్తు చేశారు. అంతేకాకుండా నెహ్రూ కూతురు ఫిరోజ్ ఖాన్ తో వివాహమైనప్పుడు హిందూ సాంప్రదాయం ప్రకారం భర్త కులం వర్తిస్తుంది కానీ ఇందిరా ప్రియదర్శిని చివర గాంధీ పేరు తగిలించుకొని నామ్ చోరీకి పాల్పడి నేటి ప్రియాంక కొడుకు పేరిట కూడా చివర గాంధీ అని తోక తగిలించుకుని నామ్ చోరీకి పాల్పడ్డారని అన్నారు. అంతేగాకుండా 1968 రాజీవ్ గాంధీని పెళ్లాడిన సోనియా 16 సంవత్సరాల వరకు భారత పౌరసత్వం తీసుకోలేదు కానీ 1980లో జరిగిన ఎన్నికల్లో ఓటర్ లిస్టులో తన పేరు నమోదు చేసుకుని ఓటేసి ఓట్ చోరీకి సోనియా గాంధీ పాల్పడి ఓటు చోరీకి పేటెంట్ హక్కుగా నెహ్రూ కుటుంబం నిలిచిందని అన్నారు. 1971 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రాయబరేలి నుండి రాజ్ నారాయణ పై పోటీ చేసి అక్రమ మార్గమున గెలిచిన ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని ఆమెను ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కాలరాసి, రాత్రికి రాత్రే ఎలాంటి క్యాబినెట్ ఆమోదం లేకుండానే పార్లమెంటును రద్దుచేసి దేశంలో అత్యవసర పరిస్థితి విధించి కుర్చీ చోరీకి పాల్పడిన నీచమైన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ చెప్పే సుద్దులు వినే పరిస్థితిలో భారత దేశ ప్రజలు లేరన్న విషయం తెలుసుకొని మసలుకోవాలని సూచించారు. 2004 నుండి దేశవ్యాప్తంగా ప్రతి శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంలను మాత్రమే ఉపయోగిస్తున్నారన్న విషయం కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలని గతంలో ఈవీఎంలు వద్దు బ్యాలెట్ పేపరే ముద్దు అనే భావనతో కొంతమంది సుప్రీంకోర్టులో కేసు వేస్తే సుప్రీంకోర్టు కేసును కొట్టి వేసిన విషయాన్ని కాంగ్రెస్ నాయకులకు తెలుసుకోవాలని అన్నారు. దేశంలో విచ్ఛిన్న రాజకీయాలకు స్వస్తి పలకాలని కాంగ్రెస్ పార్టీకి హితవు పలికారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన పిల్లి శ్రీనివాస్, దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరగంటి చంద్రశేఖర్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్రిపెల్లి సత్యమ్, పాల్గొన్నారు.

## మేజిక్ రాజాకు టీపీఏ సత్కారం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, అక్టోబర్ 12 : స్థానిక ప్రముఖ కళాకారుడు, మోటివేషనల్ స్పీకర్ మేజిక్ రాజాను తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (టీపీఏ) మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో టీపీఏ వ్యవస్థాప కుడు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్, కార్యక్రమ అతిథులు సోమవారం శాలువాతో ఆత్మీయంగా సత్కరించి జ్ఞాపికను అందజే శారు. విద్యార్థులకు స్ఫూర్తిదాయక ఉపన్యాసాలతో ప్రేరణ కల్పిస్తున్న రాజా సేవలను గుర్తించి ఈ సత్కారం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా తనను సత్కరించిన నిర్వా హకులకు రాజా కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం-2026 సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో పద్మనాయక ఏసీ హాల్లో కృష్ణవేణి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సహకారంతో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు నిర్వహిస్తున్న పోటీ పరీక్షల శిక్షణ శిబిరంలో జరిగిన కార్యక్రమానికి టీపీఏ వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణార్థులకు మానసిక ఆరోగ్యం ప్రాధాన్యం, పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలు, భావోద్వేగ సమతుల్యత, ఆత్మవిశ్వాసం పెంపొం దించుకోవడంపై అవగాహన కల్పించారు. అనంతరం మేజిక్ రాజా ప్రదర్శించిన మాట్లాడే బొమ్మ శిక్షణార్థులను అలరించింది. టీపీఏ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రంగు వేణు కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుమన చైతన్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నారాయణరావు, టీపీఏ సలహాదారు, కృష్ణవేణి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ అధినేత కస్తూరి పద్మ చరణ్, గుండేటి యోగేశ్వర్, విన్నర్ ఐకాన్ కాంపిటేటివ్ ఇన్స్టిట్యూట్ అధినేత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గాం ఎస్ఐకి ఎమ్మార్పీఎస్ స్వాగత సన్మానం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, అక్టోబర్ 12 : అంతర్గాం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నూతనంగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన ఉదయ్ కిరణ్ ను ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సోమవారం పట్టు శాలువాలతో స్వాగత సన్మానం చేశారు. ఈ కార్య క్రమంలో ఎమ్మార్పీఎస్ అంతర్గాం మండల ఇన్చార్జ్ కాసిపేట రాజయ్య మండల ప్రధాన కార్యదర్శి లింగాపురం భీమయ్య, మండల అధ్యక్షులు ములకల్లనాగరాజు, గ్రామ అధ్యక్షులు కల్లపల్లి మహేష్, మండల గౌరవ ఉపాధ్యక్షులు వడ్డేపల్లి రవికుమార్, మండల ఎంఎస్పి అధ్యక్షులు, గుడిసెల దుర్గయ్య, గ్రామ అధ్యక్షులు కొంకటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు ఖమ్మం పట్టణ సహాయ కార్యదర్శిగా మేడి పవన్ కుమార్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, అక్టోబర్ 12 : మున్నూరుకాపు ఖమ్మం పట్టణ సహాయ కార్యదర్శిగా మామిళ్లగూడెం 49వ డివిజన్కు చెందిన మేడి పవన్ కుమార్ను జిల్లా కమిటీ ఎంపిక చేసింది. సోమవారం ఖమ్మం పట్టణంలోని మున్నూరుకాపు హాస్టల్ ప్రాంగణంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం, జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయనకు నియామక గుర్తింపుగా సన్మానం చేసి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర చేతుల మీదుగా మేడి పవన్ కుమార్ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో కీలక బాధ్యత అప్పగించిన రాష్ట్ర, జిల్లా మున్నూరుకాపు నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. మున్నూరుకాపులంతా ఐక్యంగా ఉంటూ తమ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు.

## దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో వంటశాల నిర్మాణానికి భూమి పూజ

### - 50వేల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకం ద్వారా ప్రయోజనం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

చౌటుప్పల్, అక్టోబర్ 12 : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టిక ఆహారంతో కూడిన అల్పాహారం అందించాలనే లక్ష్యంతో అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ వారు 12,18,62,700 రూపాయల సిఎస్ఆర్ నిధులతో సోమవారం చౌటుప్పల్ మున్సిపాలిటీలోని తంగడపల్లి లో వంటశాల నిర్మాణానికి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్కెఎం చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షులు సత్య గౌరచంద్రదాసు స్వామీజీ పాల్గొని మాట్లాడారు..విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, చదువుపై ఏకాగ్రతను పెంపొందించేందుకు ఈ పథకం దోహదపడుతుందని అన్నారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి పౌష్టిక ఆహారం ఎంతో అవసరం అన్నారు.ఈ లక్ష్యంతో చేపడుతున్న వంటశాల నిర్మాణం. పాఠశాల విద్యార్థుల సంక్షేమానికి తోడ్పడుతుందని తెలిపారు. సామాజిక అభివృద్ధి, విద్యార్థుల ఆరోగ్యం విద్యకు ప్రాధాన్యత నిస్తూ స్థానిక దివిస్ పరిశ్రమ అందిస్తున్న ఈ ఆర్థిక సహకారం ప్రశంసనీయమని తెలిపారు. అక్షయపాత్ర ఫౌండేషన్ లో సమన్వయంతో చేపడుతున్న ఈ కార్యక్రమం వేలాదిమంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివిస్ పరిశ్రమ మేనేజర్ బి కిషోర్, హెచ్కెఎం చారిటబుల్ ఫౌండేషన్ సీఈఓ కౌంతీయ దాసు స్వామీజీ, శ్రీకృష్ణ ప్రేమ దాసు స్వామీజీ, సద్గురు భక్తదాసు స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

## చదువుకు కొండంత అండ.. వసతికి రూ.15 కోట్ల నిధులు!

### - వనపర్తి పీజీ కళాశాలకు మహర్దశ.. బాలికలు, బాలురకు ప్రత్యేక హాస్టళ్లు

### - ఈ నెల 15న మంత్రి తుమ్మల నాగేశ్వరావు చేతుల మీదుగా శంకుస్థాపన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి అక్టోబర్ 12 : ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించే దిశగా వనపర్తి ప్రభుత్వ పీజీ కళాశాలకు రూ.15 కోట్ల నిధులు మంజూరయ్యాయి. బాలికలు, బాలుర కోసం ప్రత్యేక వసతి గృహాలను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను కేటాయించింది. ఒక్కో హాస్టల్ నిర్మాణానికి రూ.7.50 కోట్ల చొప్పున కేటాయించారు. ఈ నెల 15న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా నిర్మాణ పనులకు శంకుస్థాపన జరగనుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉన్నత విద్య కోసం వనపర్తికి వచ్చే విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతి సౌకర్యాలు అందించడం ఎంతో అవసరమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు వసతి సమస్యలను అధిగమించి చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేలా ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. హాస్టళ్ల నిర్మాణం పూర్తయితే దూర ప్రాంతాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

## సర్కిల్ ఇన్స్పెక్టర్ల బదిలీ..కోరుట్ల సీఐగా కొమ్ము తిరుపతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోరుట్ల, అక్టోబర్ 12 : మల్టీ జోన్ 01 పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ, ఐజి పి.చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం సిసిఆర్బిలో పని చేస్తున్న బి.అనిల్ ను కరీంనగర్ కమిషనరేట్ లోని తిమ్మాపూర్ సర్కిల్ కు కరీంనగర్ సిపిటిసిలో పనిచేస్తున్న కొమ్ము తిరుపతిని కోరుట్ల సర్కిల్కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తిమ్మాపూర్ లో పనిచేస్తున్న బొల్లం రమేష్ ఇటీవల సస్పెండ్ అయిన విషయం విధితమే. కోరుట్లలో పనిచేసిన లక్ష్మీనారాయణను మల్టీ జోన్ కార్యాలయా నికి గతవారం బదిలీ చేశారు.

# ఘనంగా జగిత్యాల జిల్లా ఏర్పాటు దశాబ్ది ఉత్సవాలు

- జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన బిఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు
- జై తెలంగాణ నినాదాలతో మార్మోగిన జగిత్యాల పట్టణం
- బిఆర్ఎస్ జెండాలతో గులాబీమయమైన జగిత్యాల పట్టణం
-తెలంగాణ ఉద్యమ కారులకు సన్మానం






(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, అక్టోబర్ 12 : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దూరదృష్టితో పరిపాలన వికేంద్రీకరణ కోసం 10 జిల్లాలను 33 జిల్లాలుగా ఏర్పాటు చేసి దశాబ్ద కాలం గడుస్తున్న నేపథ్యంలో జగిత్యాల జిల్లా ఏర్పాటు దశాబ్ది ఉత్సవాలను సోమవారం జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జిల్లా పరిషత్ తొలి చైర్పర్సన్ దావ వసంత సురేష్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, లోక బాపురెడ్డి, చల్మెడ లక్ష్మీనరసింహ రావు, ఎల్లల శ్రీకాంత్ రెడ్డి ఓరుగంటి రమణ రావు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, సర్పంచులు, కౌన్సిలర్లు, సర్పంచులు, మండల అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాక్స్ చైర్మన్లు, వందలాది మంది నాయకులు, కార్యకర్తలు జిల్లా నలుమూలల నుండి తరలివచ్చారు. డీజే పాటలకు బీఆర్ ఎస్ శ్రేణులు నృత్యాలు చేశాయి. బీఆర్ఎస్ శ్రేణుల జై కేసీఆర్..జై తెలంగాణ నినాదాలతో జగిత్యాల పట్టణం మార్మోగింది. జగిత్యాల జిల్లా నలుమూల నుండి తరలిరావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. కొత్త బస్టాండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి, క్షీరాభిషేకం చేసి, ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం జగిత్యాల పాత బస్టాండ్ వద్ద కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు పాత బస్టాండ్ నుండి పాదయాత్రగా బయలుదేరి, జై కేసీఆర్, జైతెలంగాణ నినాదాలు చేస్తూ అంగడి బజార్ వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్ చౌరస్తాలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంగడి బజార్ లో స్వాతంత్య్ర సమరయోధుడు కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన బీఆర్ఎస్ సమావేశంలో తెలంగాణ అమర వీరులకు మౌనం పాటించి, నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమకారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ..కేసీఆర్ పరిపాలన సౌలభ్యం కోసం 10 జిల్లాలను 33 జిల్లాలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. మలితరం ఉద్యమంలో తొలితరం ఉద్యమ నాయకులు ఓరుగంటి రమణ రావు అని తెలిపారు. కేసిఆర్ నాయకత్వంలో పని చేయడం ప్రత్యేక అనుభూతినిస్తుందని అన్నారు. కేసీఆర్ తో తనకు సుదీర్ఘ కాలం స్నేహం ఉందని గుర్తు చేశారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుపై బషీర్బాగ్ కాల్పుల పై కేసులు ఎదుర్కొని, శాసన సభ ఉప సభాపతి పదవికి కేసీఆర్ రాజీనామా చేసి, తెలంగాణ కోసం ఉద్యమించారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను కేసీఆర్ సాకారం చేశారని, కెసిఆర్ వ్యవసాయ రంగంలో పంట పెట్టుబడి, బీమా, 24 గంటల ఉచిత విద్యుత్ దేశంలో ఎక్కడా లేనివిధంగా అమలు చేశారని పేర్కొన్నారు. 2018 లో కెసిఆర్ 20 శాతం అధికముగా రెండోసారి అధికారంలోకి వచ్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఆశల పల్లకిలో ఊరేగించి, అధికారంలోకి వచ్చిందని, రేవంత్ పాలనలో సాగు నీరు లేదు.. కరెంట్ లేదు..నిత్యావసర వస్తువులు పెరిగిపోయాయని విమర్శించారు. అన్నింటికి కారణం రేవంత్ రెడ్డి మూర్ఖత్వం..పాలన వైఫల్యం అని మండిపడ్డారు. ఎన్నికల ప్రణాళికలో తుమ్మిడి హెట్టి నిర్మాణం చేపడుతామని పేర్కొని మూడేళ్ళు గడుస్తుందని, తుమ్మిడి హెట్టి వద్ద మూడు తట్టల మట్టి ఎత్తిపోయలేదన్నారు. ఎల్ నినో ప్రభావం పడకుండా కరువులో ఆదుకునేలా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారని కొనియాడారు. కేవలం యాదాద్రి పవర్ ప్లాంట్ కు బొగ్గు సరఫరా చేయలేక రేవంత్ రెడ్డి విద్యుత్ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో 58 ఏళ్లలో కరీంనగర్ జిల్లాల్లో ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయలేదన్నారు. కెసిఆర్ నూతన జిల్లాలు ఏర్పాటు చేసి, జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారని, నిరుపేదలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయని కేసీఆర్ దూరదృష్టితో నిర్మాణం చేపట్టారని తెలిపారు. జగిత్యాలతో పాటు మంజూరు అయిన మెడికల్ కళాశాల భవనాలు పూర్తి అయితే అభివృద్ధి కోసం పార్టీ మారిన ఎమ్మెల్యే జగిత్యాలలో మాత్రమే ఎందుకు పూర్తికాలేదో.. చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో ఒక్క రూపాయి మంజూరు చేయలేదని, ప్రస్తుతం చేపడుతున్న పనులు కెసిఆర్ మంజూరు చేసిన పట్టణ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ నిధులతో చేపడుతున్నారన్నారు. రెండు పంటలకు నీళ్లు రావాలంటే కేసీఆర్ రావాలన్నారు. ప్రశ్నించే తత్వం.. బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేసే అవకాశం వచ్చిందన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రి కావడమే అందరి లక్ష్యం అని జగిత్యాల గడ్డ మీద పుట్టిన నినాదం రేవంత్ రెడ్డిని రెడ్డి పోవాలి.. కేసీఆర్ రావాలి.. అది నిజం చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ విద్యా విధానం కేవలం భవన నిర్మాణం మాత్రమేనన్నారు. విద్య, వైద్యం..కుల వృత్తులను దూరదృష్టితో ప్రోత్సహించిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రేవంత్ పాలనలో బెల్ట్ షాప్ లను ప్రోత్సహిస్తున్నారని, ఎక్సైజ్ ఆదాయం 23 వేల కోట్ల నుండి 40 వేల కోట్లకు పెంచుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు కోల్పోయినవి బీఆర్ఎస్ పాలనలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ జగిత్యాలలో ఎండిపోతున్న పంటలకు నీరు ఇవ్వాలని ఉత్తమ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో నీరు విడుదల చేశారని, జగిత్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యేకి సోయి లేదా..ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రోళ్ల వాగులో 0.25 టీఎంసీల నీరు నింపాలన్నారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ కు ఆయన శాఖపై పట్టు లేదని, కేంద్ర ప్రభుత్వం 600 కోట్లు విడుదల చేస్తే, మాచింగ్ గ్రాంట్ ఇవ్వలేక నిధులు వెనక్కిపోయాయన్నారు. కేసిఆర్ కు ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రశ్నించే గొంతుకగా ప్రజల పక్షాన పోరాటం చేయాలని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు కేసీఆర్ అని, ఆయన పాలనలో నూతన జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు సేవలు చేరువ అయ్యాయన్నారు. కెసిఆర్ పాలనలో పదేళ్ల అతి తక్కువ కాలంలో భారత దేశ చరిత్రలో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంతోపాటు అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన నాయకుడు కేసీఆర్ మినహా ఎవరు లేరన్నారు. తక్కువ నీటి వినియోగం పంటలు వేయాలని చెప్పడానికి మంత్రి కావాలా.. చెప్పడానికి సిగ్గు అనిపించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పై విరుచుకుపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో 46 వేల చెరువులు మరమ్మతులు చేయించారని, నిరంతర విద్యుత్ సరఫరా కోసం 07 వేల నుండి 20 వేల మెగా వాట్ ల విద్యుత్ ఉత్పత్తి చేశారని పేర్కొన్నారు. వాతావరణ సమతుల్యత కోసం కెసిఆర్ 273 కోట్ల మొక్కలు నాటిన నాయకుడు కెసిఆర్ అని కొనియాడారు. రేవంత్ రెడ్డికి అసలు మొక్కల విలువ తెలుసా..అని నిలదీశారు. కేసీఆర్ పాలనలో గురుకుల పాఠశాలలు ప్రారంభించి, అన్ని వర్గాల ప్రజలకు విద్యనందిస్తే, రేవంత్ రెడ్డి పాలనలో 04 వేల ప్రభుత్వ పాఠశాలలు మూసివేశారన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో అన్ని రంగాలు సర్వనాశనం అయ్యాయని, రేవంత్ రెడ్డి పాలనకు చరమ గీతం పాడాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులను అక్రమ కేసులతో అనగధోక్కుతున్నారు. అరాచక పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందరికీ పని చేయాలి..ప్రస్థుత ప్రభుత్వం కేవలం కాంగ్రెస్ నాయకుల కోసం మాత్రమే పని చేస్తుందన్నారు. జీవన్ రెడ్డి నాలుగు దశాబ్దాలుగా ప్రజల కోసం పని చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలపై బీఆర్ఎస్ నాయకులు గళం ఎత్తాలన్నారు. జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యా సాగర్ రావు మాట్లాడుతూ.. జిల్లాలను చిన్న జిల్లాలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసి, పరిపాలన ప్రజలకు చేరువ చేశారని, కేసీఆర్ ను స్ఫూర్తిగా తీసుకొని ఇతర రాష్ట్రాలు సైతం జిల్లాలు ఏర్పాటు చేశాయన్నారు. కేసీఆర్ 14 ఏళ్లు ఉద్యమం చేసి, తెలంగాణ సాధించారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మార్పు తెస్తామని చెప్పి, రాష్ట్రంలో దుర్మగమైన పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. మెడికల్ కళాశాల పూర్తి చేస్తే కేసీఆర్ కు ఎక్కడ పేరు వస్తుందోనని జాప్యం చేశారని విమర్శించారు. కెసిఆర్ 24 గంటల కరెంట్ ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 8 గంటల కరెంట్ ఇస్తున్నారని, యూరియా కోసం చెప్పులు క్యూ పెట్టే పాత రోజులు తీసుకువచ్చారన్నారు. వరద నీటిని కన్నెపల్లి పంపు హౌస్ నుండి ఎత్తిపోసి సద్వినియోగం చేసుకోవాలని మొదటి నుండి చెప్తున్న పట్టించుకోలేదని, ప్రభుత్వ అసమర్థత తో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ప్రభుత్వ అవినీతి పాలనపై బీఆర్ఎస్ శ్రేణులు గళం ఎత్తాలన్నారు. కెసిఆర్ వస్తేనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి అవుతుందన్నారు. కెసిఆర్ అసెంబ్లీ భవనాన్ని తాజ్ మహాల్ అద్భుతంగా నిర్మాణం చేపట్టారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనీ పథకాలను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చేదాకా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ మాట్లాడుతూ.. చావు నోట్లు తలపెట్టి, తెలంగాణ సాధించిన కెసిఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ప్రజలకు పాలన అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు నూతన జిల్లాలు ఏర్పాటు చేశారన్నారు. వలసలు, రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు, రైతులను ఆదుకునేందుకు రైతు బంధు ప్రవేశపెట్టారని, అన్నం పెట్టే రైతన్న మరణిస్తే కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు బీమా ప్రవేశ పెట్టారని అన్నారు. వరద కాలువలో 365 రోజులు నీరు నిల్వ చేసి, పంటలకు నీరు అందించారని, పదేళ్లు తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని, పెన్షన్ 4000 ఇస్తామని చెప్పి మాట మరిచారని విమర్శించారు. కెసిఆర్ చేసిన అభివృద్ధిని నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, రేవంత్ రెడ్డి దుర్మార్గమైన పాలనకు చరమ గీతం పాడాలన్నారు. వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహ రావు మాట్లాడుతూ..జగిత్యాల జిల్లా ఏర్పాటు చేసి, నిరుపేదలకు వైద్యం అందజేశారని, జిల్లాల ఏర్పాటుతో వైద్య కళాశాలలతో వైద్య విద్య, మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. బోర్లలో నీళ్లు ఉన్న పంటలు వేయవద్దని, ప్రభుత్వం చెబుతోందని , పంటలు వేయకపోతే, రైతులు, సామాన్య ప్రజలు బతికెదేట్ల అని ప్రశ్నించారు. కెసిఆర్ ను రోజు తిడితే పంటలకు నీరు అందుతదా అని రేవంత్ రెడ్డినీ ప్రశ్నించారు. కెసిఆర్ మళ్ళీ రావాలని ప్రజల గుండెల్లో ఉందని, కెసిఆర్ వస్తేనే తెలంగాణ ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని కోట్లాడి తీసుకువస్తే, ఎల్ నినో ప్రభావం పేరుతో ప్రభుత్వం ప్రజలను గోస పెడుతున్నది. నీళ్లిస్తే పంటలు కొనుగోలు చేయాలని నీళ్లు ఇవ్వడం లేదన్నారు. ఓరుగంటి రమణ రావు మాట్లాడుతూ..ఉద్యమానికి ప్రణాళిక రచించి, పదవులకు రాజీనామా చేసి, తెలంగాణ ప్రాంత ప్రజలు ఉమ్మడి రాష్ట్రంలో వివక్ష కు గురి అవుతున్నారని, కేసీఆర్ పోరాటం చేశారని గుర్తు చేశారు.గాంధేయ మార్గములో దేశంలో రాష్ట్రాన్ని సాధించిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని, కోట్లాడి సాధించిన తెలంగాణను అభివృద్ధి చేసేందుకు అన్ని ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. పుట్టిన బిడ్డ దగ్గరి నుండి కాటికి చాపిన వృదుల వరకు అందరికీ సంక్షేమ పథకాలు అందించారని, నూతన జిల్లా ఏర్పాటు తో విద్యా, వైద్య సౌకర్యాలు, పరిపాలన సౌలభ్యం ఏర్పడిందన్నారు. రేవంత్రెడ్డి ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి అని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉద్యమంతో విధిలేని పరిస్థితి కల్పించి, కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించామన్నారు. కేసీఆర్ 75 శాతం జిల్లాలకు నీరు అందించేలా కాలువలు సిద్ధం చేశారని, జిల్లాలు, మండలాలు, పంచాయతీలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీనీ బీఆర్ఎస్ నాయకులు ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు. మాజీ మార్క్ ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ కోసం ప్రాణ త్యాగానికి సిద్ధమై, తెలంగాణ సాధించారని, కెసిఆర్ మళ్ళీ రావాలని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావా వసంత సురేష్ మాట్లాడుతూ.. ఓరుగంటి రమణ రావు ఉద్యమ జెండా పాతారని, జిల్లా ఏర్పాటుతో జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ గా తనకు అవకాశం లభించిందన్నారు. సొంత అభివృద్ధి కోసం పార్టీ మారిన ఎమ్మెల్యే మెడికల్ భవనాలు పూర్తి చేయాలని సోయి లేదని అన్నారు. తెలంగాణ తల్లినీ మార్చిన తెలంగాణ ద్రోహి.శ్రీ రేవంత్ రెడ్డికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. కాలం తెచ్చిన కరవు కాదు ఇది..కాంగ్రెస్ తెచ్చిన కరువు అని అన్నారు..రాష్ట్రంలో నియంత పాలన సాగుతుందని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు.

# ఓటు చోరీ ప్రజాస్వామ్యంపై దాడి.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

## టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, అక్టోబర్ 12 : తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఇతర పార్టీ నాయకులు న్యూఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల హక్కుల పరిరక్షణ అంశాలపై తమ నిరసనను వ్యక్తం చేస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదని, కోట్లాది మంది పౌరుల ఓటు హక్కుకు భంగం కలిగించే చర్యలు ప్రజాస్వామ్య పునాదులను బలహీనపరుస్తాయని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని, ఓట్ల తొలగింపు, ఓటర్ల హక్కులకు విఘాతం కలిగిందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రభావంలో ఎన్నికల సంఘం పనిచేస్తోందనే అనుమానాలకు తావులేకుండా తన స్వతంత్రతను, నిష్పక్షపాత వైఖరిని ఎన్నికల సంఘం నిరూపించుకోవాలని ఆయన అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లడం దేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అభిప్రాయపడ్డారు. ప్రజల తీర్పును దొంగిలించడమే ఓటు చోరీ అని, పౌరుల ఓటు హక్కును హరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. కోట్లాది మంది ఓటర్ల హక్కులపై ప్రశ్నలు తలెత్తుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం మౌనంగా ఉండకూడదని అన్నారు.




జ్ఞానేశ్ కుమార్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని, ఆయన హయాంలో తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలపై సమగ్ర, నిష్పక్షపాత పునఃసమీక్ష చేపట్టాలని కోరారు. చట్టవిరుద్ధ చర్యలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల సంరక్షణ, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఓటుతో ఏర్పడే ప్రభుత్వాల విషయంలో పారదర్శకత, ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాత వైఖరి అత్యంత కీలకమని తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం తమ గళాన్ని వినిపించారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రతి ఓటు విలువను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని డా. సత్యం శ్రీరంగం వెల్లడించారు.

# దసరా వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి

- భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌కు కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ వినతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 12 : భువనగిరి పట్టణంలోని రాంనగర్ 22వ వార్డులో ఉన్న బ్రహ్మంగారి దేవాలయం వద్ద ఈ నెల 20న నిర్వహించనున్న దసరా వేడుకలకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేయాలని కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ కోరారు. ఈ మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా బ్రహ్మంగారి దేవాలయం వద్ద జమ్మి ఆకులు తీసుకునేందుకు భువనగిరి పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారని తెలిపారు. ఈ ఏడాది కూడా వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఆలయ పరిసర ప్రాంతాలతో పాటు భక్తులు రాకపోకలు సాగించే మార్గాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని, తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే పారిశుధ్య నిర్వహణలో భాగంగా బ్లీచింగ్ పౌడర్ చల్లడం, భక్తుల భద్రతకు అవసరమైన ఇతర చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఈ నెల 20వ తేదీలోపు ఏర్పాట్లు పూర్తి చేయాలని కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ మున్సిపల్ అధికారులను కోరారు.

# గోలివాడ పెద్దాయన పెంద్రు హనుమాన్ రెడ్డి ఇక లేరు

- ప్రాణం ఉన్నంతవరకు కాంగ్రెస్ జెండా ఎత్తి పట్టిండు - సమ్మక్క సారలమ్మ జాతర ఆవిర్భావ సారధి అతడే - ఎమ్మెల్యే ఎమ్మెస్ ఠాకూర్ ఆత్మీయులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, అక్టోబర్ 12 : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలి వాడ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత కాంగ్రెస్ పార్టీ పెద్దదిక్కు పెద్దాయన పెంద్రు హనుమాన్ రెడ్డి (75) తన స్వగృహంలో గత కొన్ని మాసాలుగా అనారోగ్యానికి గురై మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హయంలో బర్మా శ్రీలంక కాందిశీకుల కోసం అంతర్గంలో ఏర్పాటు చేసిన స్పిన్నింగ్ మిల్లు వాచ్మెన్ గా ఉద్యోగ బాధ్యతలను చేపట్టి ఐ ఎన్ టి యు సి జాతీయ నాయకులు సంజీవరెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎత్తి పట్టారు.. యుక్త వయసులోనే కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పనిచేస్తూ దివంగత కేంద్ర మంత్రి జి వెంకటస్వామి (కాక) ప్రధాన అనుచరునిగా పార్టీలో కీలక భూమిక పోషించారు గోలి వాడ గోదావరి నది తీరంలో భయ్యాజీ సార్ కలలోకి సమ్మక్క సారలమ్మ వచ్చి గోదావరి నది ఉత్తరాయణం పారుతుంది అందుకే ఇక్కడికి వచ్చాను అని చెప్పడం ఆ వనదేవతల ఆత్మ సందేశం మేరకు గోలివాడ సమ్మక్క సారలమ్మ జాతరను ఆనాటి గ్రామ పెద్దలు ఆవుల చంద్రయ్య యాదవ్ కోల శంకర్ గౌడ్ కృష్ణారెడ్డి తదితరులతో కలిసి హనుమాన్ రెడ్డి ప్రారంభించారు ఆనాటి సమ్మక్క సారలమ్మ జాతర నేడు మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు సాటిగా భక్తుల రాకతో రెండో జాతరగా తెరపైకి వచ్చింది గోలివాడ సమ్మక్క సారాలమ్మ జాతరలో పెద్దరాయుళ్లుగా ఆవుల చంద్రయ్య యాదవ్ కోల శంకర్ గౌడ్ పెంద్రు హనుమాన్ రెడ్డి ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు మహారాష్ట్ర గడ్చిరోలి ప్రాంతాల నుంచి వచ్చే సమ్మక్క సారమ్మ భక్తులకు సేవలు అందించి వారికి సుపరిచితులు కావడం విశేషం కోల శంకర్ గౌడ్ గతంలో మృతిచెందగా హనుమాన్ రెడ్డి కి తోడు నీడ కుడి భుజం ఆవుల చంద్రయ్య యాదవ్ గత సంవత్సరం మృతి చెందగా తన ప్రాణ స్నేహితుని జ్ఞాపకాలలో సోమవారం పెంద్రు హనుమాన్ రెడ్డి తుది శ్వాస విడవడం గోలివాడ సమ్మక్క సారలమ్మ జాతర పునాదిరాళ్లు కూలిపోయినట్లయ్యింది... గత ఐదు దశాబ్దాలుగా పెంద్రు హనుమాన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ ఆత్మీయ బంధువుగా కాంగ్రెస్ పార్టీ బాధ్యతలను తన భుజాలపై వేసుకుని చివరి ఊపిరి వరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పెద్దాయన హనుమాన్ రెడ్డి పార్టీకి చేసిన సేవలు మరువరానివి మరువలేనివి... అందుకే అతని జీవత చివరి మజిలిలో ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ మేడిపల్లి సింగల్ విండో చైర్మన్ గా ప్రకటించారు కాంగ్రెస్ పార్టీ పెద్దాయన హనుమాన్ రెడ్డి మేడిపల్లి సింగల్ విండో చైర్మన్ గా భాద్యతలతోనే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల గుండె ఊపిరి ఆగిపోయి తన కుటుంబ బంధువులతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులను కన్నీటి విషాదంలో కి నెట్టింది... హనుమాన్ రెడ్డి మృతి వార్త సమాచారం అందగానే ఢిల్లీకి వెళ్లిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ హనుమాన్ రెడ్డి కుటుంబానికి సంతాపాన్ని ప్రకటిస్తూ కాంగ్రెస్ పార్టీ పెద్దాయన హనుమాన్ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి ప్రధానంగా తమకు తీరని లోటని అన్నారు

హనుమాన్ రెడ్డి మృతికి రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత ఉమ్మడి రామగుండం మండల మాజీ జెడ్పిటిసి టి అయోధ్య సింగ్ ఠాకూర్ పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పూదరి సత్తయ్య గౌడ్ మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గీట్ల శంకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు ఆయా పార్టీల నేతలు హనుమాన్ రెడ్డి కుటుంబానికి సంతాపాన్ని ప్రకటించారు మంగళవారం హనుమాన్ రెడ్డి అంత్యక్రియలు కుటుంబ సభ్యులు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

# విద్యుత్ సబ్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎన్పీడీసీఎల్ సిఎండీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోరుట్ల, అక్టోబర్ 12 : నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి (ఐఏఎస్) ఆకస్మిక పర్యటనలో భాగంగా సోమవారం కోరుట్ల 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ను తనిఖీ చేసి, వ్యవసాయ రంగానికి త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా తీరును పరిశీలించారు. 33 కేవీ ఫీడర్ల లోడ్‌పై సిబ్బందికి తగు సూచనలు ఇచ్చా రు. రైతంగానికి నాణ్యమైన అంతరాయం లేని త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని అధి కారు లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలో మెట్‌పెల్లి డివిజనల్ ఇంజనీర్ మధుసూదన్, జగిత్యాల డివిజనల్ ఇంజనీర్ టెక్నికల్ గంగారాం, ట్రాన్సకో డివిజనల్ ఇంజనీర్ సంపత్ కుమార్, కోరుట్ల పట్టణ ఏడీఈ భూమేశ్వర్, ఏఈ శ్యామ్, సిబ్బంది పాల్గొన్నారు.

# కోటి రూపాయలతో ఆధునిక ఆలయం!

- మంగంపల్లిలో ఆంజనేయస్వామి, శివాలయాల పునర్నిర్మాణానికి శ్రీకారం
- ప్రత్యేక పూజలు, హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి అక్టోబర్ 12 : భక్తుల ఆధ్యాత్మిక ఆకాంక్షలకు అనుగుణంగా మంగంపల్లి గ్రామంలో కోటి రూపాయల వ్యయంతో ఆధునిక ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పెద్దమందడి మండలంలోని గ్రామంలో ఉన్న పాత ఆంజనేయస్వామి, శివాలయాల స్థానంలో నూతన ఆలయాన్ని నిర్మించేందుకు సోమవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, శారదారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

# ఆరోగ్యం

## ఎండాకాలం ఫ్రిడ్జ్‌లో ప్లాస్టిక్ వాటర్ బాటిల్ పెట్టేవారికి షాకింగ్ న్యూస్ - వారికైతే మరణం గ్యారెంటీ!

ఈ రోజుల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వాడకం విపరీతంగా పెరిగింది. సీసా బాటిళ్లతో కూడిన వాటర్ బాటిళ్లు మార్కెట్లో చాలా రకాలుగా అందుబాటులో ఉన్నప్పటికీ, ఎక్కువమందీ ఇంట్లో ఫ్రిజ్‌లో ప్లాస్టిక్ బాటిళ్లనే ఎక్కువగా వాడతారు. దీనికి కారణం, సీసా బాటిళ్లను తీసుకోవడం చాలా ఖరీదైనది. అలాగే వాటిని తీసుకున్న తరువాత కూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే అవి పగిలిపోతాయి. కానీ ప్లాస్టిక్ బాటిళ్ల ధర చౌకగా ఉంటుంది. కింద పడ్డ కూడా అంత సులభంగా పగలవు. అందుకే ఎక్కువ మంది వీటిని వినియోగించడానికి ట్రై చేస్తుంటారు. కానీ ఈ ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం కొన్ని ఆరోగ్య ప్రమాదాలకు దారితీస్తుంది. అవి మన ఆరోగ్యంపై ప్రతికూలమైన ప్రభావాన్ని చూపిస్తాయి. అవేంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం రండి. ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం వల్ల వచ్చే ప్రమాదాలు ప్లాస్టిక్ బాటిళ్లను ప్రస్తుత కాలంలో ఎన్నో రసాయనాలు వాడి తయారు చేస్తున్నారు. వాటి మనం ప్రతిరోజూ వాడే విధానం, వాటిలోని రసాయనాలు కరిగి మన శరీరంలోకి చేరే అవకాశం ఉంటుంది. అలాగే అందులోని బ్యాక్టీరియా, ప్రమాదకరమైన ప్లాస్టిక్ కణాలు అంతా మన శరీరంలోకి చేరి.. ప్రమాదకరమైన క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడే అవకాశాన్ని సృష్టిస్తాయి. అందుకే ప్లాస్టిక్ బాటిళ్లను వాడడం అనేది అత్యంత జాగ్రత్తగా చేయాల్సిన ప్రక్రియ. ప్లాస్టిక్ బాటిళ్లను వాడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు: బాటిళ్లను తరచూ మార్చడం: ఫ్రిజ్‌లోని ప్లాస్టిక్ బాటిళ్లను ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలి. ఒకే బాటిల్‌ను చాలా కాలం వాడడం వల్ల, అది మురికితో నిండిపోతుంది. అలాగే అందులో బక్టీరియా పెరుగుతుంది. అలాగే, ప్లాస్టిక్ బాటిళ్లలోని రసాయనాలు నీటిలోకి లీక్ అవటం వల్ల.. అందులోని ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు శరీరంలోకి ప్రవేశించవచ్చు. ఎన్ని రోజుల్లో ప్లాస్టిక్ బాటిళ్లు మార్చాలంటే సాధారణంగా, ప్లాస్టిక్ బాటిళ్లను 6 నెలలలోపు మార్చడం మంచిది. కొన్ని అధిక నాణ్యత కలిగిన ప్లాస్టిక్ బాటిళ్లు 12 నెలల వరకు వాడొచ్చు. అయితే, బాటిల్ పగిలిపోయినట్లయితే, దుర్వాసన వచ్చిందని గమనిస్తే వెంటనే మార్చాలి.



గ్లాస్ మరియు స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు

గ్లాస్ వాటర్ బాటిళ్లు, సాధారణంగా, 2-3 సంవత్సరాల పాటు ఉపయోగించవచ్చు. స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు కూడా 2 సంవత్సరాల తర్వాత కచ్చితంగా మార్చాల్సిన అవసరమైతే ఉంటుంది. ఇవి స్థిరమైన పదార్థాలతో తయారు కావడంతో పాటు తొందరగా పాడవకపోవడంతో వాటిని ఎక్కువగా కాలం వినియోగించుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రతిరోజూ శుభ్రం చేయడం బాటిళ్లను సరైన పద్ధతిలో శుభ్రం చేయడం చాలా ముఖ్యం. ప్రతి రోజు వాటిని వేడి నీటి మరియు సబ్బుతో శుభ్రం చేయడం వల్ల అందులో బక్టీరియా పెరుగుదలను నివారించవచ్చు. శుభ్రతను పాటించడం వలన బాటిల్ శుభ్రంగా ఉండడంతో పాటు అందులో పోసే నీరు కూడా పరిశుభ్రంగా ఉంటుంది. ప్లాస్టిక్ బాటిళ్లకు ప్రత్యామ్నాయాలు: గ్లాస్ బాటిళ్లు: గ్లాస్ బాటిళ్లను ఉపయోగించడం చాలా మంచి ప్రత్యామ్నాయం. ఇవి లీకేజి సమస్య లేకుండా, ఆరోగ్యానికి ప్రమాదకరం కాని పదార్థాలను విడుదల చేయవు. స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు: ఇవి కూడా మంచి ఆప్షన్. ఇవి దృఢంగా ఉండి, ఎక్కువ కాలం వాడటానికి సరైనవి. ఇవి పగిలిపోవడం లేదా లీక్ అవడం చాలా అరుదు. తగిన జాగ్రత్తలు ప్లాస్టిక్ బాటిళ్లలో నీటి నిల్వ చేయడానికి, మంచి నాణ్యత కలిగిన బాటిళ్లను మాత్రమే తీసుకోవడం మంచిది. బాటిళ్లను మూసివేసి ఉంచుకోవడం వల్ల బయట జంతువులు, ధూళి, కురుపులు వాటిలో చేరకుండా ఉంటాయి. సీసా లేదా స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లలోనే నీటి నిల్వ చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిది.

## మండే ఎండలో ఈ షర్బత్ తాగితే చిటికెలో బాడీ కూల్ అయిపోతుంది

### రంజాన్ స్పెషల్ కూడా.. ఎలా చేసుకోవాలంటే

రంజాన్ మాసం చివరి దశకు వచ్చేసింది. మరికొన్ని రోజుల్లో ఈ రంజాన్ మాసం ముగిసిపోతుంది. మార్చి 31వ తేదీన రంజాన్ పండగ తరువాత ఈ మాసం గుడ్ బాయ్ చెప్పనుంది. అయితే ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. బయటికి వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఎండ వేడిమి తాళలేక రకరకాల పానీయాలు తయారు చేసుకోవడం, బయట తాగడం వంటివి చేస్తున్నారు. అయితే ఇప్పటికీ రంజాన్ పండగ కొనసాగుతున్న నేపథ్యంలో సమ్మర్? ప్రత్యేకమైన చల్లని, రిఫ్రెషింగ్ షర్బత్ తాగితే ఆ రుచి, ఆ చల్లదనం అద్భుతంగా ఉంటుంది. అలాగే సమ్మర్‌లో తాగడానికి ఇదే బెస్ట్ ఆప్షన్ అంట కూడా. ఇంట్లో ఉండే సాధారణ పదార్థాలతోనే మీ ఇంటి సభ్యులు సమ్మర్ మజా అనుభవించవచ్చు. అయితే, దీనిని తయారుచేయడానికి అవసరమైన పదార్థాలు మరియు తయారీ విధానం ఈ స్టోరీలో తెలుసుకుందాం.

షర్బత్ తయారీకి కావలసిన పదార్థాలు: పంచదార - 1 కప్పు నీళ్లు - పావు కప్పు పాలు - 4 కప్పులు కస్టర్డ్ పొడి - 1 టేబుల్ స్పూన్ పాలు (కస్టర్డ్ కోసం) - 2 టేబుల్ స్పూన్లు కుంకుమ పువ్వు - అర టీస్పూన్ యాలకుల పొడి - 1 టీస్పూన్ చియా సీడ్స్ - 1 టేబుల్ స్పూన్ బాదం, పిస్తా పలుకులు - 2 టేబుల్ స్పూన్లు.

రంజాన్ షర్బత్ తయారీ విధానం: రంజాన్ షర్బత్ తయారు చేసుకోవడానికి మొదటగా స్టవ్‌పై పాన్ పెట్టి అందులో పంచదారను వేసి, సిమ్ మంట మీద కరిగేలా బాగా కలపాలి. పంచదార కరిగి అందులో పొంగుల ద్వారా రంగు మారినప్పుడు, దానిలో పావు కప్పు నీళ్లు జోడించాలి. నీళ్లు వేసిన తర్వాత మిశ్రమాన్ని బాగా కలుపుతూ ఉంచాలి. అలానే కలుపుతూ బాగా ఉడికించుకోవాలి.

ఇప్పుడు మంటను సిమ్‌లో ఉంచి, పంచదార కరిగిపోయే వరకు..



ఒక గిన్నెలో కుంకుమ పువ్వును నానబెట్టుకోవాలి. ఆ తరువాత, పాలు కూడా ఈ మిశ్రమంలో జోడించి బాగా కలపాలి. పాలు మరియు పంచదార చక్కగా కలిసిపోయేలా 4-5 నిమిషాలు ఉడికించాలి. ఈ సమయంలో, ఒక చిన్న గిన్నెలో కస్టర్డ్ పౌడర్ తీసుకుని, 2 టేబుల్ స్పూన్ల పాలు వేసి కరిగించాలి. ఈ కస్టర్డ్ మిశ్రమాన్ని స్టవ్‌పై ఉడికే మిశ్రమంలో జోడించి, గట్టిగా కలుపుతుండాలి. ఈ మిశ్రమం తయారు చేస్తున్న సమయంలో ఎటువంటి గడ్డలు రాకుండా ఎప్పటికప్పుడు కలుపుతూ ఉండాలి. ఇప్పుడు కుంకుమ పువ్వును మరియు యాలకుల పొడిని కూడా ఈ మిశ్రమంలో జోడించి, ఇంకో 5 నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఆ తరువాత ఈ మిశ్రమాన్ని మరొక గిన్నెలో తీసుకొని, రూమ్ టెంపరేచర్‌కి రానివ్వాలి. ఆ తరువాత 2 గంటలు ఫ్రిడ్జ్‌లో వుంచాలి. ఫ్రిడ్జ్ నుండి తీసిన తర్వాత, చియా సీడ్స్ లేదా బేసిల్ సీడ్స్‌ని నీటిలో నానబెట్టుకుని, షర్బత్‌లో జోడించి బాగా కలపాలి. చివరగా, బాదం మరియు పిస్తా పలుకులతో గార్నిష్ చేసి, ఐస్ క్యూబ్స్ వేసి చల్లగా సర్వ్ చేసుకోవచ్చు. ఈ చల్లని, టేస్టీ దూద్ షర్బత్‌ను రంజాన్ పండుగ సమయంలో కానీ, సమ్మర్ లోనూ చాలా సులభంగా, తక్కువ సమయంలోనే రెడీ చేసుకొని ఆస్వాదించొచ్చు.

## మన పూర్వీకులు తిన్నది ఇదే..



మనం ఇప్పటికీ మన పూర్వీకుల ఆరోగ్యం గురించి గొప్పగా చెప్పుకుంటుంటాం. బీపీలు, షుగర్ లు వంటి ఏ రోగాలు లేకుండా హాయిగా మన పూర్వీకులు జీవించడానికి ప్రధాన కారణం వారు తీసుకున్న ఆహారం. గట్టి ఆహారం తీసుకున్నారు కాబట్టే ముసలివయస్సులో ఎంతో యాక్టివ్ గా ఉంటేవాళ్లు. మన పూర్వీకులు తిన్న ఆరోగ్యకరమైన వంటకాల్లో మెంతికూర గట్టి పప్పు ఒకటి. ఇది పోషకాల గని అని చెప్పడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. సాధారణ పప్పు కంటే ఇది కొంచెం గట్టిగా ఉండటం వల్ల దీనికి గట్టి పప్పు అని పేరు వచ్చింది. ఇది అన్నం, చపాతీ లేదా రోటీతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది. రుచికరమైన,ఆరోగ్యకరమైన మెంతికూర పప్పు తయారుచేయడానికి కావలసిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

మెంతికూర గట్టి పప్పు తయారీకి కావలసిన పదార్థాలు -కంది పప్పు - 1 కప్పు -మెంతికూర - 1 పెద్ద కట్ట -ఉల్లిపాయ - 1 మీడియం సైజు -టమాటో - 1 మీడియం సైజు -పచ్చిమిర్చి - 2-3 -అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టీస్పూన్ -పసుపు - 1/2 టీస్పూన్ -కారం - 1/2 టీస్పూన్ -ధనియాల పొడి - 1/2 టీస్పూన్ -జీలకర్ర పొడి - 1/4 టీస్పూన్ -ఆవాలు - 1/2 టీస్పూన్ -జీలకర్ర - 1/2 టీస్పూన్ -ఎండుమిర్చి - 2 -కరివేపాకు - 1 రెమ్మ -నూనె - 2 టేబుల్ స్పూన్లు -ఉప్పు - తగినంత -నిమ్మరసం - కొద్దిగా.

మెంతికూర గట్టిపప్పు తయారీ విధానం -ముందుగా కంది పప్పును శుభ్రంగా కడిగి కనీసం 30 నిమిషాల పాటు నీటిలో నానబెట్టండి. ఇలా చేయడం వల్ల పప్పు త్వరగా ఉడుకుతుంది, రుచిగా ఉంటుంది. -తర్వాత నానబెట్టిన పప్పును కుక్కర్ లో వేసి తగినంత నీరు, కొద్దిగా పసుపు వేసి 3-4 విజిల్స్ వచ్చే వరకు ఉడికించండి. పప్పు మెత్తగా ఉడకాలి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి కొద్దిగా నూనె వేడి చేసి తరిగిన ఉల్లిపాయలు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించండి. తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు వేయించండి. -ఇప్పుడు తరిగిన టమాటో ముక్కలు వేసి మెత్తబడే వరకు ఉడికించండి. తర్వాత తరిగిన మెంతికూర వేసి అది మగ్గే వరకు ఉడికించాలి. మెంతికూర బాగా మగ్గితే దాని చేదు రుచి తగ్గుతుంది. -ఉడికించిన పప్పును పప్పు గుత్తితో మెత్తగా మాష్ చేసి..మగ్గిన మెంతికూర మిశ్రమంలో వేయండి. కారం పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి,రుచికి తగినంత ఉప్పు వేసి బాగా కలపండి. అవసరమైతే కొద్దిగా నీరు పోసి పప్పు గట్టిదనాన్ని సర్దుబాటు చేసుకోండి. -పప్పును మూత పెట్టి 5-7 నిమిషాలు తక్కువ మంట మీద మరిగించండి. ఇలా చేయడం వల్ల అన్ని రుచులు బాగా కలిసిపోతాయి.

## ఎగ్ బటర్ మసాలా..తిన్నారంటే మస్త్ మజా,ఎలా చేయాలంటే..



ఎగ్ బటర్ మసాలా తయారు చేయడానికి కావలసిన పదార్థాలు -గుడ్లు: 4 -కొత్తిమీర: కొద్దిగా -కసూరి మెంతి: 1 టీ స్పూన్ -కారం: 1 టీ స్పూన్ -ధనియాల పొడి: 1 టీ స్పూన్ -జీలకర్ర పొడి: 1/2 టీ స్పూన్ -గరం మసాలా: 1/2 టీ స్పూన్ -పసుపు: 1/4 టీ స్పూన్ -ఉల్లిపాయలు: 2 -టమాటాలు: 3 -అల్లం వెల్లుల్లి పేస్ట్: 1 టేబుల్ స్పూన్ -ఫ్రెష్ క్రీమ్ (మీగడ): 2 టేబుల్ స్పూన్లు -జీడిపప్పు: 10-12 -పచ్చిమిర్చి: 2 -నూనె లేదా నెయ్యి: 2 టేబుల్ స్పూన్లు -బటర్: 2 టేబుల్ స్పూన్లు -చక్కెర: 1/2 టీ స్పూన్ -ఉప్పు: తగినంత

### ఎగ్ బటర్ మసాలా తయారీ విధానం

-ముందుగా గుడ్లను బాగా ఉడికించి పొట్టు తీసి ఒక్కో గుడ్డును రెండు సమాన భాగాలుగా కోయాలి. మీరు కావాలంటే గుడ్డు సొనను తీసి పక్కన పెట్టుకోవచ్చు (దీనిని గ్రేవీలో వేసుకోవచ్చు). -తర్వాత వేడినీళ్లలో నానబెట్టిన జీడిపప్పును మిక్సీలో వేసి కొద్దిగా నీరు కలిపి మెత్తని పేస్ట్ లా గ్రైండ్ చేసుకోవాలి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి అందులో నూనె లేదా నెయ్యి వేడి చేసి అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయలు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. -ఉల్లిపాయలు వేగిన తర్వాత..తరిగిన టమాటాలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి టమాటాలు మెత్తగా అయ్యే వరకు ఉడికించాలి. మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి,లేదంటే అడుగంటుతుంది. -టమాటాలు మెత్తగా ఉడికిన తర్వాత కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, పసుపు,పచ్చిమిర్చి వేసి బాగా కలపాలి. మసాలాలు నూనెలో కాసేపు వేగితే మంచి సువాసన వస్తుంది. -ఇప్పుడు తయారు చేసుకున్న జీడిపప్పు పేస్ట్ ను అందులో వేసి బాగా కలపాలి. ఇది గ్రేవీకి మంచి చిక్కదనాన్ని ఇస్తుంది. ఒక నిమిషం పాటు ఉడికించాలి. -ఇప్పుడు అవసరమైన మేరకు నీరు పోసి, గ్రేవీని మీకు కావలసిన చిక్కదనానికి తీసుకురావాలి. తర్వాత రుచికి తగినంత ఉప్పు వేసి కలపాలి. -గ్రేవీ మరిగిన తర్వాత బటర్ లేదా వెన్న, గరం మసాలా వేసి బాగా కలపాలి. వెన్న కరిగే వరకు ఉడికించాలి. -తర్వాత నలిపిన కసూరి మెంతి, కావాలనుకుంటే కొద్దిగా చక్కెర వేసి కలపాలి. చక్కెర వేయడం అనేది ఆప్షనల్.. కానీ ఇది రుచిని బ్యాలెన్స్ చేస్తుంది.

## 'రామాయణ' రెండో ట్రైలర్ దసరాకేనా.. అక్టోబర్ 20న మరో భారీ అప్‌డేట్!




భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత భారీ అంచనాలు నెలకొల్పుతున్న చిత్రాల్లో 'రామాయణ' కూడా ఒకటి. దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ పౌరాణిక గాథలో బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, కన్నడ స్టార్ యశ్ రావణుడిగా కనిపించనున్నారు. అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో చిత్రానికి సంబంధించిన రెండో థియేట్రికల్ ట్రైలర్‌ను దసరా సందర్భంగా విడుదల చేయనున్నారనే ప్రచారం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.'రామాయణ' చిత్రానికి సంబంధించిన రెండో ట్రైలర్‌ను అక్టోబర్ 20, 2026న విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే రోజున ప్రపంచవ్యాప్తంగా ముందస్తు టికెట్ విక్రయాలు కూడా ప్రారంభం కానున్నాయని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే రెండో ట్రైలర్ విడుదల తేదీపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. దసరా పండుగ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేస్తే సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది.ప్రధానంగా చూపిస్తూ ఈ కొత్త ట్రైలర్‌ను రూపొందిస్తున్నారనే వార్తలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.

## మైత్రీ మూవీ మేకర్స్ నుంచి మరో రొమాంటిక్ కామెడీ..




టాలీవుడ్‌లో వైవిధ్యమైన కథలు, భారీ చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ మరో కొత్త సినిమాను ప్రారంభించింది. ఈసారి ప్రేమ, హాస్యం, కుటుంబ భావోద్వేగాల కలయికతో ఓ వినోదాత్మక ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమైంది. ఈ చిత్రంలో జై జాస్తి, ప్రముఖ నటుడు శ్రీకాంత్ కుమార్తె మేధా మేక జంటగా నటించనున్నారు. తాత్కాలికంగా ఈ సినిమాకు 'చమైత్రీ ఇన్ లవ్' అనే పేరును ఖరారు చేశారు. 'ఉప్పెన' వంటి విజయవంతమైన ప్రేమకథా చిత్రాన్ని అందించిన మైత్రీ మూవీ మేకర్స్.. మరోసారి రొమాంటిక్ కామెడీ కథాంశంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.అబ్బాయి, అమ్మాయి మధ్య ఉండే ప్రత్యేకమైన అనుబంధం, వారి మధ్య చోటుచేసుకునే ఆసక్తికర పరిణామాలు, ప్రేమలోని మధురమైన అనుభూతులు, హాస్యభరిత సంఘటనలతో ఈ సినిమాను రూపొందించనున్నారు. కుటుంబ భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యం ఇస్తూ, నేటి తరం ప్రేక్షకులకు దగ్గరగా ఉండే కథతో ఈ చిత్రం తెరకెక్కనుంది.ఈ సినిమాలో జై జాస్తి కథానాయకుడిగా నటిస్తుండగా, మేధా మేక కథానాయికగా కనిపించనున్నారు. కొత్త జంటతో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందిస్తుందో వెండితెర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

## హీరోగా ఎంట్రీ ఇస్తున్న రామ్ చరణ్ మేనేజర్ కొడుకు



టాలీవుడ్ నుంచి హీరోల వారసులే కాకుండా, వారి వెన్నంటి ఉండే సన్నిహితుల కుటుంబాల నుంచి కూడా కొత్త టాలెంట్ వస్తుంటుంది. తాజాగా రామ్ చరణ్ డేట్స్, ఇతర సినిమా వ్యవహారాలను దశాబ్ద కాలంగా చూసుకుంటున్న ఆయన మేనేజర్ ప్రవీణ్ కుమారుడు దృషిక్ హీరోగా పరిచయం కాబోతున్నాడు. దృషిక్ చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తితో లండన్‌లోని ఒక ప్రముఖ యాక్టింగ్ స్కూల్‌లో శిక్షణ పొందినట్లు తెలుస్తుంది. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఆయన ఇప్పుడు ఒక క్రేజీ ప్రాజెక్ట్ ద్వారా వెండితెరకు పరిచయం కాబోతున్నారు. బ్లాక్‌బస్టర్ హిట్ సిరీస్ అయిన 'మ్యాడ్' ఫ్రాంచైజీలో రాబోతున్న 'మ్యాడ్ 3' చిత్రంలో దృషిక్ ఒక హీరోగా ఎంపికైనట్లు తెలుస్తోంది. సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ నిర్మిస్తున్న ఈ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌లో దృషిక్‌కి అవకాశం రావడం విశేషం. రామ్ చరణ్‌కు అత్యంత సన్నిహితుడైన ప్రవీణ్ కుమారుడు కావడంతో, ఈ కుర్రాడికి మెగా ఫ్యామిలీ మద్దతు కూడా ఉండవచ్చని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నటనతో పాటు డ్యాన్స్, ఫిట్‌నెస్‌లో కూడా దృషిక్ ఇప్పటికే మంచి పట్టు సాధించినట్లు సమాచారం.

## అతడి నిర్ణయమే ఫైనల్..

### పెళ్లి పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టిన మమిత

ప్రేమలు సినిమాతో తెలుగులో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది మలయాళ భామ మమితా బైజు. ఇటీవలే సూర్యతో నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్ మూవీతోపాటు బెత్లెహామ్ కుటుంబ యూనిట్ సినిమాలతో మంచి హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారిపోయిన ఈ భామ పెళ్లిపై వస్తున్న పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.



తాను ఎవరిని పెళ్లి చేసుకుంటాననే విషయంతోపాటు తన జీవితంలోని ప్రతీ స్టెప్‌ను తన సోదరుడు మిథున్ బైజు నిర్ణయిస్తాడని చెప్పింది మమితా బైజు. నేను, నా సోదరుడు మిథున్ బైజు స్నేహితుల కంటే ఎక్కువ. నాకు సంబంధించి ప్రతీ నిర్ణయం మిథునే తీసుకుంటాడు. నా పెళ్లి విషయంలో కూడా మిథున్ తీసుకునే నిర్ణయమే ఫైనల్. నాకు వచ్చే లవ్ ప్రపోజల్స్‌ను హ్యాండిల్ చేసేది కూడా అతడే.. అంటూ కామెంట్ సెక్షన్‌లోకి ఎంట్రీ ఇచ్చిన మమితా బైజు ఏంటీ..? అని రాసి ఉన్న డైలామాతో కూడిన మినియన్ స్టిక్కర్‌ను పోస్ట్ చ్ఞ?స్తూ తన పెళ్లిపై వస్తున్న పుకార్లకు చెక్ పెట్టింది.

## ధనుష్‌కి నచ్చనిది రాకీ భాయ్‌కి ఎలా నచ్చిందో..? కేజీఎఫ్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన యశ్ ఇటీవల 'టాక్సిక్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే.

కేజీఎఫ్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన యశ్ ఇటీవల 'టాక్సిక్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశ పరిచింది. కన్నడంలో కాస్త పర్వాలేదు అనిపించినా ఓవరాల్‌గా సినిమా డిజాస్టర్‌గా నిలిచింది. ఉత్తర భారతంలో టాక్సిక్ సినిమా తీవ్రమైన విమర్శలు ఎదుర్కొంది. యశ్ ఈ సినిమాకు ఎందుకు ఇంత సమయం తీసుకున్నాడు అంటూ విమర్శించిన వారు చాలా మంది ఉన్నారు. నెగిటివ్ రివ్యూలు ఓ రేంజ్‌లో దక్కించుకున్న ఈ సినిమా వసూళ్ల విషయంలో బయ్యర్లకు రక్త కన్నీరు మిగిల్చింది అంటూ టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో యశ్ తదుపరి సినిమా ఏంటా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కేజీఎఫ్ తర్వాత చాలా గ్యాప్ తీసుకుని టాక్సిక్ సినిమాను ప్రకటించిన యశ్ ఈసారి అంత ఎక్కువ గ్యాప్ లేకుండా వెంటనే కొత్త సినిమాను ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



చాశ్రీంశీ =ముఃu – ఏడాది తర్వాత బిజీ అయిన ముద్దుగుమ్మ..! యశ్ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో... కన్నడ సినీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం, అలాగే తమిళ ఇండస్ట్రీకి సంబంధించిన వారు చెబుతున్న దాని ప్రకారం యశ్ కొత్త సినిమా ప్రముఖ దర్శకుడు మిత్రన్ దర్శకత్వంలో ఉండబోతుందట. పి ఎస్ మిత్రన్ దర్శకత్వంలో యశ్ సినిమాకు సంబందించి ఏర్పాట్లు చకచక జరుగుతున్నాయట. అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు.



## ప్రభాస్ పుట్టినరోజున 'ఫౌజీ' టీజర్ రావడం లేదా

రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'ఫౌజీ' ఒకటి. 'సీతారామం' ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా సినిమా టీజర్ విడుదల కానుందంటూ ఇటీవల వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ ప్రచారంపై తాజాగా నిర్మాత మైత్రీ నవీన్ స్పష్టత ఇచ్చారు. ప్రభాస్ పుట్టినరోజున టీజర్ విడుదల చేయడం లేదని వెల్లడించారు. ప్రభాస్ పుట్టినరోజు అక్టోబర్ 23న కావడంతో 'ఫౌజీ' నుంచి ప్రత్యేక అప్‌డేట్ వస్తుందని అభిమానులు ఆశించారు. ఈ క్రమంలోనే చిత్ర టీజర్‌ను అదే రోజున విడుదల చేయనున్నట్లు వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే తాజాగా ఓ విలేకరి ఇదే విషయాన్ని నిర్మాత మైత్రీ నవీన్‌ను ప్రశ్నించగా, ఆయన ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు.ప్రభాస్ పుట్టినరోజున టీజర్‌ను విడుదల చేసే ప్రణాళిక లేదని ఆయన స్పష్టం చేసారు. అయితే అభిమానులను ఉత్సాహపరిచే మరో ఆసక్తికరమైన కంటెంట్‌ను అందించేందుకు చిత్రబృందం సిద్ధమవుతోందని తెలిపారు. దీంతో పుట్టినరోజు సందర్భంగా 'ఫౌజీ' నుంచి ఎలాంటి అప్‌డేట్ రాబోతోందనే ఆసక్తి పెరిగింది. అయితే ఆ ప్రత్యేక కంటెంట్ ఏమిటి? ఫస్ట్ లుక్ పోస్టరా, పాత్రకు సంబంధించిన పరిచయ వీడియోనా, మరేదైనా ప్రత్యేక ప్రకటననా? అనే విషయాలపై ఇప్పటివరకు స్పష్టత లేదు. చిత్రబృందం అధికారికంగా వెల్లడించే వరకు వేచి చూడాల్సిందే.

## రవితేజ - వివేక్ ఆత్రేయ సినిమాలో ఆ నటుడు దెయ్యం గా కనిపించ బోతున్నాడా?



మాస్ మహారాజా రవితేజ ఒకప్పుడు సంవత్సరానికి మూడు నాలుగు సినిమాలు చేసేవారు. గత కొంతకాలంగా ఆయనకి సరైన సక్సెస్ లు దక్కడం లేదు. ఎట్టకేలకు శివ నిర్వాణ డైరెక్షన్ లో తెరకెక్కిన 'ఇరుముడి' సినిమాతో భారీ కలెక్షన్స్ కొల్లగొట్టి గ్రాండ్ కంబ్యాక్ ఇచ్చాడు. ప్రస్తుతం వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో 'తులాభారం' అనే సినిమా చేస్తున్నాడు. రీసెంట్గా ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ అనౌన్స్మెంట్ వీడియో వచ్చేసింది. ఈ సినిమాలో రవితేజ తో పాటు ప్రియాంక అరుల్ మోహన్, అనస్వర రాజన్, తరుణ్ భాస్కర్, జేడీ చక్రవర్తి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వివేక్ ఆత్రేయ గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమా కూడా స్క్రీన్ ప్లే ప్రధానంగా సాగనుందట...

# ఖమ్మానికి ఆధ్యాత్మిక శోభను తీసుకురానున్న శ్రీవారి ఆలయం

**- కులమతాలకు అతీతంగా ధర్మమార్గంలో పయనించాలి : త్రిదండి చిన్నజీయర్ స్వామి**
**- ఖమ్మంలో టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఆలయానికి భూమిపూజ, శంకుస్థాపన**
**- ఆలయ నిర్మాణానికి మంత్రి తుమ్మల కృషి కీలకం: టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, అక్టోబర్ 12: ఖమ్మం ప్రాంతానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేలా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం శుభసూచకమని త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెం అల్లీపురంలో నిర్మించనున్న ఆలయానికి చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి భూమిపూజ, శంకుస్థాపన నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరగడం దైవ సంకల్పమని పేర్కొన్నారు. భగవంతుడిని స్మరించుకోవడం భారతీయ సంస్కృతిలో అంతర్భాగమని, ప్రజలందరూ స్వామివారి అనుగ్రహం పొందాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా అందరూ ధర్మమార్గంలో పయనించాలని, వసుదైక కుటుంబ భావనతో సమాజంలో ఐక్యత, సద్భావన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఆలయాలు పూజలకే పరిమితం కాకుండా ధర్మం, మానవత్వం, పరస్పర సహకారం, సమాజ శ్రేయస్సును ప్రోత్సహించే ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలవాలని అన్నారు. శ్రీవారి అలంకార సంప్రదాయాల వెనుక ఆధ్యాత్మిక భావనలు, భక్తుల విశ్వాసం ఉన్నాయని వివరించారు. భగవంతుని దృష్టిలో కులాలకు అతీతంగా భక్తి, మంచి మనసు, ధర్మబద్ధమైన జీవనానికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఖమ్మంలో నిర్మించనున్న ఆలయానికి ప్రతి భక్తుడు తమకు తోచిన విధంగా విరాళాలు అందించాలని, ఒక్క ఇటుక అందించినా నిర్మాణంలో భాగస్వామి అయినట్లేనని అన్నారు. టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నేతృత్వంలో ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఖమ్మంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి భూమిపూజలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన చిన్నజీయర్ స్వామికి, ఆలయ నిర్మాణానికి అనుమతి మంజూరు చేసిన టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడుకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఖమ్మంలోనూ శ్రీవారి ఆలయం త్వరలో పూర్తయి ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు మాట్లాడుతూ.. ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణం ప్రారంభం కావడానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి ప్రధాన కారణమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా టీటీడీ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం చేపడుతున్నామని, వచ్చే ఏడాదిలో ఐదు వేల ఆలయాలు నిర్మించాలనే ప్రణాళిక ఉందని తెలిపారు. తెలంగాణలో కొడంగల్ తర్వాత ఖమ్మంలో శ్రీవారి ఆలయానికి అనుమతి లభించిందని, కరీంనగర్‌లోనూ త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. టీటీడీ నిబంధనల ప్రకారం స్థానిక ఆలయ నిర్మాణానికి 25 శాతం నిధులను భక్తులు సమకూర్చాల్సి ఉంటుందని, ఖమ్మంలో సుమారు రూ.100 కోట్ల విలువైన భూమిని టీటీడీకి కేటాయించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. ఆలయ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ. శరత్ మాట్లాడుతూ.. ఖమ్మంలో టీటీడీ నమూనాలో శ్రీవారి ఆలయం నిర్మితం కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని అన్నారు. చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా భూమిపూజ జరగడం విశేషమని, భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఆలయ నిర్మాణానికి ఎంపీ బండి పార్థసారథి రెడ్డి రూ.60 లక్షలు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.50 లక్షలు, ఎమ్మెల్సీ తాతా మధు రూ.25 లక్షలు విరాళంగా ప్రకటించారు. కార్యక్రమానికి భోజన ఏర్పాట్లు చేసిన వ్యక్తి అదనంగా రూ.11 లక్షలు విరాళంగా అందించారు. దాతలకు మంత్రి కృతజ్ఞతలు తెలుపుతూ, భక్తులందరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి దయానంద్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎ. శరత్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ప్రజాప్రతినిధి రాయల నాగేశ్వరరావు, విద్యుత్, ఆర్ అండ్ బి, రెవెన్యూ, దేవాదాయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్ల ప్రధాన కూడళ్లలో వెలగని విద్యుత్ దీపాలు

**- మరమ్మత్తులు చేపట్టాలని కోరిన బిజేవైయం అధ్యక్షుడు దమ్మ సంతోష్ రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోరుట్ల, అక్టోబర్ 12 : కోరుట్ల పట్టణంలోని ప్రధాన కూడళ్లలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో, రాత్రి వేళల్లో చీకటి నెలకొని వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని బిజేవైయం పట్టణ అధ్యక్షుడు దమ్మ సంతోష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.., పట్టణంలో ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో, రాత్రి వేళల్లో చీకటి నెలకొని వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రద్దీగా ఉండే కూడళ్లలో తగిన వెలుతురు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాధనం వెచ్చించి మరమ్మతులు చేసినప్పటికీ, విద్యుత్ దీపాలు సక్రమంగా పనిచేయకపోవడానికి గల కారణాలను సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు. కేవలం మరమ్మతులు చేసి వదిలేయకుండా, హైమాస్ లైట్లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి పట్టణంలోని నంది చౌరస్తా, కార్గిల్ చౌరస్తా వద్ద హైమాస్ లైట్లను పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు మెరుగైన వెలుతురు, సురక్షితమైన రహదారి ప్రయాణం కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలి

**- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాలు.. దమ్మపేట మండల ప్రజావాణి ఆకస్మిక తనిఖీ**
**- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వనరులపై ప్రత్యేక పర్యవేక్షణ**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి - కొత్తగూడెం, అక్టోబర్ 12 : ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం దమ్మపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మండల ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజావాణికి హాజరైన వివిధ శాఖల అధికారుల వివరాలను తెలుసుకున్న కలెక్టర్, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సరఫరా, చెరువుల నీటి నిల్వలు, వ్యవసాయ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ అధికారులను తాగునీటి సరఫరా వివరాలు అడిగి తెలుసుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయంగా తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలంలోని 230 చెరువుల నీటి నిల్వల వివరాలను ఇరిగేషన్ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, చెరువుల్లో నీటి నిల్వల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. రైతు వేదికల్లో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమాలపై వ్యవసాయ శాఖ అధికారులను ఆరా తీశారు. కార్యక్రమాలకు హాజరవుతున్న రైతుల సంఖ్య, వారికి అందిస్తున్న సలహాలు, సూచనల గురించి తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే పరిస్థితులకు అనుగుణంగా రైతులకు అవసరమైన సూచనలు అందించాలని ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖల సంయుక్త సర్వేలు, భూ రీసర్వే పురోగతిపై కూడా కలెక్టర్ సమీక్షించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశిత విధానాల ప్రకారం సంయుక్త సర్వేలు నిర్వహించాలని, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. మండల ప్రజావాణికి ప్రజలు తక్కువ సంఖ్యలో హాజరవుతున్న అంశంపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రతి వారం ఎంతమంది దరఖాస్తుదారులు వస్తున్నారు, మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యల కోసం ప్రజలు జిల్లా కేంద్రంలోని ప్రజావాణికి ఎందుకు వెళ్తున్నారనే వివరాలను ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. మండల ప్రజావాణి కార్యక్రమంపై గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, యువత సహకారంతో సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను మండల స్థాయిలోనే అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని, ప్రతి దరఖాస్తును పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో దమ్మపేట తహసీల్దార్ మురళి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సింగరేణి కార్మిక ఘర్జన సభకు భారీగా తరలిరావాలి

**- టీబీజీకేఎస్ నాయకులు బడితల సమ్మయ్య, బాసనపల్లి కుమార్ పిలుపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, అక్టోబర్ 12 : ఈ నెల 14న బుధవారం గోదావరిఖనిలో నిర్వహించనున్న సింగరేణి కార్మిక ఘర్జన మహా బహిరంగ సభను విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ నాయకులు బడితల సమ్మయ్య, కేటీకే 6వ గని ఇన్‌చార్జి బాసన్‌పల్లి కుమార్ కార్మికులకు పిలుపునిచ్చారు. సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. సోమవారం స్థానిక కేటికె.6 గనిలో కార్మికులతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బడితల సమ్మయ్య మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాట భేరి మోగించేందుకు నిర్వహిస్తున్న ఈ మహా బహిరంగ సభకు కార్మికులు కుటుంబ సమేతంగా భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. బాసనపల్లి కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మిక వర్గానికి నష్టం జరుగుతోందని విమర్శించారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగాల భద్రతపై సభలో కేటీఆర్ దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కార్మికులకు రావాల్సిన ప్రయోజనాలను ముందుగానే ప్రకటించి, చెల్లింపులపై స్పష్టత ఇచ్చేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితులు అధ్వానంగా మారాయని విమర్శిస్తూ, సింగరేణి సంస్థను, కార్మికుల ప్రయోజనాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్మికుల కోసం బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెల 14న మధ్యాహ్నం 3.30 గంటలకు బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. కార్మికులందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సభకు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ రవితేజ, రాంలాల్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు

# సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

**- తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత.. ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, అక్టోబర్ 12 : సూపర్ ఎల్‌నినో ప్రభావం, మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, తాగునీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ములకలపల్లి మండలం జగన్నాథపురం రైతు వేదిక నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి 2026--27 యాసంగి సాగుపై నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో భూగర్భ జలమట్టాలు సుమారు రెండు మీటర్ల మేర తగ్గిన నేపథ్యంలో రాబోయే వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లోని పాత తాగునీటి పథకాలు, బోరుబావులు, ఇతర నీటి వనరులను ముందుగానే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఎంపీడీవోలు, ఎంపీవోలను ఆదేశించారు. తాత్కాలిక చర్యలకే పరిమితం కాకుండా 2027 జూన్ వరకు తాగునీటి అవసరాలను అంచనా వేసి, అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. గత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, విస్తరణ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో రైతులకు పప్పుధాన్యాలు, పెసలు, కందులు, మిరప వంటి పంటల సాగుపై అవగాహన కల్పించారని తెలిపారు. ఈసారి కూడా రైతు వేదికల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంచుకునేలా రైతులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. గత రబీతో పోలిస్తే ఈసారి జిల్లాలో వరి సాగు విస్తీర్ణాన్ని సుమారు 50 వేల ఎకరాల మేర తగ్గించినట్లు వెల్లడించారు. ఆ విస్తీర్ణంలో మినుములు, పెసలు, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాల్లో విస్తృతంగా సాగవుతున్న ఆయిల్‌పామ్‌ను ఇతర అనుకూల మండలాల్లోనూ ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. ములకలపల్లి, చంద్రుగొండ తదితర మండలాల్లో నేల స్వభావం, నీటి లభ్యత ఆధారంగా ఆయిల్‌పామ్ సాగు అవకాశాలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వీబీ-జి రామ్ జి పథకం కింద ప్రతి గ్రామంలో కనీసం 20కి పైగా పనులను గుర్తించి జాబితా సిద్ధం చేయాలని సూచించారు. వ్యవసాయానికి ఉపయోగపడే ఫామ్ పాండ్ల నిర్మాణం చేపట్టి వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు, అనుకూల పరిస్థితుల్లో చేపల పెంపకం వంటి అనుబంధ ఉపాధి అవకాశాలను వినియోగించుకోవచ్చని తెలిపారు. పశువులకు తాగునీరు, మేత కొరత ఏర్పడకుండా సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఉపాధి హామీ పనులు, పశుసంరక్షణ అంశాల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అంకిత్ సూచించారు. నీటి లభ్యత, సాగు వ్యయాలు, పంటల ద్వారా వచ్చే ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని రైతులు తగిన సాగు ప్రణాళిక రూపొందించుకునేలా అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఓ సునీత, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, మార్కెటింగ్ అధికారి అలీమ్ ఖాన్, భూగర్భ జలవనరుల శాఖ అధికారి రమేష్, తహసీల్దార్ స్వాతి బిందు, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు, రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పించండి.. పని దినాలు పెంచండి : బీకేఎంయూ వినతి

**- ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ పనులకు దూరమైన కూలీలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




ఖమ్మం, అక్టోబర్ 12 : వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ పనులు లేక గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు ఉపాధి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ తెలిపారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం సమర్పించి, ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించి పని దినాలను పెంచాలని కోరారు. ఖమ్మం జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, తక్కువ వర్షపాతం నమోదైన జిల్లాల్లో ఖమ్మం కూడా ఉందని వారు పేర్కొన్నారు. వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు ఉపాధి కోసం ఆటోల్లో 30 నుంచి 60 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందన్నారు. దూర ప్రాంతాలకు పనుల కోసం వెళ్లే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఇటీవల ఖమ్మం రూరల్ మండలానికి చెందిన ఓ మహిళా కూలీ ఆటో ప్రమాదంలో మృతిచెందగా, పలువురు గాయపడ్డారని తెలిపారు. ప్రస్తుతం నర్సరీల్లో మాత్రమే ఉపాధి పనులు చేపడుతున్నారని, మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పనులను గుర్తించి కూలీలకు ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వీబీ-జీ రామ్‌జీ పథకం పనులను తక్షణమే ప్రారంభించి, పని దినాలను 200కు పెంచాలని, కనీస కూలీ రోజుకు రూ.600 గిట్టుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపై స్పందించిన అదనపు కలెక్టర్ శ్రీజ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, కూలీలకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్‌తో పాటు నాయకులు మేళ్లచెరువు వీరబాబు, పిట్టల రాంబాబు, గోగుల ఆదినారాయణ పాల్గొన్నారు.

# బస్వాపురం భూనిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

**- 97 మంది పేద రైతులకు న్యాయం చేయాలి**
**- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహా**
**- ఏళ్లు గడుస్తున్నా పరిహారం ఏదీ? అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**
**- న్యాయం జరగకపోతే ప్రాజెక్టు పనులను అడ్డుకుంటాం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 12 : బస్వాపురం ప్రాజెక్టు (నృసింహసాగర్ రిజర్వాయర్) నిర్మాణం కోసం భూములు కోల్పోయిన 97 మంది పేద రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా బాధిత రైతులకు పరిహారం అందకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నిర్వాసిత రైతులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. భువనగిరి మండలం బస్వాపురం గ్రామ పరిధిలోని సర్వేనంబరు 229లోఉన్న 110 ఎకరాల 24 గుంటల ప్రభుత్వ భూమిని ప్రాజెక్టు నిర్మాణం కోసం సేకరించారని తెలిపారు. ఈ భూములను తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న 97 మంది పేద రైతులు ప్రాజెక్టు కారణంగా ఉపాధి కోల్పోయారని పేర్కొన్నారు. భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు నష్టపరిహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైఉందన్నారు. గతంలోఅప్పటి జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, భూములను



సాగు చేస్తున్న 97 మంది రైతులు నష్టపరిహారానికి అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు నివేదికలు రూపొందించినప్పటికీ ఏళ్లు గడుస్తున్నా పరిహారం అందకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యపై జిల్లా యంత్రాంగం ఎందుకు స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాయగిరి రెవెన్యూ పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామ సర్వే నంబరు 259లోని ప్రభుత్వ భూమి నుంచి ప్రాజెక్టు కాలువ నిర్మాణం చేపట్టినప్పుడు, అక్కడ సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించిందని గుర్తుచేశారు. అదే జీవో ప్రకారం బస్వాపురం బాధిత రైతులకు కూడా నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, ఆర్డీఓ, తహశీల్దార్ స్థాయి అధికారులు దరఖాస్తులు స్వీకరించడానికే పరిమితం కాకుండా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి అర్హులైన రైతులకు నష్టపరిహారం విడుదల చేయాలని నర్సింహ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిర్వాసిత రైతులతో కలిసి బస్వాపురం ప్రాజెక్టు పనులను అడ్డుకుంటామని, ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కమిటీ సభ్యుడు మద్యపురం బాల్ నర్సింహ, సీపీఎం నాయకుడు దయ్యాల మల్లేష్‌తో పాటు నిర్వాసిత రైతులు ఉడత విష్ణు, మచ్చ వెంకట్ నర్సయ్య, ఏనబోయిన విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# టీబీ బాధితులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

**- క్రమం తప్పకుండా మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకోవాలి**
**- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, అక్టోబర్ 12: క్షయవ్యాధి (టీబీ) బాధితులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టీబీ బాధితులకు ఆయన న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. టీబీ బాధితులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, వ్యాధి నుంచి త్వరగా కోలుకునేందుకు న్యూట్రిషన్ కిట్లు దోహదపడతాయని కలెక్టర్ తెలిపారు. బాధితులు చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా నిర్ణీత కాలం పాటు పూర్తిచేయాలని, ఆరోగ్య సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు.

ప్రజాలక్ష్యం

మంగళవారం 13 అక్టోబర్ 2026

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులకు కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్ – భూపాలపల్లి, అక్టోబర్ 12 : జిల్లాలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ వేర్వేరుగా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన 'ప్రజావాణి'లో కలెక్టర్ 67 అర్జీలు స్వీకరించారు. సమస్యలను వారం లోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజాదివస్'లో ఎస్పీ సంకీర్త్ 12 ఫిర్యాదులను స్వీకరించి, ఆయా స్టేషన్ల సీఐ, ఎస్ఐలతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలకు ఆదేశించారు. బాధితులకు పారదర్శకంగా, వేగంగా న్యాయం అందిస్తామని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు.



## భూపాలపల్లిలో క్వార్టర్ కౌన్సెలింగ్

**- 101 ఖాళీ క్వార్టర్లకు 710 మంది దరఖాస్తు..**

**- 95 మందికి అలాట్ మెంట్.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ – భూపాలపల్లి, అక్టోబర్ 12 : సింగరేణి భూపాలపల్లి ఏరియా ఉద్యోగులకు సోమవారం స్థానిక మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఏరియా అధికార ప్రతినిధి, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యామ్ సుందర్ తెలిపారు. సుభాష్ కాలనీలోని టీ2, ఎండీ క్వార్టర్లు, 1000 క్వార్టర్లు, రామప్ప క్వార్టర్ కాలనీల్లో ఖాళీగా ఉన్న 101 క్వార్టర్ల కోసం 710 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిని కౌన్సెలింగ్‌కు ఆహ్వానించగా, 95 మంది తమకు నచ్చిన క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారని శ్యామ్ సుందర్ వెల్లడించారు. ఇంకా ఆరు క్వార్టర్లు మిగిలి ఉన్నా యని తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్వోటు జీఎం రామన్ వి. పాఠక్, ఏజీఎం (సివిల్) రవికుమార్, సీనియర్ పీఓ సాయికృష్ణ, సీనియర్ అసిస్టెంట్లు ఎం.రవి, శివ, ఏ.ప్రణయ్ సాగర్, ఏఐటీయూసీ నాయకుడు మోటపలుకుల రమేశ్, ఐఎన్టీయూసీ నాయకుడు బి. మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో పర్యటించిన నాయకులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, అక్టోబర్12 : తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం (టిఆర్ పిఎస్)భవన నిర్మాణ కమిటీ ఛైర్మెన్ బోగ వెంకటేశ్వర్లను సోమవారం రోజు రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజకుమార్ వారి బృందం కలిసి పలు సమస్యలపై,సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వరకట్ రాజ్ కుమార్,ఉపాధ్యక్షులు మేకల జయరాములు, వనమాల శంకర్, తదితరులు పాల్గొని పద్మశాలి సంఘాన్ని మరింత బలోపేతం చేయటానికి,కొన్ని సమస్యలను పరిష్కరించటానికి జిల్లా వ్యాప్తంగా బస్సు యాత్ర చేపడుతున్నట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు.



## విజయ దశమి ఉత్సవాలకు విరాళం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కల్వకుర్తి, అక్టోబర్12 :విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని కల్వకుర్తిని కాషాయంగా మార్చాలని సోమవారం బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు, 14వ వార్డు కౌన్సిలర్ బావండ్ల మంజుల మధు కాషాయ జెండాలకుగాను రూ. 25,016 లను విరాళంగా హిందూ ఐక్యవేదిక సభ్యులకు అందజేశారు. భారతీయ సంప్రదాయంలో కాషాయానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉందన్నారు. కాషాయ రంగు ధైర్యం, త్యాగం, ఆధ్యాత్మికత, ధర్మానికి ప్రతీకగా భావిస్తారన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా భక్తి భావాన్ని పెంచాలని ఉద్దేశంతోఈవిరాళాన్ని అందజేశామని వారన్నారు. విరాళాన్ని ఇచ్చినందుకు హిందూ ఐక్యవేదిక సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మురళీధర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, వీరెడ్డి మధు, మహేష్ రెడ్డి, రాఘవేందర్, శ్రీను, దామర్ల శేఖర్ ఉన్నారు.



## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, అక్టోబర్ 12 : ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో సంభవించే మార్పులు,వర్షపాత పరిస్థితులు, వ్యవసా యంపై వాటి ప్రభావాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు సోమవారం మహబూబాబాద్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దృశ్య శ్రవణ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళికలు రూపొందించుకోవడం, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం, ప్రత్యామ్నాయ పద్ధతులు అనుసరించడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూదనరాజు, మండల వ్యవసాయ అధికారి తిరుపతిరెడ్డి, ఎంపీడీవో రామ్మోహన్ రెడ్డి, తహసీల్దార్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ పాల్గొన్నలో సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సిరిసిల్ల, అక్టోబర్ 12 : సిరిసిల్ల పట్టణంలోని 11వ వార్డు ముష్టి పెల్లికి చెందిన దాసరి అరుణ,వేముల సత్తవ్వ యొక్క వారి రెండు ఇందిరమ్మ ఇల్లు భూమి పూజను పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు చేతుల మీదుగా భూమి పూజ చేశారు తర్వాత వారు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో పట్టణ కేంద్రంలో గ్రామాలలో ఇండ్లు లేని వారు ఉండకూడదని ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తుందని వారి గౌరవాన్ని కాపాడుతుందని ఈ సందర్భంగా తెలిపారు వేల సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, దసరా వరకు రెండో విడత మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు వస్తాయని,నిరుపేదలకు ప్రజలకు గూడు నీడ కల్పించా లన్నది ప్రభుత్వ ప్రభు త్వ లక్ష్యమని, ప్రజల ఆశను నెరవేరుస్తున్నది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు వరకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజల కళ్ళల్లో ఆనందాన్ని చూస్తుంది. ఇందిరమ్మ ఇళ్లతో పాటు బడుగు బలహీన వర్గాలకు పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అందిస్తూ వారికి బాసడగా నిలుస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వంతడుపుల రాము వార్డు అధ్యక్షులు వంగరి అనిల్ ఆకని సతీష్ ఆడెపు పల్లపు శ్రీను ప్రసాద్ కాంగ్రెస్ నాయకులు ఏండి. కలీం కొండ ప్రకాష్ మ్యాన పద్మనాభం సత్యనారాయణ సృజన్ మరియు తదిత రులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ సైక్లింగ్ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్ సర్టిఫికెట్స్ అందజేత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మక్తల్, అక్టోబర్ 12 : తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ సెక్రెటరీ ఆదేశాల మేరకు ,నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో ఈ నెల 10న మక్తల్ ఎల్లమ్మ కుంట కొత్త గార్లపల్లి రోడ్డులో నిర్వహించిన, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ 5 కి.మీ రోడ్డు స్పీడ్ సైకిల్ పోటీలలో 126 మంది బాల బాలికలు పాల్గొని, క్రీడా ప్రతిభను చాటిన సైకిల్ రైడర్స్ కు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్ సొంత ఖర్చులతో అందజేసినట్లు జిల్లా కార్యదర్శి బి.గోపాలం, చైర్మన్ డాక్టర్ మణికంఠ గౌడ్ తెలిపారు. రాష్ట్రస్తాయి స్కూల్ గేమ్స్ సైకిలింగ్ పోటీలకు ఎంపికైన 23 మంది బాలబాలికలు14 సంవత్సరాల లోపు వారు కే.అవంతి, సి.నవ్యశ్రీ, సి.లతిక, మోక్షిత్, బుచ్చిబాబు, సాయి ప్రశాంత్, 17 సంవత్సరాల లోపు కే. నందిని, కే.అవంతిక, సి. జ్యోతి, కోవెల వెల్లి, కే.నిహారిక, జి. శ్రీనివాస్, బి.అర్జున్, ఎం.నరేష్, 19 సంవత్సరాల లోపు టి. శిరీష, ఎం.అక్షయ రెడ్డి, లతా కుమారి, అలాగే వికారాబాద్ జిల్లా నుండి నందిని భాయ్, కీర్తన రెడ్డి , స్వాతి, శ్రావణి, వరలక్ష్మి వీరుఈ నెల చివరి వారంలో సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలోజరుగు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సైకిల్ పోటీలలో పాల్గొంటారని బి.గోపాలం తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మణికంఠ గౌడ్, వెంకటేష్ శెట్టి, శ్రీనివాస్ రెడ్డి, అడ్వకేట్ సూర్య ప్రకాష్, శివ ప్రసాద్, అమ్రేష్, దామోదర్, రేణుక, స్వప్న, త్రివేణి ,శ్రీనివాసులు పాల్గొన్నారు. వీరిని బి.గోపాలం ఘనంగా సన్మానించి అభినందించారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ స్నేహ శబరిష్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, అక్టోబర్ 12 : ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ పురుషోత్తం,రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, డీఆర్ఓ నాగలక్ష్మితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గుమ్ముదూరుకు చెందిన అవారి నిర్మల తన ఎకరం 19 గుంటల పట్టా భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, బలపాలకు చెందిన దేసంగి మహాలక్ష్మి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. కేసముద్రం మండలం పెనుగొండకు చెందిన పురుషోత్తం రెడ్డి రోడ్డు విస్తరణలో తన స్థలాన్ని అధికారులు ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రజావాణిలో జిల్లా కేంద్రంలో 119, డివిజనల్ కేంద్రంలో 3, మండలాల్లో 81 కలిపి మొత్తం 203 దరఖాస్తులు అందాయి. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ మధుసూధనరాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, డీఎంహెచ్ఓ రవిరాథోడ్, పశు సంవర్ధక శాఖ అధికారి కిరణ్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీరాం, ఇన్‌ఛార్జ్ డీఈఓ మందుల శ్రీరాములు, జిల్లా పంచాయతీ అధికారి రేవంత్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మాగనూరు మండల అధ్యక్షుడు జయానంద్ రెడ్డిపై ఫిర్యాదు

**- షోకాజ్ నోటీసు ఇవ్వకుండా పదవి నుంచి తొలగించడంపై అశోక్ గౌడ్ అభ్యంతరం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మక్తల్, అక్టోబర్ 12 : నారాయణపేట జిల్లా మాగనూరు మండల బీజేపీ అధ్యక్షుడు జయానంద్ రెడ్డి వ్యవహారశైలిపై భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్‌కు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ మాగనూరు మండల ప్రధాన కార్యదర్శి అశోక్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీకి నిబద్ధతతో పనిచేస్తున్న తనను మండల ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారని తెలిపారు. అయితే, తనకు ఎలాంటి షోకాజ్ నోటీసు ఇవ్వకుండా, తన వివరణ తీసుకోకుండా పదవి నుంచి తొలగించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు తగిన గౌరవం ఇవ్వాలని, పార్టీ నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. మండల అధ్యక్షుడుజయానంద్ రెడ్డి సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలను కలుపుకొని పోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి నిర్ణయాల వల్ల పార్టీలో అసంతృప్తి పెరిగి, పార్టీకి నష్టం కలిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో క్రమశిక్షణ, ఐక్యత, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఉండాలని ఆయన అన్నారు. పార్టీ బలోపేతం కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండల అధ్యక్షుడు జయానంద్ రెడ్డి వ్యవహారశైలిపై విచారణ జరిపి, పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలని, పార్టీ బాధ్యతల నుంచి తొలగించే విషయాన్ని పరిశీలించాలని జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్‌ను కోరినట్లు అశోక్ గౌడ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ విద్యాసాగర్ మాజీ మండల అధ్యక్షుడు జి నారాయణ బిజెపి సీనియర్ నాయకులు మురళీధర్ గౌడ్ కౌన్సిలర్ బీజేవైఎం నాయకులు భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



## పత్తిపాకలో రూ.64 లక్షలతో సీసీ రోడ్ల పనులు ప్రారంభం!

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, అక్టోబర్ 12 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మహబూబాబాద్ పట్టణంలోని 20వ వార్డు పత్తిపాక బజారులో రూ.64 లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్, మున్సిపల్ కమిషనర్ ఎం. వినోద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ జ్యోతి మాట్లాడుతూ, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ సహకారంతో వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని,ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న స్థానిక నాయకుడు ధరావత్ హాతిరాం నాయక్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ధరావత్ హాతిరాం నాయక్, 8వ వార్డు కౌన్సిలర్ బానోత్ భాస్కర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్, డీఈ ఉపేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తాళ్లపెల్లి అజయ్, కృష్ణ, శ్యామ్, తిరుమలేష్, సీపీఎం నాయకులు లాలయ్య, మహేందర్, రాజు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అరోరా యూనివర్సిటీ వార్డెన్, మెస్ ఇన్‌చార్జిని సస్పెండ్ చేయాలి

**- విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి - ఉన్నత విద్యాధికారులతో నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలి**

**- ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




యాదాద్రి భువనగిరి, అక్టోబరు 12 : భువనగిరి పట్టణంలోని అరోరా యూనివర్సిటీలో విద్యార్థులను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలపై హాస్టల్ వార్డెన్, మెస్ ఇన్‌చార్జ్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఉప్పుల శాంతికుమార్, పేరబోయిన మహేందర్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నిరసనగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేట్ విద్యాసంస్థల పేరుతో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ, వారికి తగిన భద్రత కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని నాయకులు ఆరోపించారు. అరోరా యూనివర్సిటీలో చోటుచేసుకున్నట్లు చెబుతున్న ఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యాశాఖ అధికారులతో నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కందుల మధు, జిల్లా కార్యవర్గ సభ్యులు సూరారం జానీ, సుద్దాల సాయికుమార్, నాయకులు నందు, ప్రణయ్, శ్యాగా జాను, కంబాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల్లో గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన వనదుర్గామాత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, అక్టోబర్ 12 : తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన శ్రీ ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో రెండవ రోజైన సోమవారం రోజు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారిని నవరాత్రుల ప్రత్యేక పూజారులు గాయత్రీదేవి అవతారంలో (గులాబీ వర్ణం) రంగులో అత్యంత సుందరంగా ముస్తాబు చేసి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా కర్ణాటక, మహారాష్ట్ర, హైద్రాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక మంటపంలో ఏర్పాటు చేసిన అమ్మవారినీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజారులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి,సాయిబాబా, నరేష్, మహేష్, యాదగిరి, దీపక్ రెడ్డి, బలరాం తదితరులు పాల్గొన్నారు. నవ రాత్రుల సందర్భంగా ఏడుపాయల్లో భక్తులకు అన్న ప్రసాదం కల్పించారు. ఏడుపాయల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా పాపన్నపేట ఎస్ఐ సారా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



## బతుకమ్మ పాట షూటింగ్ ప్రారంభించిన వాకిటి లలిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మక్తల్, అక్టోబర్ 12 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మక్తల్ పట్టణానికి చెందిన జెమిని రవి, సురేందర్, రాజు, కుర్వ శంకర్ ల ఆధ్వర్యంలో మక్తల్ పరిసర ప్రాంతంలో రూపొందిస్తున్న బతుకమ్మ పాట షూటింగ్‌ను వాకిటి లలిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతితో ముడిపడిన మన సంప్రదాయా లకు ప్రతీక అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయా లను ప్రతిబింబించే బతుకమ్మ పాటలను రూపొందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా తెలంగాణ పండుగల విశిష్టతను, సంస్కృతి గొప్పతనాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని లలిత తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్ కుమార్ గుప్తా, గణేష్ కుమార్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు

## ప్రజావాణికి 89 ఫిర్యాదులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిజామాబాద్, అక్టోబర్ 12 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 89 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు రాజా గౌడ్, వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, జిల్లా పరిషత్ సీఈఓ సాయా గౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా,ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రెండేళ్లలో 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

**- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి**

**- ఓటరు నమోదు సదస్సులో బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నడిగూడెం, అక్టోబర్ 12 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని, నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఉద్యోగాల హామీ ఏమైందో ప్రజలకు సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ప్రశ్నించారు. వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యం లో నడిగూడెం మండలం తెల్లబల్లిలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ నాయకులు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. గ్రామా లు, మండలాల వారీగా సమన్వయకర్తలను నియమించి, ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్యులు, న్యాయవాదులు, బ్యాంకు ఉద్యోగులు, డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు నిండిన అర్హులైన పట్టభద్రు లను సంప్రదించాలని కోరారు. గతంలో ఓటరుగా నమోదైన వారు కూడా ప్రస్తుత ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించాలని అన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి అర్హులు మిగిలిపోకుండా నాయకులు పర్యవేక్షిం చాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులు, యువత, ఉద్యోగులకు ఇచ్చినహామీలనుఅమలు చేయడంలో విఫలమైందని మల్లయ్య యాదవ్ విమర్శించారు. ఈ అంశాలను పట్టభద్రుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు,గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయమేలక్ష్యంగాప్రతినాయకుడు,కార్యకర్త సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఓటరునమోదు నుంచి ఎన్నికల వరకు బాధ్యతాయుతంగా వ్యవహరించి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

# ప్రజావాణిలో ఫిర్యాదుదారుల సమస్యలు విన్న ఎస్పీ డా.జి.జానకి షర్మిల



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, అక్టోబర్ 12 : ఫిర్యాదులపై తక్షణ స్పందన.. చట్టపరంగా పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను క్షుణ్ణంగా విన్న ఎస్పీ, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఫిర్యాదులను చట్టపరంగా పరిశీలించి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందే ప్రతి ఫిర్యాదును బాధ్యతతో స్వీకరించి, దాని పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసు శాఖ దృష్టికి తీసుకువచ్చేలా ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందిస్తూ పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, పేర్కొన్నారు.

# దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కలిసిన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పాటిల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, అక్టోబర్ 12 : సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లాలోని బాసర రైల్వే స్టేషన్‌లో రైల్వే గూడ్స్ రేక్ పాయింట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సదుపాయం అందుబాటులోకి వస్తే రైతులు, వ్యాపారులు, స్థానిక ప్రజలకు సరుకు రవాణాలో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. బాసర రైల్వే స్టేషన్‌లో ఇప్పటికే అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను వినియోగించుకుంటూ,



అవసరమైన గూడ్స్ సైడింగ్, సరుకుల లోడింగ్–అన్‌లోడింగ్ సదుపాయాల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జనరల్ మేనేజర్‌ను ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ విన్నపంపై జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సానుకూలంగా స్పందించారు. ఈ ప్రతిపాదనపై సంబంధిత అధికారుల నుంచి నివేదిక తెప్పించు కొని, సాధ్యాసాధ్యాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రైతు వేదికల వద్దకు రావాలంటూ రైతులతో ఆటలా?

మొదటి పేజీ తరువాయి

చేరుకోవాలని, ముఖ్యమంత్రి, మంత్రులు వారితో మాట్లాడి వ్యవసాయానికి సంబంధించిన సూచనలు చేస్తారని వ్యవసాయ కమిషనర్ పేరుతో నోట్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ అధికారులు ఎమ్మెల్యేలకు కూడా వాట్సాప్ సందేశాల ద్వారా తెలియజేశారని హరీశ్‌రావు వెల్లడించారు. మధ్యాహ్నం 12 గంటలకు ముఖ్యమంత్రి రాష్ట్రంలోని రైతులందరినీ ఉద్దేశించి రైతు వేదికల నుంచి మాట్లాడతారని సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఉదయం 9.52 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ రద్దయినట్లు సందేశం పంపారని, అనంతరం 11.15 గంటలకు సమావేశం ఉంటుందని, 11.30 గంటలకు ప్రారంభమవుతుందని మరోసారి సమాచారం ఇచ్చారని వివరించారు. ఆ తర్వాత మధ్యాహ్నం ఒంటి గంటకు ముఖ్యమంత్రి బదులుగా ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి హాజరవుతారని చెప్పినట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇలా పదేపదే సమయాలు, పాల్గొనే వారి వివరాలు మార్చడం ద్వారా రైతులను అయోమయానికి గురిచేశారని విమర్శించారు. రైతులు సమస్యలతో సతమతమవుతున్న సమయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## చిన్నారి హత్య నిందితుడిని అప్పగించాలని బంధువుల ఆందోళన

మొదటి పేజీ తరువాయి

గాలించారు. ఈ క్రమంలో రాత్రి సుమారు 11 గంటల సమయంలో చిన్నారి తాతకు ఓ వ్యక్తి ఫోన్ చేసి, పాపను విడిచిపెట్టాలంటే రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అయితే, నిందితుడు చిన్నారిని హత్య చేసి నీటి సంపులో పడేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో బిహార్‌కు చెందిన విక్రమ్ అనే వ్యక్తిని నిందితుడిగా పోలీసులు గుర్తించారు. అతడు గతంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసినట్లు సమాచారం. ఉద్యోగం నుంచి తొలగించిన కొద్ది రోజులకే చిన్నారిని కిడ్నాప్ చేసేందుకు పథకం వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఉక్రెయిన్ యుద్ధంలో మృతిచెందిన తెలంగాణ వాసి కుటుంబానికి సాయం

మొదటి పేజీ తరువాయి

బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సుదర్శన్ గౌడ్ భార్య చేసిన విజ్ఞప్తి మేరకు ఈ విషయాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన సీఎం బాధిత కుటుంబానికి రూ.6 లక్షల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సాయం అందించేందుకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సుదర్శన్ గౌడ్ భౌతికకాయాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కూడా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## బాధ్యతాయుతంగా పోరాడటం

మొదటి పేజీ తరువాయి

రాజేందర్ సూచించారు. ఆరోపణలు చేయడం మాత్రమే కాకుండా, వాటిని నిరూపించేందుకు తగిన ఆధారాలను అధికారుల ముందు ఉంచాలని అన్నారు. బిహార్‌లో ఓట్ల చోరీ జరిగిందని ఇండియా కూటమి నేతలు ఆరోపించారని ప్రస్తావించిన ఈటల రాజేందర్.. ఆ ఎన్నికల ఫలితాల నుంచి ప్రతిపక్షాలు గుణపాఠం నేర్చుకోవాలని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో, బాధ్యతాయుతంగా పోరాటం చేయడం నేర్చుకోవాలని ఇండియా కూటమి నేతలకు సూచించారు.

## సైనికుల రేషన్‌లో ‘భారత్ రైస్’...

మొదటి పేజీ తరువాయి

కేంద్రాల నుంచి ఆర్మీ డిపోలు సేకరించాల్సిన అవసరం లేకుండా, లడఖ్, ఈశాన్య ప్రాంతాలతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఆర్మీ సరఫరా డిపోలకు నేరుగా పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదలైంది. 2026–27 ఆర్థిక సంవత్సరంలో రక్షణ శాఖ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా బియ్యాన్ని మిల్లింగ్ చేసి, నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్) ద్వారా సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ విధానం ద్వారా సైనికులకు నాణ్యమైన బియ్యాన్ని అందించడంతోపాటు సరఫరా వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

# నిరుద్యోగులకు ‘పొంగులేటి శీనన్న యువనేస్తం’..

మొదటి పేజీ తరువాయి

ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండా ఇంటి వద్దే చదువుకుంటున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని యువతకు ఆర్థిక భారం లేకుండా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ‘పొంగులేటి శీనన్న యువనేస్తం’ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితుల కారణంగా వెనుకబడిపోకూడదనే లక్ష్యంతో ఈ చొరవ తీసుకున్నట్లు తెలిపాయి. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణతో పాటు వివిధ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడేలా శిక్షణ అందించనున్నారు. ప్రధానంగా గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4 పరీక్షలతోపాటు.. పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై), కానిస్టేబుల్ నియామక పరీక్షలు.. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన ఉద్యోగ పరీక్షలు.. ఫారెస్ట్ శాఖ నియామక పరీక్షలు.. రైల్వే ఉద్యోగ పరీక్షలు.. బ్యాంకింగ్ పోటీ పరీక్షలు.. డీఎస్సీ ఉపాధ్యాయ నియామక పరీక్షలను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ కోచింగ్ ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో సబ్జెక్టుల వారీగా డిజిటల్ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఏడాది పాటు కోచింగ్‌తోపాటు పరీక్షల సన్నద్ధతకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పొంగులేటి స్వరాజ్యం–రాఘవరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ (పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్) ఆధ్వర్యంలో ప్రముఖ కోచింగ్ సంస్థ ఆర్‌సీ ఎగ్జామ్స్ భాగస్వామ్యంతో ఈ ‘పొంగులేటి శీనన్న యువనేస్తం’ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణ కోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ విధానం, అర్హతలు, కోచింగ్ ప్రారంభ తేదీలు, తరగతులను వీక్షించే విధానం వంటి వివరాలను అధికారిక పోర్టల్‌లో పరిశీలించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను తెలుసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇందుకోసం అధికారిక వెబ్‌సైట్ (https://psryuvanestham.in)ను సందర్శించి అందులో సూచించిన విధంగా వ్యక్తిగత వివరాలను నమోదు చేయాలని తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు ముందు అర్హతలు, అవసరమైన పత్రాలు, శిక్షణకు సంబంధించిన షరతులను జాగ్రత్తగా చదవాలని.. ఉచిత కోచింగ్ పేరుతో ఎవరైనా అనధికారికంగా డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే సరైన ప్రణాళిక, క్రమబద్ధమైన చదువు, నిరంతర సాధన, నాణ్యమైన మార్గదర్శకత్వం అవసరం. ఏడాది పాటు ఆన్‌లైన్ శిక్షణ అందుబాటులోకి వస్తే కోచింగ్ ఖర్చులను భరించలేని అభ్యర్థులకు కొంతమేర ఉపశమనం కలిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇంటి వద్ద నుంచే డిజిటల్ తరగతులు వినియోగించుకునే వీలు ఉంటే గ్రామీణ ప్రాంతాల యువతకూ ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ‘పొంగులేటి శీనన్న యువనేస్తం’ ద్వారా అందించే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో సాధన చేస్తే తమ ఉద్యోగ లక్ష్యాల దిశగా ముందుకు సాగేందుకు అవకాశం ఉంటుందని విద్యా నిపుణులు చెబుతున్నారు.

# ఢిల్లీని విడిచి వెళ్లొద్దు..

మొదటి పేజీ తరువాయి

చేస్తూ, ఆయన రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ నిరసనలు మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉండటంతో తెలంగాణ నుంచి ఢిల్లీకి వెళ్లిన నాయకులు అక్కడే ఉండాలని ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు సూచించారు. మరోవైపు.. ఇండియా కూటమి ర్యాలీ సందర్భంగా సోమవారం రోజున ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులను పోలీసులు అడ్డుకునే క్రమంలో లాఠీఛార్జ్, తొక్కిసలాట చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో కొందరు నాయకులు కిందపడటంతో వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు కూడా ఈ ఘటనలో గాయపడ్డారు. ఈ పరిణామాల నేపథ్యంలో నిరసనల్లో పాల్గొంటున్న రాష్ట్ర నాయకుల భద్రత, వారి అందుబాటు అంశాలపై కాంగ్రెస్ పార్టీ నాయకత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇక.. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు వేదికగా చేసుకున్నారు. గతంలో ఓటు హక్కును విస్తరించేందుకు ఉపయోగించిన ఎస్ఐఆర్ ప్రక్రియను ఇప్పుడు ఓట్ల తొలగింపునకు ఉపయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను లక్ష్యంగా చేసుకుంటున్నారంటూ విమర్శలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం గతంలో సీబీఐ, ఈడీ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుందని.. ఇప్పుడు ఎన్నికల సంఘం ద్వారా ప్రతిపక్షాలను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం జరుగుతోందని రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఎన్నికల సంఘం నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలని.. ఓటర్ల జాబితాల్లో మార్పులు ఎందుకు జరుగుతున్నాయనే అంశంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. స్వాతంత్ర్య పోరాటం, రాజ్యాంగ నిర్మాణం ద్వారా ప్రజలకు లభించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వ్యాఖ్యానించారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరుగుతున్నాయనే అనుమానాలపై ప్రతిపక్షాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో ఓటర్ల సంఖ్య, ఓట్ల తొలగింపుపై పలు ప్రశ్నలు ఉన్నాయని పేర్కొంటూ.. పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించారనే ఆరోపణలు చేశారు. ఈ గణాంకాలు.. వాటి వెనుక ఉన్న కారణాలు ఎన్నికల సంఘం అధికారిక వివరాలతో పోల్చి పరిశీలించాల్సిన అంశాలు. ఓటర్ల జాబితాల సవరణలో అర్హులైన పౌరుల పేర్లు తొలగిపోకుండా చూడాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, నిరసన కార్యక్రమాల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీలోనే ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశించగా.. పార్టీ నాయకత్వం నుంచి తదుపరి సూచనలు వచ్చే వరకు ఢిల్లీ నుంచి తిరుగు ప్రయాణం చేయవద్దని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల సంఘం వ్యవహారశైలి, ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ చేపట్టిన నిరసనలు రాబోయే రోజుల్లోనూ కొనసాగుతాయా అనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే తెలంగాణ నేతలు ఢిల్లీలో ఎంతకాలం ఉండనున్నారు.. అనే అంశాలపై తదుపరి పరిణామాలు కీలకం కానున్నాయి.

# నకిలీ పత్తి విత్తనాల అక్రమ వ్యాపారం.. మాజీ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

వివరించారు. అనంతరం నకిలీ విత్తనాల వ్యాపారంలో వెంకటేష్ సహకరించడంతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఆరె వేణుగోపాల్ రెడ్డిని పరిచయం చేసినట్లు సల్మాన్ ఆరోపించాడన్నారు. 2026లో ఈ వ్యాపారం కొనసాగించేందుకు వెంకటేష్‌ను సంప్రదించగా, ప్రతి కిలో విత్తనానికి రూ.100 కమీషన్ ఇస్తే సహకరిస్తానని చెప్పినట్లు సల్మాన్ వాంగ్మూలంలో వెల్లడైనట్లు తెలిపారు. ఏ–1, ఏ–2 వాంగ్మూలాల ప్రకారం సుమారు రూ.20 లక్షల విలువైన 40 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను మూడు విడతల్లో ఏ–1కు సరఫరా చేసినట్లు దర్యాప్తులో తేలిందని ఎస్పీ పేర్కొన్నారు. వాటిలో 35 క్వింటాళ్లను మధ్యవర్తులకు విక్రయించి, మిగిలిన ఐదు క్వింటాళ్లను నేన్నెల మండలంలోని ఓ పౌల్ట్రీ ఫారంలో నిల్వ ఉంచినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఆగస్టు 11న మిగిలిన విత్తనాలను తీసుకెళ్లేందుకు ఏ–1, ఏ–2 అక్కడికి వెళ్లి సుమారు రెండు క్వింటాళ్ల విత్తనాలను కారులో లోడ్ చేసుకుంటుండగా ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వద్ద పట్టుబడ్డారని వివరించారు. న్యాయస్థానం అనుమతి పొందిన అనంతరం నిందితులను పోలీస్ కస్టడీలోకి తీసుకుని విచారించగా, అదనంగా 200 కిలోల (రెండు క్వింటాళ్ల) నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఏ–1కు సంబంధించిన కాల్ డీటెయిల్స్ రికార్డులను పరిశీలించగా, సల్మాన్‌కు, వెంకటేష్‌కు మధ్య ఫోన్ సంభాషణలు జరిగినట్లు గుర్తించామని ఎస్పీ తెలిపారు. ఏ–1, ఏ–2 వాంగ్మూలాలు, విత్తనాల స్వాధీనానికి సంబంధించిన రికార్డులు, కాల్ డీటెయిల్స్, ఇతర ఆధారాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం వెంకటేష్‌ను ఏ–3గా గుర్తించామన్నారు. అక్టోబర్ 12న ఉదయం సుమారు 6 గంటలకు కాగజ్‌నగర్ పట్టణంలోని అతడి నివాసంలో అదుపులోకి తీసుకుని, చట్టపరమైన ప్రక్రియ అనంతరం అరెస్ట్ చేసినట్లు తెలిపారు. న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్ విధించిందని వెల్లడించారు. వెంకటేష్‌కు సంబంధించి దర్యాప్తులో మరో రెండు కేసులతో పాటు ప్రస్తుత కేసు వివరాలు వెలుగులోకి వచ్చాయని పోలీసులు తెలిపారు. ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 250/2026లో 40 కిలోల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకోగా, ఐదుగురు నిందితులు ఉన్నారు. రెబ్బెన పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 223/2026లో 40 కిలోల విత్తనాలను స్వాధీనం చేసుకోగా, ముగ్గురు నిందితులు ఉన్నారు. ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 292/2026లో 400 కిలోల విత్తనాల స్వాధీనం నమోదైందని, ఈ కేసులో ముగ్గురు నిందితులు ఉన్నారని వివరించారు. ఈ మూడు కేసులూ బీఎన్ఎస్ సెక్షన్ 318(4), సీడ్స్ యాక్ట్ సెక్షన్ 19, పర్యావరణ పరిరక్షణ చట్టం సెక్షన్ 15(1) కింద నమోదయ్యాయని తెలిపారు. జిల్లాలో ప్రస్తుత సంవత్సరంలో నకిలీ విత్తనాలకు సంబంధించి మొత్తం 17 కేసులు నమోదు కాగా, 53 మంది నిందితులు ఉన్నారని ఎస్పీ వెల్లడించారు. వీరిలో 37 మందిని అరెస్ట్ చేయగా, మరో 16 మందిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు 2,317 కిలోల (23.17 క్వింటాళ్ల) నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.54,54,518గా అంచనా వేసినట్లు తెలిపారు.

నకిలీ విత్తనాల తయారీ, కొనుగోలు, విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడేవారిపై జిల్లా పోలీసులు నిరంతరం నిఘా ఉంచి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నారని ఎస్పీ నితికా పంత్ స్పష్టం చేశారు. రైతులు పత్తి విత్తనాలను అధీకృత డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా కొనుగోలు బిల్లు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాల విక్రయం లేదా సరఫరాపై అనుమానం కలిగితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. నిందితుల హోదా, పలుకుబడితో సంబంధం లేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, రైతుల ప్రయోజనాలను కాపాడటం, నకిలీ వ్యవసాయ ఉత్పత్తుల అక్రమ వ్యాపారాన్ని అరికట్టడం పోలీసుల ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## ఓట్ల చోరీలో సీఈసీ ప్రధాన సూత్రధారి కాదు

మొదటి పేజీ తరువాయి

తెలుసని రాహుల్‌గాంధీ ఆరోపించారు. సీఈసీ ఎదుర్కొంటున్న ఒత్తిడి ఎలాంటిదో తమకు అర్థమవుతోందని అన్నారు. తాము క్షమించే గుణం ఉన్నవారమని, క్రూరులం కాదని పేర్కొంటూనే రాజ్యాంగ పరిరక్షణ విషయంలో వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. ఓట్ల చోరీ ఆరోపణలపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు ప్రతిపక్షాలు చేపట్టనున్న ర్యాలీకి ముందు రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు.

## కుప్పానికి కృష్ణా జలాలు తీసుకెళ్తుంటే..

మొదటి పేజీ తరువాయి

వదిలేస్తుంటే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాటిని ఒడిసిపట్టుకుంటున్నారని విమర్శించారు. కృష్ణా జలాలను కుప్పం వరకు తీసుకెళ్లి అక్కడ జలహారతి ఇస్తున్న చంద్రబాబు, తన నియోజకవర్గానికి నీటిని అందిస్తుంటే తెలంగాణ ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారని నిలదీశారు. చంద్రబాబు చర్యలకు రేవంత్‌రెడ్డి పరోక్షంగా సహకరిస్తున్నారా? అంటూ ప్రశ్నించారు. గోదావరి నుంచి పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు 500 టీఎంసీల నీటిని ఎత్తిపోశామని చంద్రబాబు ప్రకటించిన విషయాన్ని హరీశ్‌రావు ప్రస్తావించారు. పట్టిసీమ ద్వారా తరలించిన నీటితో కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాలతోపాటు డెల్టా ప్రాంతాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగునీటిని అందిస్తోందన్నారు. మరోవైపు తెలంగాణలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేసి, శ్రీశైలం నుంచి వెలిగొండకు, కుప్పానికి నీటిని తరలించేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. గోదావరిలోని కన్నెపల్లి వద్ద మోటార్లను ఎందుకు నడపడం లేదని ప్రశ్నించిన హరీశ్‌రావు.. గతంలో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ) పేరుతో ప్రభుత్వం తప్పించుకుందని విమర్శించారు. దేవాదుల వద్ద గతంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టు అందుబాటులో ఉన్నప్పటికీ, మోటార్లను 24 గంటలపాటు ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు. రోజుకు ఎనిమిది గంటలే మోటార్లు నడుపుతామని ప్రభుత్వం చెబుతోందని, నీటి లభ్యత లేకపోవడం సమస్య కాదని, ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణమని ఆరోపించారు. పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. శ్రీశైలం నుంచి తెలంగాణ ప్రభుత్వం నీటిని ఎత్తిపోకపోవడంతో పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నీరు తరలిపోతోందని, వెలిగొండతోపాటు కుప్పానికి కూడా నీరు చేరుతోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో లేని కరువు పరిస్థితులు తెలంగాణలో ఎందుకు నెలకొన్నాయని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టుల మోటార్లను సమర్థంగా నడిపించి రైతులకు నీరందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు.. రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ

మొదటి పేజీ తరువాయి

గవర్నర్‌గా బ్రిజ్ మోహన్ రామ్, ఉత్తరాఖండ్ గవర్నర్‌గా డాక్టర్ ధల్ సింగ్ బిసేన్ నియమితులయ్యారు. కొత్త గవర్నర్ల నియామకాలు వారు ఆయా రాష్ట్రాల్లో పదవీ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్రపతి కార్యాలయం స్పష్టం చేసింది. ఈ నియామకాలతో నాలుగు రాష్ట్రాలకు కొత్తగా గవర్నర్లు బాధ్యతలు చేపట్టనుండగా, మరో రెండు రాష్ట్రాలకు గవర్నర్ల బదిలీలు జరిగాయి. రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ గతంలో గోవా అసెంబ్లీ స్పీకర్‌గా, హిమాచల్‌ప్రదేశ్, బిహార్ రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేశారు.

## హైదరాబాద్ చిన్నారి హత్య

మొదటి పేజీ తరువాయి

మల్కాజ్‌గిరి సీపీ సుమతి మీడియా సమావేశంలో వెల్లడించారు. బొల్లారం పరిధిలోని సీడ్ వర్క్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో రీసెర్చ్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న మిల్టన్ ఫెర్నాం డెజ్ మోసెస్ కుమార్తె ఆరేలియా (5) అక్టోబర్ 10న సాయంత్రం కిడ్నాప్‌కు గురైంది. అదే రోజు రాత్రి 7.45 గంటల సమయంలో కిడ్నాపర్ చిన్నారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి రూ.20 లక్షలు డిమాండ్ చేశాడు. దీంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మల్కాజ్‌గిరి పోలీసులతో పాటు ఎస్‌వోటీ, క్రైమ్స్, స్పెషల్ బ్రాంచ్ విభాగాలకు చెందిన సిబ్బందితో పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలు, మొబైల్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు నిర్వహించారు. నాలుగు గంటల్లో 130 సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించినప్పటికీ చిన్నారి ఆచూకీ లభించలేదు. దీంతో గేటెడ్ కమ్యూనిటీ మొత్తం తనిఖీ చేయగా, సెల్లార్‌లోని నీటి తొట్టెలో చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం సెక్యూరిటీ గార్డులను విచారించగా విక్రమ్ కుమార్ నేరాన్ని అంగీకరించినట్లు సీపీ సుమతి తెలిపారు. డబ్బు కోసం చిన్నారిని కిడ్నాప్ చేసిన నిందితుడు.. తల్లిదండ్రులు రూ.25 లక్షలు ఇచ్చేంతవరకు ఆమెను తన వద్ద ఉంచుకోవడం కష్టమని భావించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. చిన్నారి కాళ్లు, చేతులు కట్టి సెల్లార్‌లోని నీటి తొట్టెలో పడేసి హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడని తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నట్లు సీపీ వివరించారు. ఈ ఘటన నేపథ్యంలో గేటెడ్ కమ్యూనిటీల్లో భద్రతా సిబ్బంది నియామకానికి ముందు వారి వ్యక్తిగత వివరాలు, నేపథ్యాన్ని తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని సీపీ సూచించారు. సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మెన్లు, ఇంటి పనివారి వివరాలను నమోదు చేసుకుని భద్రతా చర్యలు పటిష్ఠం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అక్టోబర్ 21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



## అక్టోబర్ 31 వరకు వివిధ కార్యక్రమాలు... వ్యాసరచన, షార్ట్‌ఫిల్మ్స్, ఫోటోగ్రఫీ పోటీలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, అక్టోబర్ 12 : దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ జిల్లాలో అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు వివిధ సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ప్రజలకు పోలీసు సేవలు, బాధ్యతలు, హక్కులపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా ఓపెన్ హౌస్, రక్తదాన శిబిరాలు, ర్యాలీలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు, పోలీస్ అమరవీరుల కుటుంబాల పరామర్శ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోలీసుల విధులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, ప్రజల భద్రతలో పోలీసుల పాత్రను వివరించనున్నారు. పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో బహిరంగ ప్రదేశాల్లో అమరవీరుల త్యాగాలను తెలియజేస్తూ పాటల కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రధాన కూడళ్లలో సంస్మరణ బ్యానర్లు ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులు, పోలీస్ సిబ్బందికి తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు సైబర్ నేరాల నివారణలో పోలీసులు, పౌరుల పాత్ర; డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు మాదకద్రవ్యాలకు ఎలా దూరంగా ఉండాలి అనే అంశాలపై పోటీలు ఉంటాయి. డిగ్రీ, ఆపై చదువుతున్న విద్యార్థులకు సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర, తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో తమ పాత్ర అనే అంశాలను కేటాయించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి పోలీస్ సిబ్బందికి ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుంచి ఆశించే సేవలు, పోలీసుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర, దాని దుర్వినియోగాన్ని నివారిస్తూ వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాలకు వినియోగించుకునే విధానాలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. ఎస్ఐ, ఆపై స్థాయి అధికారులకు ప్రజల మన్ననలు పొందేందుకు పోలీసులు చేయాల్సిన కృషి, పోలీసు వ్యవస్థను బలోపేతం చేసే మార్గాలు అనే అంశాలపై పోటీలు ఉంటాయి. వ్యాసం 500 పదాలకు మించకూడదని, ప్రతి విభాగంలో ప్రతిభ కనబరిచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు, యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల కోసం షార్ట్‌ఫిల్మ్, ఫోటోగ్రాఫీ పోటీలు కూడా నిర్వహించనున్నారు. పోలీసుల సేవలు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాల నిర్మూలన, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసుల సేవలు తదితర అంశాలపై ఫోటోలు, వీడియోలు రూపొందించవచ్చు. షార్ట్‌ఫిల్మ్ నిడివి మూడు నిమిషాలకు మించకూడదు. ఉత్తమ ఎంట్రీలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు తమ ఫోటోలు, వీడియోలను అక్టోబర్ 24వ తేదీలోపు చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పై అంతస్తులోని ఐటీ కోర్ విభాగంలో ఐటీ కోర్ సీఐ రామకు అందజేయాలని ఎస్పీ సూచించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని రోహిత్ రాజు పిలుపునిచ్చారు.

# అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్

## - ఇందిరమ్మ మహిళా డెయిరీ పథకం అమలులో పారదర్శకత పాటించాలి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, అక్టోబర్ 12 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవం ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ, పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డితో కలిసి బతుకమ్మ వేడుకలు, ఇందిరమ్మ మహిళా డెయిరీ పథకం అమలుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2011లో బతుకమ్మ పండుగ గురించి పెద్దగా వినలేదని, నేడు ఈ పండుగ తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని పేర్కొన్నారు. పండుగ వైభవంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, మహిళలు బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, నిమజ్జన ప్రాంతాల్లో ఈతగాళ్లు, మైక్ ద్వారా ప్రకటనలు చేసే వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని, ప్రతి మండలం నుంచి కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని సూచించారు. బతుకమ్మ కార్యక్రమాల్లో మహిళల ఆరోగ్యం, కౌమారదశ బాలికల ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలన్నారు. ఇందిరమ్మ మహిళా డెయిరీ పథకంపై సమీక్షిస్తూ మొదటి విడత యూనిట్ల మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలని, పశువుల కొనుగోలుకు సంబంధించి రెండు రోజుల్లో క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించాలని ఆదేశించారు. పథకం అమలులో అవినీతికి తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశువులు పొందే లబ్ధిదారులకు సోలార్ రూఫ్‌టాప్‌తో కూడిన షెడ్డు ఏర్పాటు చేసేలా చూడాలని, యూనిట్ వ్యయం, ప్రభుత్వ ఆర్థిక సహాయం, లబ్ధిదారుడి వాటా వివరాలతో సమగ్ర ప్యాకేజీ రూపొందించాలని సూచించారు. మండలాల జనాభా ఆధారంగా క్లస్టర్లను గుర్తించి, అవసరమైన సదుపాయాలతో ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు పశుగ్రాసం ఉత్పత్తి, పాల సేకరణ, శుద్ధి వంటి బాధ్యతలు అప్పగించేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఒక్కో క్లస్టర్‌లో 500 పశువులు ఉంటే ఏడాది పొడవునా అవసరమయ్యే పశుగ్రాసాన్ని ముందుగానే అంచనా వేయాలని సూచించారు. ఎండు గడ్డి, పచ్చి పశుగ్రాసం, మిశ్రమ పశుగ్రాసం తయారీకి అవసరమైన సదుపాయాలను సమగ్ర ప్యాకేజీలో భాగంగా ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 10 నుంచి 18వ తేదీ వరకు శాఖల వారీగా రోజువారీ షెడ్యూల్ ప్రకారం బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అక్టోబర్ 18న పెవిలియన్ గ్రౌండ్స్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధాన కూడళ్లలో పూల బతుకమ్మలను ఏర్పాటు చేయడంతో పాటు ట్యాంక్‌బండ్‌లు, చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను గ్రామపంచాయతీలు, మున్సిపల్ శాఖలు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ ఐలాండ్లను అలంకరించి బతుకమ్మ నమూనాలను ఏర్పాటు చేయాలని, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మాతా శిశు ఆరోగ్య కేంద్రాల్లో పండుగ వాతావరణం కల్పించాలని తెలిపారు. ఆడపిల్ల జన్మించిన సందర్భాల్లో మిఠాయిలు పంపిణీ చేసి వేడుకలు నిర్వహించడం ద్వారా బాలికల పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలని సూచించారు. ప్రసూతి వార్డుల్లోనూ బతుకమ్మ సంబరాలు నిర్వహించాలన్నారు. పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో బతుకమ్మ ఇతివృత్తంతో విద్యుద్దీపాలంకరణలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. దేవాలయాలు, బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లలోనూ పండుగ ప్రత్యేకతను ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారులను భాగస్వాములను చేస్తూ క్రీడా కార్యక్రమాలు చేపట్టాలని, బాలల సంరక్షణ గృహాలు, వృద్ధాశ్రమాలను సందర్శించి అక్కడి వారిని వేడుకల్లో భాగస్వాములను చేయాలని తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# యజమానులు, కార్మికుల మధ్య సఖ్యతే కీలకం : ఎస్‌కే సాబీర్ పాషా



## - హోటల్ రంగం అభివృద్ధికి ఇరువర్గాల ఐక్యత అవసరం
## - హోటల్ యాజమాన్యాలు, కార్మికుల సమావేశానికి అఖిలపక్ష నేతల సంఘీభావం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, అక్టోబర్ 12 : హోటల్ రంగంలో యజమానులు, కార్మికుల మధ్య పరస్పర అవగాహన, సఖ్యత, ఐక్యత ఎంతో కీలకమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ఇరువర్గాలు ఒకే కుటుంబ సభ్యుల్లా పరస్పరం గౌరవించుకుంటూ, సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. పాల్వంచ పట్టణంలో సోమవారం హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలు, కార్మికులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాబీర్ పాషా మాట్లాడుతూ కార్మికుల శ్రమ, యజమానుల నిర్వహణా పాత్ర రెండూ హోటల్ రంగం అభివృద్ధిలో సమాన ప్రాధాన్యత కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాణ్యమైన ఆహారాన్ని అందించడంలో పాల్వంచకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. ఉద్యోగులు, ముఖ్యంగా భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేసే కుటుంబాలకు హోటళ్లు, రెస్టారెంట్లు సమయాన్ని ఆదా చేస్తూ సేవలందిస్తున్నాయని, అదే సమయంలో వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ రంగానికి ఇబ్బందులు కలిగించే పరిస్థితులు ఏర్పడితే పాల్వంచ ప్రాంతానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. పనిచేసే చోట యజమానులు, కార్మికుల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తితే వాటిని చర్చల ద్వారా అంతర్గతంగా పరిష్కరించుకోవాలని సాబీర్ పాషా సూచించారు. సమస్యలను పరిష్కరించుకునే క్రమంలో మూడో పక్షం జోక్యానికి ఆస్కారం ఇవ్వకూడదన్నారు. బయటి వ్యక్తుల ప్రమేయంతో అపోహలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు జరిగితే ఇరువర్గాలకూ నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. అలాంటి పరిణామాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఎం జిల్లా నాయకుడు దొడ్డ రవి, సొసైటీ వైస్ చైర్మన్ కంపల్లి కనకేష్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాజు గౌడ్, కాంగ్రెస్ నాయకుడు సాదం రామకృష్ణ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కందగట్ల సురేందర్, భద్రాచలం పట్టణ హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మినీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ జిందా, వాసు రాజు తదితరులు మాట్లాడుతూ కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడటంతో పాటు వ్యాపారాలు సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు సహకరిస్తాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో యజమానులు, కార్మికులు సంయమనం పాటిస్తూ ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. హోటల్స్ యాజమాన్యులు, కార్మికుల సంఘం అధ్యక్షుడు వీసంశెట్టి విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, సీపీఎం నాయకుడు కే. సత్య, హోటల్ యజమానుల సంఘాల నాయకులు గడపల్లి వీరభద్రరావు, పోపుల నాగేశ్వరరావు, శ్రీను, ఎండీ కాజా, రెడ్డి, సంక్రాంతి రవి, ఎస్.ఆర్. రెడ్డి, కృష్ణ, నాగవేణి, హోటల్ కార్మికులు వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివాస్, కాసింబి, శశి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు ఏరియాలో ఉత్పత్తి, రవాణా లక్ష్యాలు సాధించాలి



## - రోజుకు 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిపై డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ దిశానిర్దేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, అక్టోబర్ 12 : సింగరేణి మణుగూరు ఏరియాలో రోజుకు 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, రవాణా చేసే లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ సూచించారు. సోమవారం ఆయన ఏరియాలో పర్యటించి, జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్‌తో కలిసి కేఎచ్‌సీహెచ్‌పీ, పీకేఓసీ-2 బొగ్గు బెంచ్, పీకేఓసీ-4 కంటిన్యూయస్ మైనర్ ప్రాంతాలను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. కేఎచ్‌సీహెచ్‌పీలో బొగ్గు ప్రాసెసింగ్, క్రషర్ల పనితీరును పరిశీలించిన డైరెక్టర్.. క్రషర్ల నిర్వహణ, మరమ్మతులను సకాలంలో చేపట్టి నిరంతరాయంగా పనిచేసేలా చూడాలని సూచించారు. షెల్ పికింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తూ బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బ్లాస్టింగ్ సమయంలో తగిన చర్యలతో బొగ్గు సరైన పరిమాణంలో లభించేలా చూడాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. పీకేఓసీ-2 బొగ్గు బెంచ్ వద్ద ఉత్పత్తి పనులను పరిశీలించి, రోజువారీ, నెలవారీ లక్ష్యాల సాధనకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. అవసరమైన షావెల్స్‌ను ఏర్పాటు చేయడంతోపాటు భారీ యంత్రాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. బాటమ్ బెంచ్‌ల వద్ద నిల్వ ఉన్న నీటిని త్వరగా తొలగించి బొగ్గు వెలికితీతకు ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. పీకేఓసీ-4లో బొగ్గు ఉత్పత్తి, ఓవర్‌బర్డెన్ తొలగింపు పనులను సమీక్షించి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. గని అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా చేపడుతూ భవిష్యత్తులో నిరంతర బొగ్గు ఉత్పత్తికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, భారీ యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా విభాగాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచి, ఉత్పత్తి చేసిన బొగ్గును సకాలంలో రవాణా చేయాలన్నారు. అందుబాటులో ఉన్న యంత్రాలు, మానవ వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ పూర్తిస్థాయి పని గంటలను సద్వినియోగం చేసుకోవాలని, రక్షణ, నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ ఉత్పత్తిని పెంచాలని ఎల్.వి. సూర్యనారాయణ దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్‌తో పాటు పీకేఓసీ ప్రాజెక్టు అధికారి బి. శ్రీనివాస చారి, ఏజీఎం (ఐఈడీ) సి.హెచ్. రాంబాబు, ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేశ్, ఏరియా ఇంజినీర్ వి. మధన్ నాయక్, డీజీఎం (కేఎచ్‌సీహెచ్‌పీ) ఆర్.ఎస్. గౌడే, ప్రాజెక్ట్ మేనేజర్ సౌరభ్ సుమన్, మేనేజర్ (ఆపరేషన్స్) సురేశ్, క్వాలిటీ హెచ్‌ఓడీ నాగరమేష్, ఏరియా రక్షణ అధికారి జి. నాగేశ్వరరావు, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేశ్, సీనియర్ ఎస్టేట్స్ అధికారిణి కే. స్వప్న, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ సాయిల సురేశ్‌తో పాటు ఇతర మేనేజర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ

## - కలెక్టరేట్‌లో వైభవంగా ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు
## - మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, అక్టోబర్ 12 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ప్రకృతిని పూజించే గొప్ప పండుగ అని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖ మహిళా అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా పసుపు, కుంకుమ, పూలతో గౌరమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో అందంగా బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడుతూ ఆటలతో సందడి చేశారు. మహిళలతో కలిసి అదనపు కలెక్టర్ బతుకమ్మ ఆడుతూ వారిని ఉత్సాహపరిచారు. బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో గౌరమ్మను పూజిస్తూ, మహిళలంతా ఒకచోట చేరి ఆటపాటలతో జరుపుకోవడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రత్యేకతను చాటుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది బతుకమ్మ సంబరాల్లో పాల్గొని గౌరమ్మకు పూజలు నిర్వహిస్తూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు.

# పాల్వంచలో వరుణ్ స్కేటింగ్ అండ్ కరాటే అకాడమీ ప్రారంభం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, అక్టోబర్ 12 : యువత క్రీడారంగంలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాల్వంచ సొసైటీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ పట్టణంలోని 45వ డివిజన్ ముజిందర్ ఎస్టేట్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన వరుణ్ స్కేటింగ్ అండ్ కరాటే అకాడమీని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ ఏడుకొండలు యాదవ్‌ను ప్రజాప్రతినిధులు అభినందించారు. అనంతరం కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. స్కేటింగ్, కరాటే వంటి క్రీడలు చిన్నారులు, యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు దోహదపడతాయని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ తడకమల్ల ప్రణీత్, కార్పొరేటర్లు డాక్టర్ బి.ఎస్. రావు, కొత్వాల విమలాదేవి, బానోత్ బాలునాయక్, దంతెబోయిన నరేష్, సీరపు సుగుణ, ఖమ్మం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్కేటింగ్ కోచ్ కె. సురేష్, ప్రముఖ వైద్యులు సునీల్, కిరణ్, ముజిందర్ ఎస్టేట్ యజమాని దీపక్, కరాటే మాస్టర్ డి. వాసు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

## - పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి
## - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, అక్టోబర్ 12 : ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను సమీక్షించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు తమ దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ డబుల్ బెడ్ రూమ్ లపై సమగ్ర విచారణ చేపట్టాలి కలెక్టర్‌కు వినతి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖానాపూర్, అక్టోబర్ 12 : ఖానాపూర్ పట్టణంలోని కొమురం భీమ్ చౌరస్తాలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు జరిగాయని, వాటిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ మాట్లాడుతూ.. భూమి, ఇల్లు లేని నిరుపేదల కోసం నిర్మించిన ఇళ్లను నిబంధనలకు విరుద్ధంగా అప్పటి పాలకులు, అధికారులు తమ అనుచరులకు కేటాయించారని ఆరోపించారు. విచారణ పేరుతో ఏళ్లుగా కాలయాపన జరుగుతోందని, లబ్ధిదారుల జాబితాను పూర్తిగా పరిశీలించి, ప్రతి ఒక్కరి కుటుంబ వివరాలు, సొంత ఇల్లు, స్థలం, ఆదాయాన్ని క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అనర్హులను తొలగించి అర్హులైన నిరుపేదలకు వెంటనే ఇళ్లు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, డబుల్ బెడ్ రూమ్ సాధన కమిటీ కన్వీనర్ తోటరాద, కో-కన్వీనర్ షేక్ గౌస్, మజ్జిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ బస్ స్టాండ్ లో బేబీ ఫీడింగ్ రూమ్ ను ఏర్పాటు చేయాలి




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖానాపూర్, అక్టోబర్ 12 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ ఆర్టీసీ బస్ స్టాండ్ లో బేబీ ఫీడింగ్ రూమ్ (శిశువులకు పాలిచ్చే గది) ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ ఖానాపూర్ యంగ్ స్టార్ యూత్ అధ్యక్షుడు షేక్ షకీల్ మండల స్థాయి ప్రజావాణిలో తహసీల్దార్ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖానాపూర్ ఆర్టీసీ బస్ స్టాండ్ నిత్యం రద్దీగా ఉంటుందని, ఇక్కడికి జిల్లా నలుమూలల నుండి వందలాది మంది మహిళలు తమ చిన్నారులతో ప్రయాణిస్తుంటారని తెలిపారు. బస్ స్టాండ్ లో పాలిచ్చే గది లేకపోవడం వల్ల బాలింతలు, పసిపిల్లల తల్లులు తమ చంటి పిల్లలకు పాలు ఇవ్వడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశంలో పాలు ఇవ్వలేక మహిళలు ఇబ్బంది పడుతున్నారని, ఇది మహిళల గోప్యత, శిశువుల ఆరోగ్యానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. కావున మహిళల ఇబ్బందులను అర్థం చేసుకుని, వెంటనే ఖానాపూర్ బస్ స్టాండ్ లో ఒక ప్రత్యేక బేబీ ఫీడింగ్ రూమ్ ను ఏర్పాటు చేసి మహిళలకు అండగా నిలవాలని కోరారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No . 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com